fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 32 | విజయవాడ, శుక్రవారం 2 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

గ్రూప్-1 ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 పోస్టుల ఫలితాలు వెలువడ్డాయి. రాష్ట్రంలో 78 పోస్టులకు గత ఏడాది ఆగస్టు 17 నుంచి 28 వరకు ఎపిపిఎస్‌సి నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను గురువారం వెల్లడించింది. 78 పోస్టుల్లో 5 డిప్యూటీ కలెక్టర్లు, 13 కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లు, 6 డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌లు, 24 డిఎస్పీ (డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్) పోస్టులు, 10 ఎక్సైజ్ డీఎస్పీ పోస్టులు, 2 డిస్ట్రిక్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు, 8 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2 పోస్టులు, 10 అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ పోస్టులు ఉన్నాయి. మొత్తం 151 మంది ఎంపికయ్యారు. వీరికి మార్చి 12 నుంచి 23 వరకు విజయవాడలోని ఎపిపిఎస్‌సి కార్యాలయంలో ఇంటర్వ్యూలుంటాయి. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్ సహా హాజరు కావాల్సి ఉంటుంది.

ఎన్నికల మాయ



పథకాలు ఘనం... నిధులు అయోమయం
కార్పొరేట్లకు రాయితీలు ప్రజలపై భారాలు

- పాతవాటికే మాటల హంగు
- కీలక శాఖలకు పెంపు అంకెల్లోనే
- కార్పొరేట్ల వైపే మొగ్గు
- తగ్గిన ప్రత్యక్షపన్నుల వాటా
- పరోక్షపన్నుల ద్వారానే అధికాదాయం
- తగ్గనున్న ఉపాధి అవకాశాలు

సాధారణ ఎన్నికలకు ముందు సమర్పించిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మోహినీ విన్యాసం ప్రదర్శించారు. సామాన్య ప్రజానీకాన్ని మాయ మాటలతో మభ్యపెట్టి కార్పొరేట్లపై వరాల జల్లు కురిపించారు. పంటలకు కనీస మద్దతు ధర, కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఆరోగ్యబీమా పథకాలకు నిధుల కేటాయింపులపై అయోమయం నెలకొంది. తాజా బడ్జెట్‌లో ఆర్థికశాఖ మంత్రి ఆర్భాటంగా ప్రకటించిన ఈ పథకాలు వాస్తవానికి కొత్తవే కావు! జాతీయ ఆరోగ్య పథకం కింద గత బడ్జెట్‌లోనే ప్రవేశ పెట్టి అమలుకు నోచుకోని బీమా పథకాన్నే ఈ సారి మరింత గట్టి స్వరంతో వినిపించారు. నిధులు మాత్రం పెంచలేదు. ఇప్పటికే రబీపంటలకు ప్రకటించిన ఉన్న మద్దతు ధర దేశ వ్యాప్తంగా ఎక్కడా అమలు కావడం లేదు. దానినే ఖరీఫ్ పంటలకూ విస్తరిస్తామని తాజాగా చెప్పారు. వ్యవసాయంతో పాటు అన్ని కీలకశాఖలకూ అంకెల్లో కేటాయింపులు పెరిగినట్లు కనిపించినప్పటికీ, జిడిపితో పోలిస్తే గత ఏడాదికన్నా తగ్గాయి. ఆదాయపన్ను పరిమితి నుండి అన్ని అంశాల్లోనూ సాధారణ ప్రజానీకానికి రిక్తహస్తాలు చూపిన జైట్లీ కార్పొరేట్లపై మాత్రం భిన్నంగా స్పందించారు. వారి ఆదాయం ఏటికేడాది పెరుగుతున్న ప్రత్యక్ష పన్నులను పెంచడానికి సాహసించలేదు. నిజానికి గతంతో పోలిస్తే ప్రత్యక్ష పన్నుల వాటా తగ్గింది. ఆ స్థానాన్ని పరోక్షపన్నులు భర్తీ చేయనున్నాయి. వివిధ జీవితబీమాతో పాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు ద్వారాలు తెరవడం కూడా కార్పొరేట్లకు ఉపమోగపడేదే! ఇక ప్రభుత్వం అనుసరించనున్న విధానాల కారణంగా ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గేఅవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి.

వివరాలు లోపలి పేజీల్లో...



ప్రగతిశీల బడ్జెట్

ఇది ప్రగతిశీలమైన, నవభారత స్వప్నాన్ని సాకారం చేసే బడ్జెట్. ప్రజల జీవన శైలితో పాటు వ్యాపారావకాశాలనూ సులభ తరం చేస్తుంది.

– ప్రధాని నరేంద్రమోడీ

అసంతృప్త పద్దు

బడ్జెట్ తీవ్రంగా నిరుత్సాహ పరిచింది. ద్రవ్యలోటు, ఎగుమతులు, వ్యవసాయం, ఆరోగ్యసంరక్షణ, ఉపాధి, పెట్టుబడులు, రుణాలు, కేటాయింపులు, పన్ను రిలీఫ్ వంటి రంగాలకు కేటాయింపులు అసంతృప్తకరంగా ఉన్నాయి.

– మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం



విదేశీ కంపెనీలకే లబ్ధి

ప్రజానుకూలమైనదిగా కనిపిస్తున్న ఈ బడ్జెట్ అసలు ఉద్దేశం విదేశీ బడా కంపెనీల ప్రయోజనాలే. ఇది కోతల బడ్జెట్. అంటే ఉపాధి అవకాశాలను తగ్గిపోతాయి. సంక్షేమ ఖర్చులు పెరిగిపోతాయి.


– సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి



ఆవేదనతో ఉన్నాం

బడ్జెట్ కేటాయింపులపై ఆవేదనతో ఉన్నాం. మిత్రపక్షంగా ఉన్నందున బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేం. మన అసంతృప్తిని కేంద్రానికి తెలిసేలా వ్యవహరించండి.

–టిడిపి ఎంపీలతో చంద్రబాబు



ఏపికి మళ్లీ అన్యాయం




- అరకొర విదిలింపులు
- కొన్నింటికి కేటాయింపులే లేవు
- రైల్వే జోన్ ఊసే లేదు
- ప్రాజెక్టుల ఊసెత్తని కేంద్రం
- కేంద్ర పన్నుల నుంచి ఏపి వాటాలో రూ.849 కోట్లు 'లోటు'



ప్రజాశక్తి-యంత్రాంగం

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న తెలుగు రాష్ట్రాలకు నిరాశే ఎదురైంది. విభజన హామీలు, రాజధానికి నిధుల వంటి అంశాలపై మాట మాత్రంగానైనా ప్రస్తావించకపోవడం తీవ్ర అసంతప్తి మిగిల్చింది. విభజన సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రానికి ఈ బడ్జెట్లోనైనా కొంత ఊరట లభిస్తుందని ఆశించినప్పటికీ ఫలితం లేకపోయింది. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కనీస ప్రస్తావన లేదు. రాజధాని నిర్మాణానికి నిధులు, ఆర్థిక సంఘం నిధులు, ద్రవ్య లోటును భర్తీ చేసేందుకు సాయం, ప్రాజెక్టుల ఊసెత్తలేదు. కొన్ని యూనివర్సిటీలు, ఒకటీ, రెండు సంస్థలకు సాధారణ కేటాయింపుల్లో భాగంగా నిధులు విదిల్చారు. విజయవాడ, విశాఖ మెట్రో ప్రస్తావనే చేయలేదు. వాణిజ్య రంగాలకు ఎటువంటి ప్రోత్సాహకాలూ ప్రకటించలేదు. అంతకుమించి పెద్దగా కేటాయింపులూ ఏమీ లేదు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల మాట్లాడుతూ ఈ బడ్జెట్ ముమ్మాటికీ ఎన్నికల బడ్జెట్టేనని వ్యాఖ్యానించారు. ఆదాయ పరిమితిని పెంచకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. రూ.21.51లక్షల కోట్ల అంచనాలతో 2018-19 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగం మొత్తంలో ఎక్కడా ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఒక్క అంశం కూడా ప్రస్తావన లేదు. మెగా ప్రాజెక్టులకు బడ్జెట్‌లో చోటూ కల్పించ లేదు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కి మొండి చెయ్యి చూపడంపై ఎపి ఎంపి శివప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మౌన ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్‌లకు రూ. 3018 కోట్లు కేటాయించగా, అందులో ఏపి ఎయిమ్స్‌కు కొంత వచ్చే అవకాశముంది. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీకి రూ.4 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.5 కోట్లు, ఇంటిగ్రేటేడ్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్‌కు రూ.632.61 కోట్లు కేటాయించారు. ఈ మూడు విభాగాల్లోంచి కొంత మొత్తంలో ఏపికి వచ్చే మిగతా 9లో

రాష్ట్రానికి కేటాయింపులు...	(రూ.కోట్లలో)
కేంద్రీయ విశ్వవిద్యాలయం	10
గిరిజన విశ్వవిద్యాలయం	10
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ	32
ఎన్ఐటి	54
ఐఐటి	50
ట్రిపుల్ ఐటి	30
ఐఐఎం	42
ఐఐఎస్‌సిఆర్	49
డ్రెడ్జింగ్‌కార్పొరేషన్	19.62
పరిశ్రమల వడ్డీ రాయితీకి	50
విశాఖ స్టీల్ ప్లాంట్	1,400
విశాఖ పోరు	108



ఇవి పెరుగుతాయి

- ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, కార్లు, మోటార్‌బైక్‌లు, టీవీలు, స్మార్ట్ వాచీలు, ఎల్‌సీడీ, ఎల్ఈడీ పరికరాలతో పాటు పలు.
- ట్రక్కు, బస్సు రేడియల్ టైర్లు, మొబైల్ ఫోన్ విడి భాగాలు, ల్యాంప్‌లు, లైటెనింగ్ ఫిట్టింగ్, ఇల్యుమినేటెడ్ సైన్స్.
- స్టాప్ వాచీలు, పాకెట్ వాచీలు, చేతి గడియారాలు, అలారం గడియారాలు.
- బంగారం, వెండి, ఇమిటేషన్ జ్యుయలరీ, రంగు రంగుల రాళ్లు, వజ్రాలు.
- చెప్పులు, సిల్క్ వస్త్రాలు, టూత్‌పేస్టులు.
- దిగుమతి చేసుకునే కూరగాయలు, పండ్ల రసాలు(ఆరెంజ్, క్రాన్‌బెర్రీ జ్యూస్‌లు కూడా), రిఫైన్డ్ వెజిటబుల్ ఆయిల్, వేరుశెనగ నూనె, ఆలివ్ నూనె, కొబ్బరి నూనె, సఫోలా నూనె
- ఫర్నీచర్, పరుపులు, మంచాలు
- మేనిక్యూర్, పెడిక్యూర్ ప్రిపరేషన్స్, బ్యూటీ, మేకప్ ఉత్పత్తులు, ఫర్‌ఫ్యూమ్‌లు, డియోడరంట్లు, సెంట్ స్ప్రేలు, సన్‌స్క్రీన్, సన్‌ట్యాన్
- షేవింగ్ ఉత్పత్తులు
- టాయిలెట్ స్ప్రే, టాయిలెట్ వాటర్స్
- పాన్ మసాలా, బీడీ, సిగరెట్ లైటర్లు, క్యాండిల్స్
- గాలిపటాలు, సన్‌గ్లాసెస్
- వీడియో గేమ్స్, పిల్లలు ఆడుకునే చక్రాల బొమ్మలు, ఫజిల్ గేమ్‌లు, ట్రైసైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్స్, తదితర బొమ్మలు
- క్రీడా వస్తువులు

రాజస్థాన్‌లో బిజెపికి 'షాక్'

- మూడు స్థానాల్లోనూ పరాభవం
- పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ గెలుపు

న్యూఢిల్లీ : రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి ఘోర పరాజయాన్ని చవిచూసింది. రాజస్థాన్‌లోని అజ్మీర్, అల్వార్ లోక్‌సభ నియోజక వర్గాలతో పాటు మండల్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గం లోనూ మొత్తం మూడు స్థానాలలో కాంగ్రెస్ విజయం సాధించింది. అల్వార్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కరణ్ సిర్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బిజెపి అభ్యర్థి జశ్వంత్ యాదవ్‌పై 1.44 లక్షల ఓట్లతో గెలిచారు. అజ్మీర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘుశర్మ 81,223 ఓట్ల ఆధికత్యతో గెలిచారు. బిజెపి అభ్యర్థి రామ్‌స్వ రూప్ లాంబా ఓడిపోయారు. మండల్‌గఢ్ అసెంబ్లీ నియోజక వర్గాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఈ నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్‌ధర్ తన సమీప ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి శక్తి సింగ్ హడాపై 12,976 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ నౌపర అసెంబ్లీ నియోజక వర్గంలో విజయం సాధించింది. తమ సమీప ప్రత్యర్థి, బిజెపి అభ్యర్థిపై 63,108 ఓట్ల ఆధిక్యతతో గెలిచింది. తృణమూల్ కాంగ్రెస్‌అభ్యర్థి 1,01,729 ఓట్లు సాధించగా, బిజెపి అభ్యర్థి సందీప్ బెనర్జీకు కేవలం 38,711 ఓట్లు మాత్రమే లభించాయి. ఉలుబెరియా లోక్‌సభ స్థానాన్ని కూడా తృణమూల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

కార్పొరేట్లకు వరాలు
వేతన జీవులకు నిరాశ

న్యూఢిల్లీ :250 కోట్ల రూపాయల వరకు లావాదేవీలు నిర్వహించే కంపెనీలకు కార్పొరేట్ పన్నులో 25 శాతం రాయితీని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇప్పటి వరకు ఈ పరిమితి 50 కోట్ల రూపాయలుగా ఉంది. ఒక్కసారిగా ఈ పరిమితిని ఐదురెట్లు పెంచటం ద్వారా వారికి ప్రభుత్వం పెద్దమొత్తంలో రాయితీని ఇచ్చింది. ఈ మినహాయింపు వలన ప్రభుత్వం 7,000 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతుంది. విద్యారంగానికి అదనంగా 11,000 కోట్ల రూపాయలు సమీకరించటం కోసం విద్యాసెస్సును 3 నుండి 4 శాతానికి పెంచారు. ప్రత్యక్షపన్నులలో కల్పించిన రాయితీల వలన గత సంవత్సరం ప్రభుత్వం 19,000 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయింది. బడ్జెట్ చూస్తే ప్రభుత్వం పరోక్షపన్నులు ఏమీ విధించనట్లుగా అనిపిస్తుంది. కాని సామాన్యులకు ఏ విధమైన మినహాయింపునూ ఇవ్వలేదు. ఆదాయ పన్ను శ్లాబ్‌లో ఏటువంటి మార్పు చేయలేదు. 2017 ఆర్థిక సంవత్సరంలో 85.51 లక్షల మంది కొత్తగా ఆదాయపు పన్ను చెల్లింపు రిటర్న్‌లు దాఖలు చేశారని ఆర్థికమంత్రి ప్రకటించాడు. 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఆదాయంపై 10 శాతం ఉన్న సర్‌ఛార్జి, కోటి దాటిన ఆదాయంపై విధిస్తున్న 15 శాతం సర్‌ఛార్జి వచ్చే సంవత్సరం కూడా యధావిధిగా కొనసాగుతాయి. సహకారసంఘాలకు 100 శాతం పన్ను రాయితీని కల్పించారు. వయోవృద్ధులు వడ్డీకోసం జీవితబీమా పథకాలలో పెట్టే పెట్టుబడులకు పన్ను మినహాయింపును 7.5 లక్షల నుండి 15 లక్షల రూపాయలకు పెంచారు. లక్ష రూపాయలకు మించిన దీర్ఘకాలిక పెట్టుబడి లాభాల(లాంగ్‌టెర్మ్ కాపిటల్ గెయిన్స్)పై 10 శాతం పన్ను విధించారు. స్వల్పకాలిక పెట్టుబడుల లాభాల(షార్ట్‌టెర్మ్ కాపిటల్ గెయిన్స్)పై 15 శాతంగా ఉన్న పన్ను యధావిధిగా కొనసాగుతుంది.



కొత్త కూతల్లేవ్..!

- ఒక్కటంటే ఒక్క కొత్త రైలు లేదు
- 1.48 లక్షల కోట్లతో రైల్వే పద్దు
- ఆస్తుల అమ్మకంతో నిధుల సమీకరణ
- నిరుద్యోగుల ఆశలపై నీళ్లు
- వైఫై..పైపై హంగులకే పెద్దపీట

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో రైల్వేలకు 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.1,48,528 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. అయితే ఇందులో మూడింట ఒక వంతు మాత్రమే ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేస్తామని చెప్పారు. మిగిలిన నిధులను వివిధ రూపాల్లో రైల్వే ఆస్తుల అమ్మకం ద్వారా, అప్పుల ద్వారా సమీకరించనున్నట్లు తెలిపారు. రైల్వేల చరిత్రలో ఇదే అత్యధిక మూలధన వ్యయ కేటాయింపుగా ఆయన పేర్కొన్నారు. కొత్త రైళ్లపై ఆశలు పెట్టుకున్న ప్రయాణికులపైనా జైట్లీ నీళ్లు జల్లారు. పద్దు భారీగా ప్రకటించినా టిక్కెట్ల ధరలను మాత్రం తగ్గించలేకపోయారు. రైల్వే ఖాళీల్లో సగం ఖాళీలను మాత్రమే అది కూడా క్యాజువల్ లేబర్‌తో భర్తీ చేస్తామని ప్రకటించడంతో ఉద్యోగాల కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత ఆశలు అడియాసలయ్యాయి. అన్ని రైల్వే స్టేషన్లు, రైళ్లలోనూ వైఫై సేవలను అందిస్తామని, అలాగే సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని జైట్లీ ప్రకటించారు. 92 ఏళ్ల సంప్రదాయానికి స్వస్తి పలికి గతేడాది రైల్వే బడ్జెట్‌ను కూడా కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేసిన సంగతి విదితమే. ఈ ఏడాది రైల్వేల ఆధునీకరణ, వైఫై వంటి హంగులపైనే శ్రద్ధ పెట్టారు. భద్రత, రైల్వే పట్టాల నిర్వహణ, సాంతికేత వినియోగం, మంచు కురిసే సమయాల్లో రక్షణ కల్పించే పరికరాలపై దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. ప్రధానంగా బిజెపి పాలిత రాష్ట్రాలకే కాస్తంత నిధులు దఖలు పర్చగా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకపైనా జైట్లీ కనికరించడం విశేషం. మన రాష్ట్రానికి సంబంధించి రైల్వే పద్దులో ఊరడించిందేమీ లేదు. కడప జిల్లాలోని ఓబుళవారిపెల్లి నుంచి నెల్లూరు జిల్లా వెంకటాచలం వరకు 95 కిలోమీటర్ల పొడవున కొత్త లైన్‌ను ప్రతిపాదించారు. విశాఖ రైల్వే జోన్ ఊసెత్తలేదు.

కీలకాంశాలు :

రోజువారీ వచ్చివెళ్లే ప్రయాణికుల సంఖ్య 25 వేల మంది పైగా ఉండే అన్ని స్టేషన్లలోనూ ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. దీని ప్రకారం దాదాపు 8000 స్టేషన్లలో ఎస్కలేటర్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి రైల్వే స్టేషన్‌లోనూ, రైలులోనూ వైఫై ద్వారా ఇంటర్నెట్ సేవలందించనున్నారు. ఇదే జరిగితే ప్రయాణికులకు ఎండ్ టు ఎండ్ (ఈ చివర నుంచి ఆ చివర వరకు) ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి రైల్వేగా భారత రైల్వే రికార్డులకెక్కనుంది. గుజరాత్‌లోని వడోదరలో ప్రత్యేకంగా హైస్పీడ్ రైల్వేల సిబ్బందికి శిక్షణ ఇచ్చే నిమిత్తం ఒక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పనున్నారు.



హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన సిబ్బందికి ఈ విశ్వవిద్యాలయంలోనే శిక్షణ ఇవ్వనున్నారు. బడ్జెట్ ప్రసంగ పేజీల్లో రైల్వే పద్దు రూ.1.48 కోట్లుగా ఉండగా..రైల్వేలు అవగాహన కోసం అందజేసిన ప్రతుల్లో రూ.1.46 కోట్లుగా బడ్జెట్‌ను పేర్కొనడంతో అధికారుల్లో కాస్తంత అయోమయం నెలకొంది.

600 మేజర్ రైల్వే స్టేషన్లను ఆధునీకరించనున్నారు. పూణే - లోనావాల మార్గంలో మూడవ, నాల్గవ రైల్వే లైను కోసం రూ.4,253 కోట్లు కేటాయించారు. ముంబయి లోకల్ ట్రైన్ నెట్‌వర్క్ విస్తరణ కోసం రూ.11వేల కోట్లతో 90 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ ట్రాక్స్ వేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే రూ.40 వేల కోట్లతో 150 కిలోమీటర్ల మేర అడిషనల్ సబర్బన్ నెట్‌వర్క్‌ను అబివృద్ధి చేస్తామన్నారు. రూ.17 వేల కోట్ల నిధులతో 160 కిమీ మేర బెంగళూరు సబర్బన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రతిపాదించారు. రైల్వేల విద్యుదీకరణపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని జైట్లీ తెలిపారు. 12,000 వ్యాగన్లు, 5,160 కోచ్‌లు, 700 లోకో మోటీవ్‌లను సమీకరించుకోనున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఏడాదిలో 18000 కిమీ మేర ట్రాక్‌ల డబ్లింగ్, అలాగే 5000 కిమీ మేర గేజ్ మార్పిడిపై దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ కింద రెండేళ్లలో దాదాపు 4267 కాపలా లేని లెవెల్ క్రాసింగ్‌లను పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. ఏడాదిలోగా 3,600 కిమీ మేర రైల్వే ట్రాక్‌లు పునరుద్ధరిస్తామన్నారు. మూడు నాలుగేళ్లలో పూర్తి స్థాయి విద్యుదీకరణ లక్ష్య సాధనలో భాగంగా వచ్చే ఏడాదిలోగా 4000 కిమీ మేర విద్యుదీకరణ పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. తమిళనాడులోని పరంబూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ రూపొందించిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ట్రైన్లను 2018-19లోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు.

జోన్ హుళక్కి

- బడ్జెట్లో ప్రస్తావించని కేంద్రం
- రైల్వేలో పాత ప్రాజెక్టులకే నిధులు
- కొత్త కేటాయింపులు లేనట్లే
- ఊసేలేని విశాఖ, విజయవాడ, అమరావతి మెట్రో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రైల్వే జోన్‌పై ఆశలు గల్లంతయ్యాయి. రైల్వే పరంగా అవకాశం లేకపోయినా రాజకీయ కోణంలో ఆమోదించొచ్చనే ఆశతో ఉన్న రాష్ట్ర ప్రజలకు నిరాశే మిగిలింది. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయడం వల్ల ఉత్తరాంధ్రకు ఉపయోగం ఉంటుందని ప్రాజెక్టుల పరంగానూ ముందుకెళ్లొచ్చని ప్రభుత్వం చెబుతూ వచ్చింది. బిజెపి నాయకత్వం కూడా జోన్ వస్తుందని చెబుతూనే ఉంది. బడ్జెట్లో జోన్ ప్రస్తావన లేకపోవడంతో అధికారం తెలుగుదేశం నోరెళ్ల బెట్టాల్సి వచ్చింది. ప్రకటించిన ప్రాజెక్టులు కూడా సాధారణంగా ఇచ్చేవే మినహా అదనంగా ఇచ్చిందేమీ లేవు. జాతీయస్థాయి పథకాల్లో భాగంగా ఇచ్చినవే ఉన్నాయి. దీనిపై కేంద్రమంత్రి సుజనాచౌదరి కూడా ఆగ్రహంతో ఉన్నారు. జోన్ విషయంలో అన్యాయం జరిగిందని, దీనిపై కేంద్రంతో మాట్లాడుతామని అన్నారు. జోన్ తెరిచిన అధ్యాయమేనని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. అమరావతిలో మెట్రో రైలు ప్రాజెక్టుకు ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. విజయవాడ, అమరావతి గుంటూరు కలిపే విధంగా రైల్వేలైను ప్రతిపాదనను గతంలోనే పెట్టారు. దీనిపైనా ప్రస్తావించలేదు. అలాగే విజయవాడ మెట్రో ఏర్పాటుకు సర్వేలు పూర్తయ్యాయి. గత బడ్జెట్లో సర్వే అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ సారి అది కూడా లేదు. విశాఖ మెట్రోకూ అన్యాయం జరిగింది. కీలక రైల్వే ప్రాజెక్టులేవీ ప్రస్తావించలేదు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో అన్ని రైల్వేలెవల్ క్రాసింగులను ఎత్తేయాలని నిర్ణయించారు. ముఖ్య ప్రాంతాల్లో రైల్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. తుని రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్‌ఓబికి అనుమతిచ్చారు. కోటిపల్లి నరసాపురం రైల్వేలైనుకు ఇప్పటి వరకూ 1080 కోట్లు కేటాయించారు. 2018 బడ్జెట్లో రూ.430 కోట్లు వచ్చారు. శ్రీకాళహస్తి నడికుడి రైల్వేలైనుకు రూ.450 కోట్లు, విజయవాడ-కాజీపేట మూడోలైనుకు రూ.100 కోట్లు కేటాయించారు. దీన్ని గత బడ్జెట్లో హైస్పీడు రైలుగా ప్రకటించారు. దీనికి అనుబంధంగా విజయవాడ నుండి చెన్నై వరకూ మరో అదనపు కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించారు. దువ్వాడ, రాజమహేంద్రవరం, ఒంగోలు, విజయవాడ రైల్వేస్టేషన్లను ఆధునీకరించాలని ఈ బడ్జెట్లో సంకల్పించారు. రాష్ట్రంలో కీలకమైన రైల్వేస్టేషన్లలో పాదచారుల వంతెనకు బదులుగా ఎస్కలేటర్లను నిర్మించాలని నిర్ణయించారు. పెద్దపల్లి, లింగంపేట మార్గంలో 83 కిలోమీటర్లు, గుంతకల్లు, కల్లూరు మార్గంలో 40 కిలోమీటర్లు, నల్గొండ లింగంగుంట్ల మార్గంలో 129 కిలోమీటర్లు విద్యుదీకరించనున్నారు. ఓబులవారిపల్లె, వెంకటాచం మధ్య 95 కిలోమీటర్ల మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే దేవరపల్లి, పెనుగొండ మధ్య 49 కిలోమీటర్లు డబ్లింగ్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. వీటికి మినహా కీలకమైన విజయవాడ స్టేషన్‌కు అనుసంధానంగా శాటిలైట్ స్టేషన్ల ఏర్పాటు ప్రస్తావన రాలేదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామన్నారు. దీన్ని వడోదరకు తరలించారు. విజయవాడ, చెన్నై మధ్య లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా దానికి నిధులు ఇవ్వలేదు. విజయవాడ-గూడూరు మూడో లైనుకు రూ.100 కోట్లు, - కడప-బెంగళూరు రైల్వే లైనుకు రూ.240 కోట్లు, - గుంతకల్-బళ్లారి హోస్పేట విద్యుదీకరణకు రూ.70 కోట్లు, విజయవాడ-గుడివాడ, మచిలీపట్నం-భీమవరం, నర్సాపూర్-నిడదవోలు డబ్లింగ్ పనులకు రూ.122 కోట్లు కేటాయింపులిచ్చారు.

ఆదర్శ రైల్వే స్టేషన్లు...

రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నాలతో పాటు గుంటూరు, వినుకొండ, మచిలీపట్నం, మంత్రాలయం, మార్కాపూర్, రాజమండ్రి, ఒంగోలు, దొనకొండ, ఆదోని, దువ్వాడ, బొబ్బిలి, పార్వతీపురం, కడప, తిరుపతి రైల్వే స్టేషన్లను ఆదర్శ రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నారు. రాజమండ్రి, తుని, రేణిగుంట, ధర్మవరం, బేతెంచర్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు.

ప్లాట్‌ఫారాల విస్తరణ

రాయనపాడు, గుంతకల్, పలాస, మార్కాపూర్, పాకాల, పానపాకం, నక్కనదొడ్డి, పుల్లంపేట, ఇచ్ఛాపురం, సాలూరు, కొత్త వలస, లక్కవరపు కోట, ఎస్ కోట, శివలింగాపురం, బొర్రా గుహలు, అరకు, సిమిలిగూడ రైల్వే స్టేషన్లలో భవిష్యత్తు అవసరాలకోసం నూతన ప్లాట్‌ఫారాల నిర్మాణానికి నిధులు కేటాయిం చారు.

రైతాంగాన్ని కాపాడలేని బడ్జెట్ : ఏపి రైతు సంఘం

కార్పొరేట్ల ప్రయోజనాలు తప్ప రైతాంగాన్ని కాపాడలేని విధంగా బడ్జెట్ ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై కేశవరావు, పి పెద్దిరెడ్డి తెలిపారు. పంటలకు మద్దతు ధర, ధరలస్థిరీకరణ నిధి కోసం రైతాంగం ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు పంటలకు ఒకటిన్నర రేట్లు మద్దతు ధరలు ఇస్తామని చెప్పటం తప్ప దానికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పలేదని తెలిపారు. ఈ ఏడాది పప్పుధాన్యాలు, మిర్చి, పసుపు, నిమ్మకాయలు, టమోటా వంటి ధరలు దారుణంగా పడిపోయాయని వివరించారు. పిపిపి పద్ధతిలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ పేరుతో సన్న, చిన్నకారు రైతాంగాన్ని కంపెనీలకు తాకట్టుపెట్టడమేనని తెలిపారు. మార్కెట్ల అభివృద్ధికి ఇస్తామన్న నిధుల్ని సైతం ఈనామ్ మార్కెట్లు ద్వారా కంపెనీల ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు, నిర్వాసితులకు అవసరమైన నిధులు గురించి ప్రస్తావనే లేదని తెలిపారు.

మోసపూరిత బడ్జెట్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



వచ్చే ఏడాది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనాన్ని ఊరించే రీతిలో మోసపూరితంగా కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఒక ప్రకటనలో విమర్శించారు. ఏపి విభజన హామీల అమలుకు నిధులు కేటాయించలేదని, ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై తీవ్రం నిరసన వ్యక్తం చేస్తూ గురువారం రాష్ట్రవ్యాప్త నిరసన ప్రదర్శనలు, దిష్టిబొమ్మ దగ్ధం వంటి కార్యక్రమాల్ని చేపట్టామన్నారు. శుక్రవారం కూడా కొనసాగిస్తామన్నారు. కార్పొరేట్ శక్తులకే ఈ బడ్జెట్‌లో కొమ్ముకాశారన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గొప్పలు చెబుతున్నారని, కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం పెరిగిందని, ధరలు పెరిగాయని చెబుతూ ఎంపిల జీతాల్ని భారీగా పెంచిన సర్కారు, సాధారణ ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాలను విస్మరించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధిపట్ల సిఎం చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్‌పై బాబు తీవ్ర అసంతృప్తి

- ఎంపిలతో టెలీకాన్ఫరెన్స్
- ఉద్దేశపూర్వకంగానే బిజెపి అన్యాయం చేసింది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపడంతో తెలుగుదేశం పార్టీ నాయకత్వం తీవ్ర ఆగ్రహంతో ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ ఎంపిలు, నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ఎంపిలు రాజీనామాకు సిద్ధపడ్డట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బిజెపి ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రానికి అన్యాయం చేసిందని వ్యాఖ్యానించారు. ఓపిక పడుతున్నామని, ఇలాగే కొనసాగితే ఎలాగని ఎంపిలు ప్రశ్నించారు. బిజెపి రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదని, రూ.10 కోట్లు, రూ.20 కోట్లు ఇస్తే అది అభివృద్ధా అని అనంతపురం ఎంపి జెసి దివాకరరెడ్డి ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి



మంత్రుల అభిప్రాయాలు కూడా తీసుకున్నారు. గత బడ్జెట్ సమావేశాల్లోనూ అన్యాయం జరిగినా బిజెపిపై ఒత్తిడి తేలేకపోయామని, అందువల్లే ఈ సారి పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఓ మంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. మిత్రపక్షంగా ఉన్నందున బహిరంగంగా అభ్యంతరాలు వ్యక్తం చేయడం పద్ధతి కాదని, అయితే కేటాయింపులపై కొంత ఆవేదనతో ఉన్నామని కేంద్రానికి తెలిసే విధంగా టిడిపి నాయకులు వ్యవహరించాలని చంద్రబాబు సూచించారు. ముఖ్యంగా విభజన హామీలపై ఈ బడ్జెట్లో కనీస ప్రస్తావన లేదని, రాష్ట్రానికి ఇస్తానన్న ప్రాజెక్టులకూ నిధులివ్వలేదని సిఎం నాయకత్వంతో అన్నారు. ప్రస్తుతం కేంద్రం కేటాయించిన నిధులూ వాటికి ప్రహరీలు కట్టడానికి సరిపోవని, రూ.11 వేల కోట్ల విలువైన స్థలాలు కేంద్రానికిస్తే రూ.400 కోట్లను మాత్రమే విడుదల చేశారని అన్నట్లు తెలిసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని బిజెపికి తెల్పివుందన్నారు. అయితే ఎంపిలతో భేటీ అయ్యి ఏం చేయాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బిజెపి ఉద్దేశ పూర్వకంగానే ఇలా చేస్తోందనే అభిప్రాయం నాయకత్వంలో ఉందని చంద్రబాబు అన్నట్లు సమాచారం. అయితే ఈ అభిప్రాయాన్ని బయటపెడితే మొదటికే మోసం వస్తుందని, అందువల్ల జాగ్రత్తగా వ్యవహరించాలని నాయకత్వానికి సూచించినట్లు తెలిసింది. గత బడ్జెట్ సమావేశాల్లోనూ ఇదే విధంగా చెప్పారని, కేంద్రాన్ని ఒప్పిస్తామన్నారని, ఒప్పించలేదని ఓ మంత్రి అన్నట్లు సమాచారం. కేంద్రం నుండి రావాల్సిన ప్రాజెక్టులు రాకపోతే ఎన్నికల్లో ప్రభావం తమపైనే పడుతుందని ఎంపిలు ఆందోళనతో ఉన్నట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశం అనంతరం పలువురు ఎంపిలు అదే రీతిలో మాట్లాడారు.

ఒరిగిందేమీ లేదు

వైవి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి వైసిపి ఎంపీలు



కేంద్ర బడ్జెట్‌పై వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పెదవి విరిచారు. ఏపికి సంబంధించి బడ్జెట్‌లో ఒరగబెట్టిందేమీ లేదని ఆయన విమర్శించారు. "బడ్జెట్ చూసి నిరాశకు గురయ్యాం. విభజన చట్టంలోని హామీలు అమలవుతాయని ఆశించాం. కానీ అమలు కాలేదు. ప్రత్యేక హోదా లేక పరిశ్రమలు ఒక్కటీ రాలేదు. నిరుద్యోగ భతి ఇవ్వలేదు. పోలవరం ప్రాజెక్టు మీద క్లారిటీ ఇవ్వలేదు. విశాఖ రైల్వే జోన్ ప్రస్తావనే రాలేదు. దుగరాజపట్నం ఓడరేవును గురించి పట్టించుకోలేదు. ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించకపోవడం చాలా దారుణం. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వకుంటే అన్న మాట ప్రకారం రాజీనామా చేయడానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నాం. మేం రాజీనామా చేస్తే ఇప్పుడే ప్రత్యేక హోదా వస్తుందంటే మే సిద్ధమే. కేంద్రంలో భాగస్వామ్య పక్షంగా ఉన్న టిడిపి దీనిపై సమాధానం చెప్పాలి. రుణమాఫీపై క్లారిటీ వస్తుందని దేశవ్యాప్తంగా రైతులు ఎదురు చూశారు.

కానీ ఎలాంటి ప్రకటన రాలేదు" అని విమర్శించారు. ఇప్పటి వరకు ఇచ్చిన నివేదిక ప్రకారం 9 కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేయాలంటే రూ.11,267 కోట్లు నిధులు అవసరం అవుతాయన్నారు. గత నాలుగేళ్ల కేటాయింపులు చూస్తే రూ.421 కోట్లు మాత్రమే ఇచ్చారని, ఇలాగైతే అభివద్ధి ఎలా సాధ్యమని విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. 70 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, కానీ లెక్కలు చూస్తే మాత్రం నిరాశాజనకంగా ఉన్నాయన్నారు. కనీస మద్ధతు ధర చూస్తే పెట్టుబడులకు కూడా చాలేట్లు లేదని పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గతంలో కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారని, ఇప్పుడేమో 1.5 శాతం అంటున్నారన్నారు. ఇప్పుడున్న మద్ధతు ధరలు చూస్తే కనీసం పెట్టుబడికి కూడా సరిపోవడం లేదన్నారు. రాబోయే ఐదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలంటే కనీసం మద్ధతు ధర 20 శాతం పెంచాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి ద్రోహం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేసిందని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ప్రజలకు తీవ్ర నిరాశను కలిగించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న రైల్వేజోన్, కడప ఉక్కుఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ వంటి వాటిని ప్రకటించలేదని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పెండింగ్ బిల్లులకు, అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. గతంలో ఎంతో గొప్పగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ అమలుకు ఎటువంటి కేటాయింపులూ లేవని పేర్కొన్నారు. విభజన వల్ల కలిగిన ఆర్థిక లోటును పూడ్చేందుకు కేంద్రం చెల్లించాల్సిన రూ.12,500కోట్లు లేవని తెలిపారు. వ్యవసాయం, ఉపాధి కల్పన తీవ్రమైన సమస్యలుగా ఉన్నాయంటూ ఆర్థిక సర్వే(2017-18)లో పేర్కొందని వివరించారు. రైతుల ఆదాయాలు పడిపోయాయని, గడచిన నాలుగేళ్ల నుంచి వ్యవసాయ కార్మికుల నిజవేతనాలు స్తంభించిపోయాయంటూ ఆర్థిక సర్వే పేర్కొందని తెలిపారు. ఉద్యోగాల కల్పనకు గానీ, రైతుల రుణభారాన్ని తగ్గించడానికి గానీ కేటాయింపులు లేవని పేర్కొన్నారు. కార్పొరేట్‌లకు పన్ను రాయితీలు ప్రకటించిందని వివరించారు. ఎంపిలకు వేతనాలు పెంచిందని తెలిపారు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్ అని,రాష్ట్రానికి మొండిచేయి చూపిన బడ్జెట్ అని విమర్శించారు. కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌గా పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రజానుకూలమైన మార్పుల కోసం ప్రజలంతా పోరాడాలని కోరారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ఓట్ల గారడీ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని ప్రధాన హామీలకు కేటాయింపులు లేవన్నారు. రాజధాని, రెవెన్యూ లోటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, కడప ఉక్కు పరిశ్రమ, దుగరాజపట్నం పోర్టు తదితరాలు వేటికీ నిధులు కేటాయించలేదని విమర్శించారు. విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ రైల్వే జోన్ హామీలపై రాష్ట్ర ప్రజలకు నిరాశే ఎదురయ్యిందన్నారు. అయితే కర్నాటకలో వచ్చే ఎన్నికల దృష్ట్యా మెట్రో రైలుకు రూ. 17 వేల కోట్లు కేటాయించడం గమనార్హమన్నారు. ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ.11,500 కోట్లు అవసరం కాగా రూ. 385 కోట్లే కేటాయించారన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల్ని చంద్రబాబు కేంద్రం ముందు తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రత్యేక హోదా హామీ విషయంలో బిజెపి, టిడిపి రాష్ట్రానికి ద్రోహం చేశాయన్నారు. రైతులకు మద్దతు ధర 50శాతం పెంచుతామని ఎన్నికల ముందు ప్రకటించిన బిజెపి ఇప్పుడు 1.5 శాతమే పెంచడం దారుణమన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడానికి చంద్రబాబు వైఖరే కారణమన్నారు. కేంద్రం మరోసారి మొండిచేయి చూపించి, రాష్ట్ర ప్రజల్ని మోసగించిందని ఆయన విమర్శించారు.

పోలవరం.. పరిహాసమే!

- రెండేళ్లుగా నిధుల ఊసే లేదు
- నాబార్డు నిధులిస్తామని మెలిక
- కేంద్రం ఇచ్చింది రూ.970 కోట్లే
- ఇంకా రావాల్సింది రూ.3,217 కోట్లు
- 2019కి పూర్తి ప్రశ్నార్థకమే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు కేంద్రానికి పరిహాసంగా మారింది. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్దేశించిన సమయానికి పూర్తవ్వాలంటే నిధులు పుష్కలంగా విడుదల చేయాల్సి ఉన్నా ఆ దిశగా కేంద్రం ప్రయత్నించడం లేదు. దీంతో పనులు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. బడ్జెట్ కేటాయింపుల్లో గతేడాది కనీసం ఒక్క పైసా కూడా విడుదల చేయని కేంద్రం 2018-19 బడ్జెట్‌లో కూడా నిధుల ఊసే ఎత్తలేదు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు కేంద్రం నుంచి రూ. 970 కోట్లు మాత్రమే వచ్చాయి. స్పిల్‌వే, డయాఫ్రం వాల్, ఎర్త్‌కం రాక్‌ఫిల్ డ్యాం పనులకు సంబంధించి ఇప్పటి వరకు చేసిన పనులకు రూ.3,217 కోట్లు రావాల్సి ఉంది. కానీ కేంద్రం మాత్రం వాటిని విడుదల చేయడం లేదు. మరోవైపు రెవెన్యూ లోటు కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 3,100 కోట్లు రావాల్సి ఉండగా అక్కడ కూడా మొండి చెయ్యే ఎదురయ్యింది. పోలవరంను 2019 కల్లా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న ఆశకు ఈ బడ్జెట్ ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి బడ్జెట్ కేటాయింపుల్లో ఎలాంటి ప్రకటనా చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరంకు జాతీయ హోదా కల్పించింది. ప్రాజెక్టుకయ్యే మొత్తం వ్యయంతో పాటు పునరావాసానికి కూడా కేంద్రం నిధులు కేటాయిస్తుందని ఆ చట్టం చెబుతోంది. రాష్ట్ర విభజన తర్వాత నాలుగేళ్లుగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంది. అయితే అప్పటి నుంచి ప్రాజెక్టు విషయంలో కేంద్రం ఉదాసీనతగా వ్యవహరిస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 250 కోట్లు కేటాయిస్తే, 2015-16 బడ్జెట్‌లో కేవలం రూ. 100 కోట్లే విదిలించింది. 2016-17 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లే కేటాయించింది. 2017-18 బడ్జెట్‌లో కనీసం రూపాయి కూడా కేటాయించలేదు. తాజా (2018-19) బడ్జెట్‌లో పోలవరం అంశాన్ని కనీసం ప్రస్తావించలేదు. దీంతో ఈ ప్రాజెక్టు కలగానే మిగిలిపోయే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టులో పలు కేసులు ఉన్నాయి. ఇవన్నీ పరిష్కారం జరిగి నిధులు దారాళంగా విడుదలైతే తప్ప పూర్తయ్యే పరిస్థితి లేదు. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఖర్చు చేసింది. తర్వాత కేంద్రం నుంచి నిధుల్ని వాపసు తీసుకోవాలని భావించింది. అయితే ఖర్చు పెట్టిన నిధుల్ని కేంద్రం ఎప్పుడు ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. 2014-15లో రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై రూ.1952 కోట్లు ఖర్చు చేసింది. అందులో రూ. 345 కోట్లను కేంద్రం వాపసు ఇవ్వగా, ఇంకా రూ.1607 కోట్లు రావాల్సి ఉంది. 2015-16లో రూ.2485 కోట్లు ఖర్చు చేసింది. ఈ నేపథ్యంలో 2015-16 బడ్జెట్‌లో రూ. 4,000 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా, కేవలం రూ. 100 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ ఏడాది బడ్జెట్‌లోనైనా పోలవరానికి తప్పకుండా అధికశాతం నిధులు కేటాయిస్తారని సిఎం చంద్రబాబు పూర్తి నమ్మకాన్ని పెట్టుకున్నారు. అనేక సమయాల్లో ఇదే విషయాన్ని చెప్తూ వచ్చారు. 2019 కల్లా పోలవరంను పూర్తి చేస్తామని, కుడి, ఎడమ కాలువలకు నీటిని సకాలంలో అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడంతో తీవ్ర నిరాశలో పడిపోయింది. దీంతో బహిరంగంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. అరకొర నిధులతో ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ఇప్పట్లో జరిగేలా లేదు. ప్రాజెక్టు పూర్తవ్వాలంటే ఇప్పుడున్న అంచనాల ప్రకారం దాదాపు రూ. 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గత నాలుగు బడ్జెట్ల నుంచి కంటితుడుపుగా నిధులు కేటాయించడంతో ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు 2019కల్లా ప్రాజెక్టు పూర్తవడం ప్రశ్నార్థకంగా మారింది.



ఇదీ వ్యవ'సాయం'

- అన్ని పంటలకూ పెట్టుబడులపై ఒకటిన్నర రెట్లు అదనంగా కనీస మద్దతు ధరలు.
- బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు రూ.11 లక్షల కోట్లు
- త్వరగా పాడైపోయే బంగాళదుంప, టమాట, ఉల్లి వంటి పంటల ధరల హెచ్చు తగ్గుదలపై రైతులు, వినియోగదారుల ప్రయోజనాలు కాపాడేందుకు రూ.500 కోట్లు.
- ఔషధ, సుగంధ ద్రవ్యాల సాగుకు రూ.200 కోట్లు
- 22 వేల గ్రామీణ చిన్న వ్యవసాయ మార్కెట్ల విస్తరణ, వాటితో పెద్ద పెద్ద కొనుగోలుదార్లతో అనుసంధానం, 585 ఎఎంసిల అభివృద్ధి కోసం రూ.2 వేల కోట్లు.
- పాడి, మత్స్య రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు. ఆ రెండు రంగాల్లో మౌలిక సదుపాయాలకు రూ.పది వేల కోట్ల ప్రత్యేక నిధి.
- జాతీయ వెదురు మిషన్ పునర్వ్యవస్తీకరణకు రూ.1,290 కోట్లు. వెదురుకు గ్రీన్ గోల్డ్‌గా నామకరణం.
- హర్యాన, యూపి, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో కాలుష్య నియంత్రణ, వ్యవసాయం అనంతరం వ్యర్థాల తొలగింపునకు అవసరయ్యే యంత్ర పరికరాలకు సబ్సిడీ.
- ఎఫ్‌పివొలకు ప్రోత్సాహం. క్లస్టర్ ఆధారిత సాగు అభివృద్ధి. కంపెనీల చట్టం కింద నమోదైన ఎఫ్‌పివోలకు (వార్షిక టర్నోవర్ రూ.వంద కోట్ల వరకు) పూర్తి పన్ను రాయితీ.
- ఎఫ్‌పివోల ద్వారా సేంద్రీయ సాగు విస్తరణ.

సాగు కార్పోరేటీకరణ

సర్కారుది సంధాన కర్త పాత్ర

సర్వం ఎఫ్‌పివోలే



కాంపొనెంట్	2016-17 లెక్కలు	2017-18 (సవరణ)	2018-19 పతిపాదన
వ్యవసాయం, సహకారం, రైతుల సంక్షేమం	36,912	41,105	46,700
వ్యవసాయ విద్య, పరిశోధన	5,729	6,992	7,800
పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్	857	2,166	3,100
మొత్తం	44,493	51,026	57,600

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

బిజెపి సర్కారు గురువారం ప్రతిపాదించిన 2018-19 కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ సాగుకు ఎర్ర తివాచీ పరిచింది. ఈ తడవ వ్యవసాయ రంగానికి అధిక కేటాయింపులని, రైతులకు భారీ చేయూత అని ఊరించిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. విత్త మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో వ్యవసాయానికి అదనంగా ఎంతో చేస్తున్నట్లు భ్రమింపజేశారంతే. మోడీ సర్కారు గడచిన మూడున్నరేళ్లుగా చేపట్టిన రైతు వ్యతిరేక విధానాల మూలంగా దేశ వ్యాప్తంగా సేద్యపురంగం సంక్షోభంలో కూరుకుపోయింది. కుదేలైన రంగానికి ప్రభుత్వపరంగా ఆసరా కల్పించి సహాయం పెంచాల్సింది పోయి రైతులను కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి నెట్టేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పివొలు), ఇ-నామ్‌లు, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్ సంస్థలకు, అనుసంధానం చేయడం వంటి చర్యలను మరింత దూకుడుగా అమలు చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రముఖంగా ప్రస్తావించారు. ఇప్పటికే మార్కెట్ శక్తులు, దళారుల వలన పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు భారీగా నష్టపోతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుంటే కొంత వరకు పోటీ పెరిగి ప్రైవేటు వ్యాపారులు దిగొస్తారు. కానీ సర్కారు అందుకు సిద్ధ పడలేదు. పంటల అమ్మకాల్లో కార్పొరేట్లను దించి వారికి, రైతులకు మధ్య సమన్వయం చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించింది. అందు కనుగుణంగానే ఇ-నామ్, చిన్న మార్కెట్లతో హోల్‌సేల్ మార్కెట్లకు అనుసంధానం కోసం పథకాలను బడ్జెట్‌లో పేర్కొంది. సర్కారు తరపు నుంచి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుపై నామమాత్రం ప్రస్తావించలేదు. రైతు పంట పండించడానికి పెట్టే పెట్టుబడికి యాభై శాతం కలిపి మద్దతు ధర (ఎంఎస్‌పి) అమలు చేయాలంటూ స్వామినాథన్ చేసిన సిఫారసును ఇన్నేళ్లలో పట్టించుకోని బిజెపి ప్రభుత్వం, ఆ డిమాండ్ అమలు కోసం పలు రాష్ట్రాల్లో రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో, ముంచు కొస్తున్న సార్వత్రిక, పలు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్ని పంటలకూ రైతు పెట్టుబడిపై ఒకటిన్నర రెట్లు ఎంఎస్‌పి అమలు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఎంఎస్‌పి అమలును ప్రభు త్వాలు వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై వదిలేశాక ఎంత ప్రకటించినా రైతులకు ఒనగూరే అదనపు ప్రయోజనం ఏమీ ఉండదు.

పేదల ఇళ్లకూ కనికరించని కేంద్రం

రాష్ట్ర వినతికి చుక్కెదురు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గృహాల మంజూరుకు అర్హులైన పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని, మరిన్ని ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విన్నపాలను కేంద్రం పక్కన పెట్టింది. ప్రస్తుత బడ్జెట్‌లో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి అదనపు కేటాయింపులు ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో ప్రభుత్వం 21 లక్షల మందిని అర్హులుగా గుర్తించినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్రానికి విన్నవించినా కేంద్ర ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో రాష్ట్రానికి అదనపు కేటాయింపుల ఊసే ఎత్తలేదు. దేశ వ్యాప్తంగా రూ.21వేల కోట్లతో 49 లక్షల ఇళ్లు పేదలకు నిర్మించనున్నట్లు పేర్కొంది. గత ఏడాది కేటాయింపుల కంటే రూ.2 వేల కోట్లు తగ్గించింది. గత ఏడాది రూ.23వేల కోట్లు కేటాయించినా ఖర్చు చేసింది రూ.20.24 వేల కోట్లే. రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఆరు లక్షల ఇళ్లు గ్రామీణ ప్రాంత పేదలకు కేటాయించగా, పూర్తి చేసింది సుమారు 2 లక్షల మాత్రమే, మిగిలిన ఇళ్లలో కొన్ని నిర్మాణం ప్రారంభం అవగా, మరికొన్నింటిని ప్రారంభించాల్సి ఉంది. 2022 నాటికి అందరకీ ఇళ్లు నిర్మిస్తామని కేంద్రం, 2019 నాటికి 19 లక్షల ఇళ్ల నిర్మిస్తామని రాష్ట్రం ప్రకటిస్తున్నా వాస్తవ పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నోట్ల రద్దు, జిఎస్టీల కారణంగా రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగంపై ప్రభావం పడింది. ఇళ్ల క్రయవిక్రయాలపై 12 శాతం జిఎస్టీ విధించడంతో కొనుగోళ్లపై ప్రభావం అధికంగా ఉంది. దీనిని 8 శాతానికి తగ్గించాలని నిర్మాణ సంస్థలు కోరినా ఫలితం కనిపించలేదు.

ఇదా 'రైతు మిత్ర' బడ్జెట్?

న్యూఢిల్లీ: 'మా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి వుంది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రధాని మోడీ ముందడుగు వేస్తున్నారు. వ్యవసాయాన్ని కూడా పరిశ్రమలా పరిగణిస్తున్నాం. ఎక్కువగా ఉత్పత్తి చేసి ఉత్పత్తులకు మెరుగైన ఆదాయాన్ని పొందాలని రైతులను కోరుతున్నాం'.. గురువారం నాటి బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మాటలివి..ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయోత్పత్తులకు పెట్టుబడి వ్యయంపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరను నిర్ణయించామని, రైతు ఉత్పత్తి సంస్థలు, రైతు సంఘాలను ప్రోత్సహించేందుకు 'ఆపరేషన్ గ్రీన్‌'ను ప్రారంభించామని, వ్యవసాయ రుణ పరపతిని రు.11 లక్షల కోట్ల మేర లక్ష్యంగా నిర్ణయించామని, మత్స్యపరిశ్రమ, చేపల పెంపకం, పశువుల పెంపకం కోసం రు.10 వేల కోట్లు కేటాయించామని ఆయన వివరించారు. ఉద్యానవన సాగును ప్రోత్సహించేందుకు క్లస్టర్ ఆధారిత విధానాన్ని ఆయన ప్రతిపాదించారు. ఇదంతా ప్రభుత్వ వ్యవ'సాయమే'నా? ఇది నిజంగా 'రైతుమిత్ర' బడ్జెటేనా? అంటే నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు.

రామన్‌మాన్ (వ్యవసాయ విశ్లేషకుడు)

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే మార్గాలను పరిశీలించేందుకు ప్రభుత్వం అశోక్ దళవాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించటం ఇదే తొలిసారి? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటానికి దాదాపు రు.6.4 లక్షల కోట్లు పెట్టుబడి కావాలి. అయితే ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం రు.4,845 కోట్ల మేర మాత్రమే పెరిగాయి. రైతుల ఆదాయం ఎప్పటికీ రెట్టింపు కాదన్నదానికి ఇది స్పష్టమైన సంకేతం. ఖరీఫ్ పంటలకు కనీస మద్దతుధరలను ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇందులో కొన్ని అస్పష్టతలున్నాయి. ఉత్పత్తి వ్యయం అంటే ఎలా లెక్కిస్తారు. పెట్టుబడి వ్యయం, కుటుంబ శ్రమను కలిపి లెక్కిస్తారా? లేక పెట్టుబడి వ్యయం, కుటుంబ శ్రమ, భూమి కౌలును కూడా లెక్కలోకి తీసుకుంటారా? ప్రస్తుతానికైతే ప్రభుత్వం ఇస్తున్న కనీస మద్దతు ధర గోధుమ వంటి పంటలకు ఉత్పత్తి వ్యయం కన్నా తక్కువగానే వుంటోంది. ఈ లెక్కింపులో భూమి కౌలును కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇప్పుడు మంత్రిచెబుతున్న ప్రకారం ఈ మొత్తానికి 50 శాతం అదనంగా కనీస మద్దతుధరను నిర్ణయిస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రస్తుతానికి దీనికి ఔనని సమాధాన పడ్డా, 94 శాతం మంది రైతులకు లభిస్తున్న ధరలు మద్దతు ధరతో సరిపోవటం లేదని శాంతకుమార్ కమిటీ చెబుతోంది. అంటే ఇప్పుడు ప్రభుత్వం పెంచుతున్నట్లు చెప్పిన మొత్తాన్ని వారు అందుకోబోరన్న విషయం స్పష్టమవుతోంది. వాస్తవంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని వారు కోరుకుంటే రైతుల ప్రత్యక్ష ఆదాయానికి హామీ ఇవ్వాలి. కానీ వారు దీనిని గురించి మాట్లాడటం లేదు. ప్రస్తుత బడ్జెట్ ఓట్ల కెళ్లే ముందు సమర్పించిన చివరి పూర్తి స్థాయి బడ్జెట్.. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనపు మొత్తంతో కనీస మద్దతు ధరను నిర్ణయించాలన్న స్వామినాథన్ కమిటీ సిఫార్సును నెరవేర్చామని చెప్పుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. కానీ వారు ఉత్పత్తి వ్యయాన్ని ఏ విధంగా పరిగణిస్తారన్న అంశంపై స్పష్టత లేదు. 94 శాతం మంది రైతులకు ఇప్పుడు ఎటువంటి ప్రయోజనమూ లభించటం లేదు. అయితే రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని తాము గత ఎన్నికలో చేసిన వాగ్దానాన్ని నిలుపుకున్నామని వారు చెప్పుకోవచ్చు. సామాన్య రైతుకు మాత్రం ఎటువంటి తేడా కన్పించదు.

నిధులు ఎలా?

- అభిజిత్ సేన్
(రిటైర్డ్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్, జెఎన్‌యు)

ప్రజలు అడుగుతున్న అనేక అంశాలను ప్రతిపాదిస్తున్న బడ్జెట్ ఇది. ఇందులో అత్యంత ప్రధానమైనది కనీస మద్దతుధర. ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనపు మొత్తంతో కనీస మద్దతుధరను అందిస్తామని జైట్లీ ప్రకటించారు. ఇది తక్షణం అమలులోకి వచ్చేది కాదు. కొంత కాలం పట్టవచ్చు. మీరు కోరుకుంటున్నది ఇదే కాబట్టి మేం ఇస్తున్నామని వారు చెప్పుకోవచ్చు. కానీ ఇది బడ్జెట్‌కు సంబంధించిన అంశం కాదు. ఇది కొంత డబ్బుతో కూడిన వ్యవహారం కనుకే దీనిని బడ్జెట్‌లో పొందుపర్చలేదు. మిగిలిన వ్యవస్థపై దీని ప్రభావం ఏమిటన్నది కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు. కాబట్టి వ్యవ'సాయం' పెద్దదే.. కనీస మద్దతు ధర అన్నది ఆలోచనకు అందని విషయం.. వ్యవసాయ రంగానికి రు.11 లక్షల కోట్లు కేటాయిస్తున్నామని జైట్లీ గంభీరంగా ప్రకటించారు. అయితే బడ్జెట్ పత్రాలలో ఈ అంకె ఎక్కడా కన్పించటం లేదు. బహుశా దీనిని బడ్జెటేతర వ్యవహారంగా జైట్లీ పరిగణిస్తుండవచ్చు. ప్రధానంగా నాబార్డ్, ఇతర బ్యాంకింగ్ వ్యవస్థల ద్వారా ఈ సొమ్మును సమకూర్చుకునే ఆలోచన చేస్తుండవచ్చు. ఇదంతా చూస్తే ఈ వ్యయంలో ప్రభుత్వం ఒక్క పైసా కూడా భరించటం లేదన్న విషయం తెలుస్తోంది. ఈ భారం అంతా ప్రజలపైనే పడుతుంది. ప్రజల సొమ్ముతోనే ప్రభుత్వం సోకు చేసుకుంటుందన్న మాట. మొత్తమ్మీద బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ ప్రస్తావించిన వ్యవసాయ, గ్రామీణ సమస్యలన్నీ బడ్జెటేతర హామీలేనని చెప్పవచ్చు. ఇందులో ఏ ఒక్కటీ తక్షణం అందబాటులోకి వచ్చేది కాదు. అంటే ఇవన్నీ బడ్జెటేతర అంశాలు కానప్పటికీ ఇందుకు సంబంధించిన వ్యయ ప్రణాళిక ఎక్కడా కన్పించటం లేదు. వ్యవసాయం, ప్రత్యేకించి ఉద్యానవన సాగు, చేపల పెంపకం వంటి వాటిని గురించి మాట్లాడుకునేటపుడు ఈ వాస్తవాన్ని మాట్లాడుకోవాలి. వీటన్నింటి రు.10 వేల కోట్లు కేటాయిస్తున్నామని ఘనంగా ప్రకటించినప్పటికీ ఇవన్నీ నాబార్డ్ నుండి రావల్సినవే.. అందువల్ల ప్రాథమికంగా వ్యవ'సాయం' గురించి చెప్పుకోవాలంటే చాలా వుంది. బడ్జెట్‌లో గోరంత కేటాయించి మిగిలిన మొత్తాన్ని నాబార్డ్ వంటి వ్యవస్థల నుండి రాబడతారు. అయితే ఈ డబ్బు ఎక్కడి నుండి వచ్చినా కనీస మద్దతు ధరలా రైతులకు ఉపయోగపడాలి. దీనిపైన ఏమైనా ఆలోచించారా అన్న అంశంలో ఇప్పటి వరకూ ఎటువంటి స్పష్టతా లేదు. ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనపు మొత్తంతో కనీస మద్దతుధరను చెల్లించాలంటే భారీ మొత్తంలో నిధులు కావాలి. అందువల్ల వారు మరో పద్ధతిని ఎంచుకునే అవకాశం వుంది. అందువల్ల వారు తమ హామీలను వాస్తవంగా నెరవేర్చుకోవటం లేదన్నది స్పష్టమవుతోంది. ఉత్పత్తి వ్యయాన్ని కేవలం పెట్టుబడి వ్యయం, కుటుంబ శ్రమ ఆధారంగా మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు తప్ప భూమి కౌలును పరిగణనలోకి తీసుకోవటం లేదు.

మద్ధతు ధర మోసం

- అశోక్ గులాటీ
(వ్యవసాయ విభాగాధిపతి, ఇక్రియెర్)

ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనపు మొత్తంతో మద్దతు ధరను ఏ విధంగా నిర్ణయిస్తారన్న అంశంపై స్పష్టత అవసరం. భూమి కౌలు లేకుండా నిర్ణయిస్తారా? భూమి కౌలుతో కలిపి నిర్ణయిస్తారా అన్నది స్పష్టంగా వెల్లడించాలి. ధాన్యానికి కనీస మద్దతుధరపై 45 శాతం పెంపుదలను ఏ విధంగా ఇస్తారు. ఒక్క ఏడాది ఇచ్చి ఊరుకుంటారా? నేనైతే అలా భావించటం లేదు. ఒక వేళ వారు అదే చేస్తే ఆహార ద్రవ్యోల్బణం, ఆహార సబ్సిడీ బిల్లు, పట్టల సరళిలో వైరుధ్యాల వంటి వాటిపై ఏ ప్రభావం వుంటుంది? వాళ్లు ప్రకటించి చెల్లింపులో తేడా వస్తే? బిల్లు ఏమవుతుంది? ఈ అంశాలన్నింటినీ నిశితంగా ఆలోచించాలి. ఈ ఆలోచన వారు చేసే వుంటారని భావిస్తున్నాను. అయితే వివరాలు మాత్రం తెలియటం లేదు. ఇది కేవలం విధాన ప్రకటనే అయితే చాలా అస్పష్టమైన విధాన ప్రకటన అవుతుంది. ఒక్క ఏడాదిలో కనీస మద్దతు ధరను 45 నుండి 50 శాతం మేర పెంచే ధైర్యం వారికుందే లేదో నేను చెప్పలేను. గత నాలుగేళ్లుగా వారీ పని చేయలేదు. ఇప్పుడు ఒక్క ఏడాదిలో ఎలా చేస్తారు? ఒకవేళ వారు భూమి కౌలును వదిలిపెట్టి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంలోనే ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనం అని చెబితే.. ఇక వారు దేన్ని గురించి మాట్లాడినట్లు? మత్స్యపరిశ్రమ, పశువుల పెంపకానికి రు.10 వేల కోట్లు కేటాయించాలన్న ప్రతిపాదనను నేను స్వాగతిస్తున్నాను. అయితే ఇది ఎన్నేళ్లకు. ఇది ఏడాదికా? రెండేళ్లకా? ఐదేళ్లకా? అన్నది ఎవరికీ తెలియదు. దీనిపై స్పష్టత లేదు. వ్యవసాయ మార్కెటింగ్ వసతులకు రు.2 వేల కోట్లు కేటాయింపు, ఆపరేషన్ గ్రీన్ కోసం రు.500 కోట్లు ఇవన్నీ చిన్న చిన్న అంశాలు.. ఇందులో రైతులకు వ్యతిరేకమైనదేదీ లేదని కచ్చితంగా చెప్పవచ్చు. అంతేకాదు. రైతుల ఆదాయం రెట్టింపయ్యే అంశాలు కూడా ఏమీ లేవు.. !

బడ్జెట్‌లో కీలకాంశాలు

- వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితిలో మార్పు లేదు
- వ్యవస్థీకృత సంస్కరణలు వేగవంతం. 8 శాతం వృద్ధి సాధన లక్ష్యంగా అన్ని కీలక రంగాల్లో గొలుసుకట్టు సంస్కరణల అమలు
- ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడుల ఉపసంహరణ
- 14 ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని నిర్ణయం
- ఆయుధాల తయారీ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రోత్సాహం
- మొబైల్ ఫోన్లు, టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి 20 శాతానికి పెంపు
- వైద్య, విద్యా సెస్సు 4 శాతానికి పెంపు
- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.55 వేల కోట్లు
- చిన్న, మధ్య తరగతి రైతుల కోసం దేశ వ్యాప్తంగా 22 వేల రూరల్ హట్స్ నిర్మించి, గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా అభివృద్ధి.
- ఆలూ, టమోటా, ఉల్లి రైతుల, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం 'ఆపరేషన్ గ్రీన్స్'
- సహకార సంఘాల ద్వారా వందకోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ ఉండే వ్యవసాయ ఉత్పాదక సంస్థలకు నూరు శాతం పన్ను రాయితీ
- స్వయం సహాయక బృందాల రుణాల మొత్తం రూ. 42,500 కోట్ల రూ. 75 వేల కోట్లకు పెంపు
- గిరిజన ఆవాస ప్రాంతాల్లో 2022 నాటికి ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలు
- 10 కోట్ల పేద కుటుంబాల ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రీయ సమాజ్ బీమా యోజన పథకం. కుటుంబానికి ఏడాదికి 5 లక్షల రూపాయల పరిమితి.
- 2018-19 ఆర్థిక సంవత్సరాంతానికి ద్రవ్యలోటు 3.5 శాతం నుండి 3.3 శాతం తగ్గుదల లక్ష్యం.
- మౌలిక వసతుల రంగానికి రూ.5.97 లక్షల కోట్లు కేటాయింపు
- పర్యాటక రంగంలో ఐకానిక్ కేంద్రాలుగా పది ప్రాంతాల అభివృద్ధి
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), రోబోటిక్స్‌పై ప్రత్యేక దృష్టి. ఎఐ కోసం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కార్యక్రమం
- వయో వృద్ధుల ఎఫ్‌డి. పోస్టాఫీసు డిపాజిట్లపై 50 వేల వరకు టిడిఎస్ రద్దు వేతన ఉద్యోగులకు 40 వేల రూపాయల వరకు ప్రయాణ, వైద్య ఖర్చులకు స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపు
- చిన్న తరహా పాదరక్షలు. తోలు ఉత్పత్తుల తయారీ సంస్థల లాభాలపై ఆదాయపన్ను రాయితీ
- అమృత్ పథకం కింద రూ.19,428 కోట్ల 494 ప్రాజెక్టులు
- జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక పైలట్ ప్రాజెక్టు. 115 జిల్లాల ఎంపిక
- రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతి, గవర్నర్ల వేతనాల పెంపు
- 2020 నాటికి 50 లక్షల మంది యువతకు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ
- రోడ్లు, మౌలిక వసతులకు రూ. 9.64 లక్షల కోట్లు
- రైల్వేలకు 1.48 లక్షల కోట్లు
- కొత్త ఉద్యోగాలు కల్పించే రంగాల్లో ప్రభుత్వ ఇపిఎఫ్ 8.33 శాతం నుండి 12 శాతానికి పెంపు. మూడు సంవత్సరాల పాటు అమలు.
- ముద్ర యోజన రుణాల్లో 75 శాతం మహిళలకు కేటాయింపు.
- దళిత సంక్షేమానికి 56 వేల కోట్లు, ఆదివాసీల సంక్షేమానికి 32,508 కోట్లు.



	2016-17 వాస్తవ కేటాయింపులు	2017-18 బడ్జెట్ అంచనాలు	2017-18 సవరించిన అంచనాలు	2018-19 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ వసూళ్లు	1374203	1515771	1505428	1725738
మూలధన వసూళ్లు	600991	630964	712322	716475
మొత్తం వసూళ్లు	1975194	2146735	2217750	2442213
మొత్తం వ్యయం	1975194	2146735	2217750	2442213
రెవెన్యూ లోటు	316381	321163	438877	416034
ద్రవ్య లోటు	535618	546531	594849	624276
ప్రాథమిక లోటు	54904	23453	64006	48481

మాటలు జాస్తి, కేటాయింపులు నాస్తి

విద్యారంగానికి అరకొర కేటాయింపులే

న్యూఢిల్లీ: నవ భారత నిర్మాణంలో కీలక మైన విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో ఈసారి రూ.85,010 కోట్లు కేటాయించారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018-19 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడుతూ, విద్యారంగానికి రూ.85,010 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఇది చాలా నామమాత్రపు పెరుగుదల. రక్షణ రంగానికి బడ్జెట్‌లో 9 శాతం కేటాయించిన ఆర్థిక మంత్రి విద్యా రంగానికి అందులో సగం కూడా కేటాయించలేదు. దేశంలో సగం మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్నారు. పెద్దఎత్తున ఫీజులు చెల్లించలేక మధ్య తరగతి కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయి. ఆహార ఖర్చు తరువాత అది పెద్ద పద్దు వైద్యం, రవాణా రంగాలతోబాటు విద్యదే. ఈ పరిస్థితుల్లో విద్యా రంగానికి స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)లో 6 శాతం కేటాయించాల్సి వుంది. కానీ, జైట్లీ ఈ బడ్జెట్‌లో జిడిపిలో మూడు శాతం కూడా కేటాయించకపోవడం గమనార్హం. విద్యా హక్కు చట్టాన్ని సవరించి 13 లక్షలకు పైగా శిక్షణలే ఉపాధ్యాయులకు ఇప్పిస్తామని చెప్పారు. టెక్నాలజీని విద్యా రంగంలో ప్రోత్సహిస్తామని, 2022 నాటికి 20 వేల మందితో ఏకలవ్య పాఠశాలలు నెలకొల్పుతామని చెప్పారు. విద్యకు వచే నాలుగేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. పరిశోధన, ప్రధాన విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఇంజినీరింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచే వెయ్యి మంది విద్యార్థులకు ప్రధానమంత్రి రిసెర్చి ఫెలోషిప్ ఇస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ బిఇడి కోర్సులను ప్రవేశ పెడతామన్నారు. పథకాలు ఎక్కువ. కేటాయింపులు తక్కువ. విద్యపై అతి తక్కువ ఖర్చు చేసే దేశాల్లో భారత్ ఒకటి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 14-18 ఏళ్లలోపు పిల్లల్లో బడి మానేస్తున్న వారి సంఖ్య గణనీయంగానే వుందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యారంగానికి కేటాయింపులు రెట్టింపు పెంచాల్సిన అవసరముంది. కానీ, ఆర్థికమంత్రి ఆలోచన మరోలా వుంది. విద్యారంగంలో ప్రైవేట్ , విదేశీ విద్యా సంస్థలను ప్రోత్సహించడం ద్వారా విద్యా ప్రమాణాలు పెంచుతామని ప్రకటించారు.

రక్షణ రంగంలో విదేశీ

విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం

రు.2,82,733 కోట్లతో రక్షణ బడ్జెట్

న్యూఢిల్లీ: బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి అత్యంత ప్రీతిపాత్రమైన అంశాల్లో ఒకటైన సైనికీకరణకు ఎప్పటిమాదిరిగానే ఈసారి కూడా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పెద్దపీట వేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీయే ప్రభుత్వ చివరి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆయన గురువారం లోక్‌సభలో ప్రవేశపెడుతూ, కీలకమైన రక్షణ రంగానికి రూ.2,82,733 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం బడ్జెట్‌లో ఇది 9 శాతం అన్నమాట. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.2,62,390 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల ప్రకారం కేటాయించిన దానికి మించి అంటే రు.2,67, 108 కోట్లు ఖర్చు చేశారు. అంతకుముందు సంవత్సరం రు.2,51, 781 కోట్లు ఖర్చు చేశారు. సైనికులు, సాయుధ బలగాలు చేసిన త్యాగాలను ఘనంగా బడ్జెట్ ప్రసంగంలో ఘనంగా కీర్తించిన ఆర్థిక మంత్రి, సరిహద్దుల్లో ప్రాణాలను సైతం పణంగా వొడ్డి దేశ సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్న సిపాయిలు, సరిహద్దు భద్రతా సిబ్బంది, పారా మిలిటరీ జవాన్ల సంక్షేమానికి ఎటువంటి చర్యలూ తీసుకున్నదీ మాట మాత్రంగా కూడా ప్రస్తావించకపోవడం విమర్శలకు దారితీసింది. ఆయుధాలు, మందు గుండు సామగ్రి కొనుగోళ్లు, రక్షణ ఉత్పత్తుల రంగంలోకి ప్రైవేట్, విదేశీ పెట్టుబడులపై మాత్రం ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్, విదేశీ పెట్టుబడుల సహకారంతో రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

చేనేతకు బిజెపి ప్రభుత్వం మొండిచేయి

ప్రజాశక్తి- మంగళగిరి

బిజెపి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు మొండిచేయి చూపిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ విమర్శించారు. ఈ మేరకు బడ్జెట్‌పై విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.383 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.609 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం బడ్జెట్‌లో కోత విధించడం జరిగిందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 2016లో రూ.709కోట్లు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ... ఏడాదికేడాది కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో కోత విధించడం జరుగుతోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది చేనేత కార్మికులున్నారని, కేటాయించిన రూ.380 కోట్లు లెక్కవేస్తే ఒక్కొక్కరికీ రూ.128లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించడం చూస్తుంటే చేనేతపై బిజెపికి ఉన్న ప్రేమ ఏపాటిదో అర్థమవుతోందని విమర్శించారు. చేనేత కార్మికుల జీవన పరిస్థితులను రూ.128లతో ఏ విధంగా మెరుగుపరుస్తారో బిజెపి చెప్పాలని డిమాండ్‌చేశారు. రానున్న కాలంలో బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని బాలకృష్ణ హెచ్చరించారు.

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం : డివైఎఫ్‌ఐ

ఉద్యోగ కల్పనకు ప్రణాళిక ప్రకటిస్తారని ఎదురుచూసిన నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో తీరని అన్యాయం చేసిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకొచ్చిన మోడీ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేశారని ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి రామన్న, ఎం సూర్యారావు గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఆరు కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా కేవలం 8లక్షలు మాత్రమే కల్పించారన్నారు. రైల్వేలో కిందిస్థాయి ఉద్యోగాల్ని రోజువారి కూలీ చొప్పున నియమించుకుంటామని బడ్జెట్‌లో ప్రకటించడం దారుణమన్నారు. కేంద్రంలో 16లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని, ఐదేళ్ల నుంచి ఖాళీగా ఉన్న ఉద్యోగాల్ని పూర్తిగా రద్దు చేసేందుకు పూనుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. 'అంతర్జాతీయ కార్మిక నివేదిక' ప్రకారం గతేడాది కంటే నిరుద్యోగులు 5లక్షలు పెరిగారని వివరించారు.ఉపాధి కల్పనకు పరిశ్రమల్ని నెలకొల్పకుండా వాటిని అమ్మేసి దేశానికి తీవ్ర అన్యాయాన్ని తలపెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పోరేట్‌శక్తులకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఖాళీలన్నీ చేయాలని, కొత్త పరిశ్రమల్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

పథకాలే తప్ప కేటాయింపులు లేవు : యుటిఎఫ్

బడ్జెట్‌లో కొత్త పథకాల్ని ప్రకటించడం తప్ప అందుకు తగిన బడ్జెట్ కేటాయింపులు లేవని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి తెలిపారు. పథకాల అమలుకు బడ్జెట్ కేటాయింపులు అంతంతమాత్రంగా ఉన్నాయన్నారు. గతేడాది మొత్తం విద్యారంగానికి బడ్జెట్‌లో రూ.79,686 కోట్లు కేటాయించగా, 2018-19కి రూ.85,010కోట్లు కేటాయించారన్నారు. అదనంగా రూ.5,342కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. పాఠశాల విద్యారంగానికి గతేడాది రూ.46,356కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ.50,000 కోట్లు కేటాయించారని, అంటే రూ.3,644 కోట్లు మాత్రమే పెరిగిందన్నారు. దేశంలో నికరంగా ఆదాయపన్ను చెల్లిస్తున్న ఉద్యోగ వర్గానికి కేంద్రబడ్జెట్‌లో నిరాశే ఎదురయ్యింది. ఆదాయ పన్ను మినహాయింపుల్లో ఎలాంటి మార్పులూ చేయకపోగా విద్యాసెస్సు 4శాతానికి పెంచి మరింత భారాన్ని మోపారన్నారు.

సంపాదకీయం

దగాకోరు బడ్జెట్

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అట్టహాసంగా గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆసాంతం మాయ బడ్జెట్. ఇంతటి అభూత కల్పనల బడ్జెట్ ప్రవేశపెట్టడం కాషాయ సర్కారుకే సాధ్యమైంది. బిజెపి సర్కారుకు భజన చేసే ఆర్థిక వేత్తలు, అనుకూల మీడియా మాత్రమే బడ్జెట్‌ను అమోఘమని కీర్తిస్తున్నది. ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం నాలుగు బడ్జెట్లు తీసుకొచ్చింది. ప్రస్తుత 2018-19 బడ్జెట్ ఈ సర్కారు హయాంలో చివరి పూర్తి స్థాయి బడ్జెట్. దీనిలోనైనా వాస్తవ ప్రజా సంక్షేమ కోణం వెలుగు చూస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. భారీ అంచనాలతో రూ.21.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించిన మోడీ ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ప్రజారోగ్యం తదితర కీలక రంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు భ్రమలు పెట్టింది. ఈ తంత్రం వేసింది అతి సమీపంలో ఉన్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఏడాదిలో ముంచుకొస్తున్న సార్వత్రిక ఎన్నికల కోసమేనని బడ్జెట్ మొత్తాన్నీ పరిశీలించిన వారెవరికైనా సులభంగానే బోధ పడుతుంది. ప్రభుత్వానికి జన బాహుళ్యంపై ఏ మాత్రం ప్రేమ లేదనడానికి పన్నుల వ్యవహారమే ఉదాహరణ. ప్రత్యక్ష పన్నుల రాబడి ఈ ఏట 51.6 శాతం ఉంటే వచ్చే ఏడాది 50.6 శాతంగా అంచనా వేశారు. కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించారు. ఇదే సమయంలో పరోక్ష పన్ను ఆదాయాన్ని ఎక్కువ ఆశించారు. ప్రత్యక్ష పన్నులను సంపన్నులు, కార్పొరేట్లు చెల్లిస్తారు. పరోక్ష పన్నులను జనం కడతారు. దొడ్డిదారిలో పన్నులు వడ్డించి ప్రజల నుంచి ఆదాయం పిండుకోవాలని చూస్తూ వారికి అచ్చే దిన్ అనడం ముమ్మాటికీ దగానే.

వ్యవసాయానికి ఇబ్బడిముబ్బడిగా కేటాయిస్తున్నట్లు జైట్లీ పేర్కొనడం పచ్చి మోసం. పంటలకు పెట్టుబడులపై ఒకటిన్నర రెట్లు మద్దతు ధర అన్నారు. కానీ బడ్జెట్‌లో దానికి తగ్గ నిధులు కేటాయించలేదు. ఇప్పటికే పలు రబీ పంటలకు ప్రకటించామని అబద్ధం చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి లేకుండా ఎంఎస్‌పి అమలు ఎలా సాధ్యం? అప్పుల ఊబిలో కూరుకొని ఆత్మహత్యలబాట పట్టిన రైతాంగం తమకు రుణ మాఫీ చేయాలని ఆందోళనలు చేస్తుండగా ఆ అంశం బడ్జెట్‌లో మాట మాత్రం ప్రస్తావించలేదు. రైతులకు బ్యాంకులిచ్చే రుణాలను వాటిని ప్రభుత్వ ఖజనా నుంచి ఇస్తున్నట్లు గొప్పలకు పోవడం పక్కదారి పట్టించే కుట్ర. ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలతో వ్యవసాయరంగం పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోగా ప్రభుత్వ పెట్టుబడులు పెంచే బదులు కార్పొరేట్ సాగు వైపు రైతులను మళ్లించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పివో), ఈ-నామ్ వంటి పథకాలు వల్లించడం దారుణం. గ్రామీణాభివృద్ధిలో ప్రధానమైన ఉపాధి హామీకి నిధులు పెరగలేదు. గ్రామీణ కూలీలకు పనులు కల్పించాలంటే ఆ నిధులు ఏ మూలకూ చాలవు. స్వచ్ఛ భారత్ వంటి ప్రచార పథకాలకు మాత్రం నిధులు ప్రతిపాదించారు. ఆహారభద్రతా చట్టం నిఖార్సుగా అమలు కావాలంటే పంటల ధరలు, ధాన్యాల సేకరణకు నిధులు కావాలి. ప్రభుత్వం ఆ దిశగా బడ్జెట్‌లో కనీసం ఆలోచన చేయలేదు.

ద్రవ్యలోటును తగ్గించే పేరుతో ఎన్‌డిఎ సర్కారు ప్రజల ఉపాధి, సంక్షేమానికి కోతలు పెట్టింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నిరుడు జిడిపిలో 1.15 శాతం కేటాయించగా ఈసారి 1.08 శాతానికి తగ్గించారు. విద్య కేటాయింపులు 0.49 శాతం నుంచి 0.45 శాతానికి కత్తెర పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వారి జనాభా దామాషాకు సుదూరంలో కేటాయింపులున్నాయి. ప్రపంచంలోనే పెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున 10 కోట్ల కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పుకున్న జైట్లీ అందుకు తగ్గట్టు నిధులు చూపలేదు. ప్రైవేటు బీమా సంస్థలకు ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకే ఆరోగ్య, పంటల బీమా వగైరాలు. రైల్వే ఆదాయాన్ని బొక్కసంలో వేసుకోవడం తప్ప ఆ శాఖకు సముచిత కేటాయింపుల్లేవు. ప్రయాణీకుల భద్రతను విస్మరించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, పలు రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆహ్వానం వంటివి మరింతగా 'సంస్కరణ'లను పరుగులు పెట్టించనున్నాయి. కార్పొరేట్ పన్ను తగ్గించిన సర్కారు వేతన జీవుల పన్ను శ్లాబులను సవరించలేదు. చమురు ధరలపై ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తపర్చగా బడ్జెట్‌లో ఆ విషయాన్ని కప్పెట్టింది.

ఈ బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచెయ్యి చూపింది. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరానికి నిధులు... మొదలైన అన్ని విషయాల్లో రాష్ట్రానికి పూర్తిగా నిరాశనే మిగిల్చింది. ప్రభుత్వ ఈ చర్యలన్నీ పేద, సాదలను కాల్చుకు తినేవి. ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్లకు రాయితీలు ధారపోసే బడ్జెట్ పౌర సమాజానికి ఆశనిపాతం.

ఇదీ విషయం




నేతల జీతాలపైనే
విత్త మంత్రి చిత్తం...
సామాన్యుడి నడ్డిపైన
విరగనుంది బెత్తం!

పీఠంపై ఎవరున్నా
అరిగిన గ్రాంఫోను పాట...
వెనుకున్నవాళ్ళు ఆడించే
తోలుబొమ్మలాట!

- కొల్లూరు వెంకట్


విశ్లేషణ

జమిలి ఎన్నికలపై బిజెపి దూకుడు



డాక్టర్ చుక్కా రామయ్య

దేశంలో ఒకే భాషలో మాట్లాడాలని, ఒకే రకమైన దుస్తులు ధరించాలని, ఒకే రకమైన ఆహారం తినాలని, ఒకే సంస్కృతిని అను సరించాలంటూ ప్రజలపై ఒత్తిడి మొదలవు తోంది. భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు సమ్మిళతమైన మన భారతీయ సమాజంలో ఇది సాధ్యమేనా? ప్రజలంతా ఒకే రకంగా ఆలోచించాలనే ధోరణులు సైతం అక్కడక్కడా చూస్తున్నాం. ఇవన్నీ మన ప్రజాస్వామిక దేశంలో ఆందోళనకరమైన పోకడలే. ఈ నేపథ్యం లోనే వస్తోన్న ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదన ఆందోళన కలిగించేదే.



భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి 'ఒకే దేశం - ఒకేసారి ఎన్నికలు' నినాదాన్ని తరచూ వినిపిస్తూ వస్తోంది. గతంలో రాష్ట్రపతి, ప్రధాని, ఎన్నికల సంఘం ప్రధాన అధికారులు సైతం జమిలి ఎన్నికల నిర్వహణ ఆవశ్యకతపై అనేక సానుకూల వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై ప్రజల్లో చర్చా నడిచింది. ఈ పరిస్థితుల్లో సోమవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగంలో జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావాలని పిలుపునివ్వడంతో చర్చ మళ్లీ ఊపందుకొంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే చాలా వరకు ప్రజాధనం వ్యయానికి అడ్డుకట్టపడటమే కాకుండా దేశ అభివృద్ధికి కొన్ని అడ్డంకులు తొలగిపోతాయని ఆయన ఉద్ఘాటించారు. ఈ వాదన నిజమే. ఎందుకంటే నిత్యం ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరగడం వల్ల ప్రజాధనం ఖర్చుతో పాటు పోలీసు బలగాలు మోహరింపు, అధికార యంత్రాంగం ఎన్నికల పనిలో నిమగ్నం కావడం, అక్కడక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తడం, ఎన్నికల నిబంధనావళి అమలులో ఉండటం వల్ల అభివృద్ధి పనులకు అవరోధాలు, ప్రజలు, రాజకీయ పార్టీలు పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోవడం తదితర పరిణామాలు నిత్యకృత్యం. ఈ నేపథ్యంలో ఎలాంటి బాదరబందీ లేకుండా దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిపేస్తే ఇక మిగిలిన టైమంతా దేశ అభివృద్ధిపైనే దృష్టి సారించొచ్చు. కానీ జమిలిగా ఎన్నికల నిర్వహణ ఆచరణ సాధ్యమేనా? అనేక రాష్ట్రాలు, భాషలు, సంస్కృతుల సమ్మిళితమైన భారత దేశం సమాఖ్య స్ఫూర్తికి ఈ జమిలి ప్రతిపాదన ఎంతమేరకు మేలు చేస్తుంది? లౌకికవాద పునాదులపై నిర్మితమైన మన ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఏమైనా విఘాతం కలిగిస్తుందా? అనే ఆందోళన కలుగుతోంది.

2014 ఎన్నికల్లో 'కాంగ్రెస్ ముక్త భారతే' లక్ష్యమంటూ ప్రధాని అభ్యర్థిగా ప్రచార హోరు సాగించిన మోడీ, బిజెపి చీఫ్ అమిత్‌షాలు ప్రాంతీయ పార్టీలను సైతం నామరూపా ల్లేకుండా చేసేందుకు దీన్నొక ఎత్తుగడగా అనుసరిస్తు న్నారా? అనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. ఎందుకంటే ఇటీవల గుజరాత్ ఎన్నికల్లో కొందరు కేంద్ర మంత్రులు ఇప్పటికే మేం అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని, మిగతా రాష్ట్రాల్లో కూడా పాగా వేస్తామని లెక్కలు చెబుతుంటే ఇలాంటి అనుమానాలు కలగడం సహజమే మరి. అంతేకాకుండా దేశంలో ఒకే భాషలో మాట్లాడాలని, ఒకే రకమైన దుస్తులు ధరించాలని, ఒకే రకమైన ఆహారం తినాలని, ఒకే సంస్కృతిని అనుసరించా లంటూ ప్రజలపై ఒత్తిడి మొదలవుతోంది. భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు సమ్మిళతమైన మన భారతీయ సమాజంలో ఇది సాధ్యమేనా? ప్రజలంతా ఒకే రకంగా ఆలోచించాలనే ధోరణులు సైతం అక్కడక్కడా చూస్తున్నాం. ఇవన్నీ మన ప్రజాస్వామిక దేశంలో ఆందోళనకరమైన పోకడలే. ఈ నేపథ్యంలోనే వస్తోన్న ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదన ఆందోళన కలిగించేదే.

దేశంలో ఈ జమిలి ఎన్నికలతో ఇంకా రెండేళ్ల పాటు కొనసాగేందుకు అవకాశం ఉన్న పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేయాల్సి ఉంటుంది. అంతేకాదు గతేడాది ఎన్నికలు నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్, ఇటీవల ఎన్నికైన గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభల్ని సైతం రద్దు చేయాల్సి ఉంటుంది. ఈ పరిణామంతో ప్రజలు ఐదేళ్ల పాలనను దృష్టిలో ఉంచుకొని ఇచ్చిన తీర్పును జమిలి నెపంతో రద్దు చేస్తే ప్రజా తీర్పు ధిక్కరించడమే అవుతుంది.

ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం ఉంటేనే పాలన సజావుగా సాగుతుందని, ప్రజలకు మేలు జరుగుతుందని గాఢంగా విశ్వసించిన మహోన్నత నేతల జమానా నుండి నేడు అసలు ప్రతిపక్షం ఉందంటేనే ఓర్వలేని పాలకులు ఉన్న పరిస్థితుల్ని మనం చూస్తున్నాం. నిర్మాణాత్మకమైన సూచనలు ఇచ్చే ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందనే విశ్వాసం నేటి పాలకుల్లో కొరవడుతోంది. ప్రజలు ఫలానా పార్టీ విధానాలు నచ్చి అధికారం కట్టబెడితే తీరా గెలిచాక ప్రజల విశ్వాసాన్ని పక్కనబెట్టి అనైతిక పొత్తులు కుదుర్చుకున్న రాష్ట్రాన్ని చూశాం. అలాగే, గోవాలో కాంగ్రెస్ సింగిల్ మెజార్టీ పార్టీగా అవతరించినా బిజెపి ఏ రకంగా అధికారాన్ని కైవసం చేసుకుందో చూస్తున్నాం. ఎన్నికలు ప్రజాస్వామ్యంలో భాగమే తప్ప వేరు కాదు. కాబట్టి ఇలాంటి పరిణామాలన్నీ ప్రజాస్వామిక స్ఫూర్తిని దెబ్బతీసేవే తప్ప ఏమాత్రం మేలు చేసేవి కాదు. నిత్యం ప్రజల బాగుకోసమే పాటుపడుతున్నా మని ఊదరగొట్టే ప్రభుత్వ పెద్దలు పరోక్ష పన్నులతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలకు కోట్లకు కోట్లు రుణాలు ఇచ్చి రైతన్న పంట సాగు చేసుకొనేందుకు రుణం ఇవ్వలేని పరిస్థితి. రాజకీయ అనైతికత రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలాంటి విధానాలు అనుసరిస్తున్నంత కాలం ఇలాంటి పార్టీలతో ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వసించడం పెద్ద తప్పిదమే అవుతుంది. దేశంలోని బ్యాంకులకు సుమారు రూ.9 వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విజయమాల్యా నుంచి, విదేశాల్లో పోగుపడిన రూ.లక్షల కోట్ల నల్లధనాన్ని తీసుకొస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా రాబట్టలేని ప్రభుత్వం, ప్రజాధనం వ్యయాన్ని తగ్గించడం కోసమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెబితే ప్రజలు విశ్వసించలేరు. అందువల్ల ప్రజలకు ఇచ్చిన హామీలను నిజం చేసి చూపిస్తే ప్రజలు మిమ్మల్ని నమ్ముతారు. అప్పుడే ప్రజా సంక్షేమానికి ప్రభుత్వాలు చేపట్టే ఎలాంటి సంస్కరణలనైనా ఆహ్వానిస్తారు.

(రచయిత ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు)

చర్చ

వలసల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలేవి?



జక్కంశెట్టి సత్యనారాయణ

దేశంలో వ్యవసాయ కార్మికుల వలసలు నివారించాలని కోరుతూ దేశ వ్యాప్త ఆందోళన, పోరాటాల ఫలితమే 2005లో మహాత్మాగాంధీ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ఆ చట్టాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేస్తే ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి వలసల దుస్థితి వుండదు. చట్టంలో చెబుతున్న అంశాలలో ప్రధానమైనది ఆ రాష్ట్రానికి వచ్చిన నిధులలో లేబర్ కాంపోనెంట్ 60 శాతం, మెటీరియల్ కాంపోనెంట్ 40 శాతం ఖర్చు చేయాలని వున్నా త్రిపుర, కేరళ రాష్ట్రంలో తప్ప మిగిలిన రాష్ట్రాలలో ఆ నిష్పత్తిలో ఎక్కడా ఖర్చు చేస్తున్న పరిస్థితి లేదు. ఈ కారణంగానే రాష్ట్రాలు దాటి వలసలు వస్తున్న దుస్థితి వుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, అత్తిలి చుట్టూ ఉన్న మండలాల్లో పొలం పనులు చేసేందుకు ముఖ్యంగా నాట్లు వేసేందుకు గత రెండు, మూడు సంవత్సరాల నుండి పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మగ కూలీలు వస్తున్నారు. ఈ మధ్య వారి సంఖ్య ఎక్కువయ్యింది. దీంతో రైతులు, కౌలు రైతులు కూడా వారి వరినాట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వీరు నాట్లు వేసే పద్ధతి కూడా క్రమపద్ధతిలోను వేగంగాను వుంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో నాట్లు మహిళలు వేస్తారు, నారు తీత, మగవాళ్ల తీస్తారు. జిల్లాలో వున్న కూలీలతో నాట్లు వేయిస్తే ఎకరానికి రూ.3,500 ఖర్చు అవుతుంది. అదే బెంగాల్, ఉత్తరప్రదేశ్ కూలీలు నారు తీసే దగ్గర నుండి నాట్లు వేసే వరకు మగవాళ్లే చేస్తారు. వీరికి ఎకరాకు రూ.3,300 ఖర్చు అవుతుంది.

జిల్లాలో వున్న కూలీలు, ఆకు తీతకి, ఎకరాకి ముగ్గురు మగవారు, ఉడుపుకు 8 మంది మహిళలు వుంటారు. వీరు ఉదయం 8 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు పని పూర్తి చేసుకొని వస్తారు. అదే బెంగాల్ నుండి వచ్చిన కూలీలు, ఇద్దరు లేక ముగ్గురితోనే మొత్తం పని పూర్తి చేయిస్తున్నారు. ఎందుకంటే వీరు ఉదయం 5 గంటలకు వెళ్లి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తారు. అంటే సుమారుగా 13 గంటలు పని చేస్తున్నారు. అది కాకుండా మహిళలు ఊడ్చే నాట్లకు ఎకరానికి ఆకు మడి, విత్తనాలు, 25 కేజీలు వేస్తే బెంగాల్ కూలీలు ఊడ్చిన దానికి బస్తా 1/2 అదనంగా ఎరువులు వేయాల్సి వుంటుందని రైతులు చెబుతున్నారు. అంటే ఎరువులు నిమిత్తం సుమారుగా రూ.1000 నుండి రూ.1200 వరకు అదనపు ఖర్చు అవుతుంది.

అందుకే బెంగాల్, యుపి కూలీల వలసల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ ప్రతినిధులు తణుకు మండలంలో పని చేస్తున్న బెంగాల్ కూలీలను కలవగా వారు అనేక విషయాలు తెలిపారు. తామంతా పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లా ప్రాంతానికి చెందిన వారమని చెప్పారు. గతంలో తమకు అక్కడే పనులు వుండేవన్నారు. మూడు, నాలుగేళ్ల క్రితం వరకు పనుల కోసం కర్నాటక వెళ్లేవారమని, రెండు, మూడేళ్ల నుండే ఈ తణుకు ప్రాంతానికి వస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం వారుండే ప్రాంతంలో పనులు తగ్గిపోవటం వల్ల ఈ ప్రాంతాలకి వచ్చి కనీసం 30 నుండి 40 రోజులు పనులు చేసుకొంటున్నారు. వీరిలో ఎక్కువ మంది బంగ్లాదేశ్ నుండి వలస వచ్చి బెంగాల్‌లో స్థిరపడ్డారు. 'పనులు లేక వలసలు వస్తున్న మీకు ఉపాధి హామీ పనులు చూపడం లేదా' అని ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 'అక్కడ పనులు కల్పిస్తే ఇక్కడికి ఎందుకు వస్తామ'ంటూ వాపోయారు.

మొత్తంగా చూస్తే వ్యవసాయ కార్మికుల వలసల నివారణ కోసం ఏర్పడ్డ ఉపాధి హామీ చట్టం, కూలీల కంటే ఆయా రాష్ట్రాల అధికార పార్టీ నాయకులకు, కాంట్రాక్టర్లకు ఉపాధిగా మారినట్లు స్పష్టమవుతోంది. ఇలా వుండగా ఉపాధి హామీ నిధులను చట్ట ప్రకారం కూలీలకు ఖర్చు చేస్తున్న రాష్ట్రం దేశంలోనే ఒక్క త్రిపుర అని కేంద్ర ప్రభుత్వమే అంగీకరించడం గమనార్హం.

ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లాలో 7 లక్షల ఎకరాల వరి సాగు భూమి వుంటే అందులో సుమారు 3 లక్షల ఎకరాలకు పైగా రొయ్యలు, చేపల చెరువులుగా మారిపోయాయి. మరో పక్క ఊడుపు యంత్రాలతో ఎద చల్లే పద్ధతి, కలుపు మందు, వరి కోత యంత్రాల ఫలితంగా జిల్లాలో వున్న 12 లక్షల మంది కూలీల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో వలసలు ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు వుండేవి. ప్రస్తుతం రాష్ట్రాలు దాటడమే కాక అంతకంతకూ పెరగటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే చాలా వరకు వలసలు నివారించవచ్చు. కాని మన ప్రధాని మోడీకి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు నూటికి 20 శాతం వున్న కార్పొరేట్ల ఆదాయాల పెంపు గురించి తప్ప, 80 శాతంగా వున్న ప్రజల గురించి ఆలోచించే తీరిక లేకుండా పోయింది. ఇప్పటికే 2017 ఆగస్టు 9న ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం నిజమైన పేదల కోసం అమలు చేయాలని ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని వేలాది మందితో నిర్వహించారు. అయినా దున్నపోతు పై వర్షం పడినట్లు ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. రానున్న రోజుల్లో పై చట్టాలతో పాటు వలసల నివారణపై కూడా ఐక్యంగా ఆందోళనకి సిద్ధం కావటమే తక్షణ కర్తవ్యం.

(రచయిత ఎ.పి. వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి, సెల్ : 9493714378)

జన వాక్యం

నాణ్యతే ఉండదు

రైళ్లల్లో పెట్టే ఆహారపదార్థాల్లో నాణ్యత లోపిస్తోంది. అంతేకాదు, సామాన్యులకు, పేదలకు ధరలు అందుబాటులో వుండటం లేదు. పైగా ఎక్కువశాతం ఆలు బొండా, మిరపకాయ బజ్జీలనే విక్రయిస్తు న్నారు. ఇటువంటి పదార్థాలు చాలా మందికి సరిపడవు. తప్పనిసరి పరిస్థితుల్లో తింటే ఆరోగ్యసమస్యలు వస్తున్నాయి. ఇక భోజనం సంగతి సరేసరి. నీళ్లచారు, ఉడికీ ఉడకని అన్నం, కూర. కనీసం ఒక్క పండు కూడా ఆహారంలో భాగం చేయరు. రైల్వ శాఖ ఈ నిర్లక్ష్యాన్ని వదిలి వేయాలి. శక్తినిచ్చే ఆహారం సరఫరా చేయాలి. నాణ్యమైన, ఆరోగ్యకర ఆహారం అందుబాటులో వుంచాలి.

జె సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

రాష్ట్రానికి మరోసారి మొండిచెయ్యి!

కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలను పూర్తిగా నిరుత్సాహ పరచిందన టంలో ఎటువంటి సందేహం లేదు. రైల్వే జోన్‌తో సహ రైల్వే ప్రాజెక్టులను కూడా నిర్లక్ష్యం చేసింది. కనీసం ప్రారంభించిన విద్యాసంస్థలకు కూడా అర కొర నిధులను కేటాయించలేదు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్య చర్యే! రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి కేంద్రం, ఏ మాత్రం సరిచేసే ప్రయత్నం చేయకపోవటం విచారకరం. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయవలసిన రాజ్యాంగ ధర్మాన్ని కూడా విస్మరించటం ఫెడరల్ స్ఫూర్తికి భంగకరం. ఈ పోకడలు దేశ సమగ్రతకు కూడా ప్రమాదకరమని పాలకులు గుర్తించాలి.

గరిమెళ్ళ రామకృష్ణ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

ప్రభుత్వ విధానాలతో దళితులపై పెరుగుతున్న దాడులు



కంచల జయరాజ్



దళితులపై దాడులు పెరగడానికి కారణం ఏంటి? ప్రభుత్వ విధానాలే దీనికి కారణమా? అసమానతల్ని పెంచి పోషించే వర్గాలను అణచి వేయడంలో యంత్రాంగం విఫలం అవ్వడం వల్లనే దాడుల పరంపర కొనసాగుతోందా? అనే అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ప్రభుత్వాలు అనుసరించే విధానల వల్ల అట్టడుగు వర్గాలపై కొన్ని శక్తులు ఆధిపత్యం చేయడానికి తిరిగి పూనుకుంటున్నాయి. ఆరంభంలోనే వీటిని గుర్తించి, అణచి వేసే దిశగా ప్రభుత్వ చర్యలు లేకపోవడంతో పరిస్థితులు శృతి మించుతున్నాయి. ఫలితంగానే దళితులపై దాడుల పర్వం కొనసాగుతోంది. ఉన్న చట్టాలను సైతం అమలు చేసే విషయంలో ఆధిపత్య వర్గాలు పైచేయిగా వ్యవహరించడం వల్లనే దాడుల నియంత్రణ చేయలేక పోతున్నారనే అపవాదూ ఉంది. ఫలితంగా రాష్ట్రంలో రోజుకో ప్రాంతంలో దళితులపై దాడులు కొనసాగుతున్నా యి. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించే విధానం ఆశాజనకంగా లేకపోవడంతో బాధితులకు న్యాయం జరగడం లేదు. అండగా నిలిచే వారిపైనా బెదిరింపులు, వత్తిళ్లు రావడంతో బాధితుల పక్షాన నిలబడే వారు తగ్గిపోతున్నారు. ఒక వైపు ప్రభుత్వం దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మరో వైపు దళితులపై జరుగుతోన్న దాడుల విషయంలో మౌనం దాలుస్తోంది. సామాజిక అంశంగా ఉన్న అంటరాని తనాన్ని రూపుమాపే చర్యలు చేపట్టాల్సిన సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పురావృతం అవుతున్నాయి.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో దళితుల కోసం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడం, రాబోయే ఎన్నికల్లో వారి ఓట్ల ద్వారా లబ్ధి పొందడమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారు. గతంలో కూడా రాష్ట్రంలో దళితులపై దాడులు జరిగాయి. వాటిపై ప్రభుత్వాలు ఎంతో కొంత స్పందించాయి. కానీ ఇటీవల కాలంలో దాడుల పరంపర తీవ్రమౌతోంది. ఎక్కడా చర్యలు లేవు. ప్రభుత్వం స్పందిస్తోన్న తీరు కూడా ఆశాజనకంగా లేదు. ఫలితంగానే దాడుల సంఖ్య పెరుగుతోంది. మొన్న గరగపర్రు, నిన్న పెద్దగొట్టిపాడు, మొన్న ఆగిరిపల్లి సంఘటనలే వీటికి నిదర్శనం. జరిగిన సంఘటనలపై ప్రభుత్వం స్పందించిన విధానం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. బాధితులకు అండగా నిలిచే సాహసం చేసే వారిపైన సైతం అక్రమ కేసులు పెట్టడం, జైళ్లకు పంపుతూ భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ముఖ్యంగా దళితుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న వామపక్షాల మీద నిర్బంధానికి పాల్పడుతున్నారు. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక దళితునిపై దాడి జరుగుతోంది. రోజుకు ఇద్దరు దళితులు హత్యకు గురవుతు న్నారు. ముగ్గురు దళిత మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి. 11 మంది దళితులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. గడచిన 15 ఏళ్లలో కోటిన్నర మంది దళితులు అత్యంత తీవ్రమైన దాడులకు గురయ్యారు అని 'నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో' నివేదిక స్పష్టం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఏ స్థాయిలోనూ దళితులపై జరిగే దాడులను సీరియస్‌గా తీసుకోవడం లేదు. వాటిపై సరైన దిశలో విచారణ చేయడం లేదు. చర్యలు లేకపోవడం వల్లే దాడుల సంఖ్య పెరుగుతోంది. దేశంలో గోవులకున్న రక్షణ దళితులకు లేకుండా పోయింది. అందుకే సమాజంలో అసహనం పెరిగింది. ప్రజల మధ్య తీవ్రమైన అంతరం పెరిగిపోతోంది. కక్షలు, పగలు పెచ్చరిల్లి పోతున్నాయి. దీని ప్రభావం రాబోయే రోజుల్లో సమాజంలో తీవ్రంగా పడబోతోంది. రాజకీయ అధికారం కోసం కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించి పబ్బం గడుపుకోవడానికి పార్టీలూ, నేతలూ చూస్తున్నారు. దీనివల్ల దళిత సమూహం నష్టపోతోంది. దీనికి పాలకులే బాధ్యులన్నది గమనించాల్సిన అంశం.

అగ్రస్థానంలో ఆంధ్రా!

దళితులపై జరుగుతోన్న దాడుల్లో దేశంలోనే మన రాష్ట్రం ముందంజలో ఉంది. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాల్లో మనమే ముందున్నాం. బీహార్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో రాజస్థాన్ మూడో స్థానంలో ఉంటే మన రాష్ట్రం నాలుగో స్థానంలో నిలిచింది. దళితులపై దాడులు, హత్యలు, మానభంగాలు, కులం పేరుతో దూషించడం వంటివి సుమారు ఏడు వేల కేసులు ఎ.పిలో నమోదు అయ్యాయి. ఇంత పెద్ద మొత్తంలో కేసులు నమోదు కావడం ఇదే ప్రథమం. 2015లో 4,415 కేసులు నమోదు అయితే తాజా గణాంకాల ప్రకారం ఏడు వేలకు పెరిగాయి. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు సరైన దిశగా స్పందించక పోవడమే. పాలనా వ్యవస్థ గాడి తప్పి వ్యవహరించడమే. జనాభా ప్రాతిపదికన చూస్తే రాజస్థాన్ తర్వాత దళితులపై జరిగే దాడుల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. సమాజంలో అంటరానితనం అధికారికంగా రాజ్యమేలుతోంది. దళితుల పట్ల వివక్ష కొనసాగుతోంది. అన్యాయాలు, అక్రమాలు, అత్యాచారాలు, దాడులు దమనకాండలు, ఊచకోతలు నిత్యకృత్యం అయ్యాయి. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం ఉన్నప్పటికీ దాన్ని అమలు చేసే పోలీసు వ్యవస్థ గాడి తప్పి వ్యవహరిస్తోంది. అన్నింటా రాజకీయ జోక్యం పెరగడంతో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం సవ్యంగా అమలు కావడం లేదు. గతం నుంచీ చూస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది. కంచికచర్ల కోటేశు సజీవదహనం, చుండూరులో ఎనిమిది మంది దళితుల ఊచకోత, కారంచేడులో జరిగిన దారుణ మారణకాండ, తిమ్మసముద్రం, పదిరికుప్పం, చీమకుర్తి, వేంపెంట, లక్ష్మీంపేటలో జరిగిన అమానుషాలే నిదర్శనాలు. వాటిల్లో ఎక్కడా దళితులపై దాడిచేసిన వారిపై చర్యలు లేవు. ఫలితంగానే ఈ దమనకాండ ఇంకా కొనసాగుతోంది. ఒక వైపు అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా అమరావతి రాజధాని ప్రాంతంలో 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పడానికి సన్నాహాలు చేస్తోన్న ప్రభుత్వం గరగపర్రులో మాత్రం అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వలేదు. నెలకొల్పిన విగ్రహాన్ని కూల్చేసిన వారిపై చర్యలు లేవు. గ్రామ బహిష్కరణ చేసిన వారిని పన్నెత్తి మాట అన్నవారు లేరు. పెద్దగొట్టిపాడులో దళిత యువకులపై మారణాయుధాలతో అకారణంగా దాడి చేసి, ఎదురు కేసులు పెట్టి, వేధిస్తున్నా నిందితులపై ఎలాంటి చర్యలూ లేవు. పైగా కేసులు రాజీ చేసుకోవాలని, లేకపోతే నష్టపోయేది దళితులే అని హెచ్చరించే అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. దళిత యువకులను కేసుల్లో ఇరికించి, రాజీ చేసుకోకపోతే కేసులు అలాగే ఉంటాయని, ఉద్యోగాలకు ఇబ్బంది అవుతుందని భయపెట్టే సందర్భం పెదగొట్టిపాడులో నెలకొంది. దాడులు చేయడం, కేసులు లేకుండా చూసుకోవడం అలవాటైంది. ఎక్కడైనా ఒకరిద్దరు దాడి చేసిన వారిపై తిరుగుబాటు చేసే యత్నం చేస్తే వారిని బెదిరించి, భయపెట్టి మరీ దారిలోకి తెచ్చుకునే యత్నాలు చేస్తున్నారు.

అంబేద్కర్ స్ఫూర్తి కావాలి!

బోధించు, సమీకరించు, పోరాడు అన్న అంబేద్కర్ సిద్ధాంతాన్ని ఇప్పుడు ఆచరించాల్సిన సమయం ఆసన్నమైంది. జరుగుతోన్న దాడుల విషయంలో అటు ప్రభుత్వం నుంచి ఎలాగో స్పందన నామ మాత్రంగానే ఉంది. కానీ దళిత సంఘాలు, అంబేద్కర్ యువజన సంఘాలు కూడా మరింతగా తమ స్వరాన్ని పెంచితే మంచి ఫలితాలు ఉంటాయి. ఆయా పార్టీల్లో ఉన్న నేతలు దళితులపై దాడులు జరిగినప్పుడు ముక్తకంఠంతో ప్రశ్నిస్తే సంఘ బలం పెరుగు తుంది. దాడులు చేసే వారు సైతం భయపడతారు. ప్రభుత్వం కూడా ఆలోచిస్తుంది. తక్షణమే స్పందిస్తుంది. కానీ ఈ స్ఫూర్తిలో కొంత వెనుకబాటుతనం కన్పిస్తోంది. దీనికి కారణాలు అనేకం అయినా దళితులపై దాడులు జరుగుతున్నాయని జరిగిన తర్వాత బాధపడేకంటే, జరగడానికి మూల కారణాలను గుర్తించడం, వాటిని ఆపే యత్నాలు చేయడం అవసరం. మేధావులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఆయా వర్గాల నుంచి ఎంతో మంది ఉన్నారు. దళిత సమాజం నుంచి ఎంతో మేలుపొందిన వారు సైతం దాడులు జరిగే సమయంలో అయినా మరింతగా తమ స్వరాన్ని పెంచితే బాగుండేది. ఇప్పుడు సోషల్ మీడియాలో ఆయా దళిత, అనుబంధ సంఘాలు నేరుగానే నిరసన తెలియజేస్తున్నాయి. కానీ ఇది మాత్రమే సరిపోదు. దీనికంటే ముందు దాడులకు గురయ్యే వర్గాలు చైతన్యం పొందాలి. సంఘటితం కావాలి. ఇపుడు జరిగే యత్నాలు గతంతో పోలిస్తే ఆశాజనకంగానే ఉన్నప్పటికీ ఇవి మాత్రమే సరిపోవు. ఇప్పుడు వామపక్షాలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు నిమ్న జాతులకు జరిగే అన్యాయంపై పోరాడటానికి నేరుగా కలిసి వస్తున్నాయి. దీంతో పోరాడే శక్తి మరింతగా పెరిగినట్లే. ఇప్పుడు ప్రభుత్వం పైనా, దాడులు చేసే వర్గాల పైన వత్తిడి తేవడం మరింత తేలిక. కానీ ప్రయత్న లోపం వల్లనే ఆయా వర్గాలు పోరాటంలో వెనకబడుతున్నాయి. దీనివల్ల బలహీన పడుతున్నారు. అందుకే, ఈ దాడులను నిరోధించాలంటే సంఘటితం కావడం, పోరాటపథాన్ని అందు కోవడమే ఏకైక మార్గం. యజ్ఞయాగాదుల్లో మేకలనే బలి ఇస్తారు, సింహాలను కాదు అనే అంబేద్కర్ హితవును ఇప్పుడు నిమ్నజాతులు గుర్తించాలి.

(రచయిత 10టీవీ, డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్ సెల్ : 8498084059)

మార్పుకు ముందడుగు మహిళా ఇమామ్

ఇటీవల భారతదేశంలో కొన్ని దేవాలయాల్లోకి స్త్రీ వెళ్లకూడదనే నియమాన్ని సవాల్ చేసిన మహిళామణులు సాధించిన విజయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పటికీ అన్నిచోట్లా దైవారాధన, ప్రార్థనలు పురుషులే నిర్వహించడం పరిపాటి. ముఖ్యంగా ఇస్లాం మతాచారంలో మసీదులలోకి స్త్రీలను అనుమతించరు. కానీ ఇప్పుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేసే కాలం వచ్చింది. ఊహాతీతమైన 'మహిళా ఇమామ్' నిజమై సాక్షాత్కరించింది. భారతదేశంలో మొట్టమొదటిసారి ఒక మహిళ, స్త్రీ-పురుషుల సమేతంగా శుక్రవారం ప్రార్థనలు నిర్వహించింది. దీంతో ఆమెకూ ఎన్నో బెదిరింపులూ వచ్చాయి. అయినా ప్రాణాలకు తెగించి ఆమె తీసుకున్న ఈ నిర్ణయం వెనుక వాస్తవిక కథేంటి? తెలుసుకుందాం!!



పన్నెండేళ్ల క్రితంనాటి సంగతిది. అమెరికాలోని వర్జీనియా కామన్‌వెల్త్ యూనివర్సిటీలో మతం, తత్వశాస్త్రం బోధించే ప్రొఫెసర్ అమీనా వదూద్ తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయం. ముస్లిం సంఘం నిర్వహించే శుక్రవారం ప్రార్థనలైన 'జుమ్మా నమాజ్'ను నడిపించిన ఆమె నిర్ణయాన్ని అప్పట్లో ప్రపంచ ప్రజాస్వామ్యవాదులందరూ కొనియాడారు. ఈ చర్యతో కేవలం పురుషులు మాత్రమే ప్రార్థనలు నడిపించే 'ఇమామ్'లుగా ఉండాలనే ఇస్లాం మతాచారంలో కలకలం మొదలయ్యింది. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎందరో ముస్లీమ్ విద్యావంతులు, ప్రొఫెసర్స్ అమీనాకు సపోర్ట్‌గా నిలబడ్డారు. స్ఫూర్తినిచ్చే ఆమె ప్రసంగాలకు ఎందరో అభిమానులుగా మారారు. అప్పటి నుంచీ ఇప్పటికీ అమీనా శుక్రవారం ప్రార్థనలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఎందరో మతవాదులు ఆమె చర్యను విమర్శించారు. చంపేస్తామనే బెదిరింపులకైతే లెక్కేలేదు. కానీ అమీనా వదూద్ మాత్రం వెనకడుగు వేయలేదు.

ఇప్పుడు మన వంతు

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ముస్లిం మహిళల్లో సమానత్వపు ఆలోచనలకు అమీనా తీసుకున్న నిర్ణయం ఊతమిచ్చింది. ఇప్పటికీ మతతత్వ ఆలోచనలు మెండుగా ఉన్న భారతదేశంలోనూ మరో మహిళ ముందుకు వచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో జనవరి 26, శుక్రవారం, కేరళలోని మలప్పురానికి చెందిన 34 ఏళ్ల జమీదా బీవీ మహిళా ఇమామ్‌గా తొలి అడుగు వేశారు. ఇది దేశంలో మొట్టమొదటిసారి ఒక మహిళ ఇమామ్‌గా మారిన వేళ. ఖురాన్ సున్నత్ సొసైటీ కేంద్రకమిటీ కార్యాలయం వేదికగా 30 మంది స్త్రీ-పురుషులు జమీదా నడిపిన జుమ్మా నమాజ్‌లో పాలుపంచుకున్నారు. అయితే జమీదాకూ బెదిరింపులు రాకపోలేదు. ఇస్లామ్‌ను లెక్కచేయట్లేదనే అభిప్రాయంతో మతపెద్దలు కోపోద్రిక్తులయ్యారు. సామాజిక మాధ్యమాల వేదికగా చాలామంది ఆమెను వేధించడం మొదలుపెట్టారు. మతాచారాలను భ్రష్టు పట్టిస్తున్నావంటూ తిట్టిపోశారు. వీళ్లకు సమాధానంగా 'ఖురాన్‌లో వివక్షకు తావులేదు. స్త్రీ-పురులిద్దరికీ సమాన హక్కులున్నాయి. మరీముఖ్యంగా ప్రార్థనలను పురుషులే నిర్వహించాలనే ఆజ్ఞ ఖురాన్‌లో ఎక్కడా లేదు' అంటారావిడ.

సైనికుని పుత్రిక

జమీదా బీవీ భారత ఆర్మీ సైనికునికి పుట్టిన 13 మంది సంతానంలో చివరి అమ్మాయి. ఉన్నత చదువుల కోసం మలప్పురంలోని జామియా నద్వియ్య అరబిక్ కాలేజ్‌లో చేరి, అరబిక్‌ను చదువుకుంది. తరగతిగదిలో చాలా ఉత్సాహంగా ఉండేది. విద్యార్థినిగా ఉన్నప్పుడే ఇస్లామ్‌కు సంబంధించిన వివిధ ప్రశ్నలతో టీచర్లను ఇబ్బందుల్లో పెట్టేది. ఆమె తెలియని విషయాన్ని తెలుసుకోవడానికే ప్రశ్నలు అడుగుతున్నా, టీచర్లు మాత్రం ఆమెను ఒక తిరుగుబాటు చేస్తున్న వ్యక్తిగా అనుకునేవారు. కొన్నిసార్లు ఆమెను క్లాస్ నుంచి బయటకు పంపేసేవారు. కానీ జమీదాకు నిజాన్ని తెలుసుకోవాలనే తపన మాత్రం తగ్గలేదు. అందుకే ఇప్పటికీ ఆమె ప్రశ్నిస్తూనే ఉంటుంది.




ప్రపంచంలో తొలి మహిళా ఇమామ్
అమీనా వదూద్

నిజానికే మద్దతు

చదువు పూర్తయిన వెంటనే వద్దన్నా వినిపించుకోకుండా తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేసేశారు. అయితే అతనితో జీవించడం ఆమెకు చాలా కష్టంగా అనిపించింది. విడాకులు తీసుకుందామంటే కుటుంబసభ్యులు 'విడాకులంటే దేవుడికి ఇష్టముండదని' చెప్పి వారించారు. చివరికి పెళ్లైన 13 ఏళ్లకు ఇద్దరి పిల్లల తల్లిగా, ఆమె భర్త నుంచి విడాకులు తీసుకున్నారు. అక్కడి నుంచి తిరువనంతపురానికి వెళ్లి, అక్కడ పాఠశాల విద్యార్థులకు అరబిక్ పాఠాలు చెబుతూ జీవితాన్ని కొనసాగించారు. అంతేకాదు. పిల్లలకు ఉచితంగా ఖురాన్ పాఠాలు చెప్పేవారు. 2014లో మహిళలకు ఖురాన్ పాఠాలు చెబుతూ 'ప్రార్థనల్లో భాగంగా 'ఆమెన్' అనే మాటను వాడటం ఖురాన్‌లో నిషేధింపబడింది. ఇది అరబిక్ పదం కాదు' అని జమీదా చెప్పడం మతపెద్దలకు కోపం తెప్పించింది. ఆ కారణంగా జమీదాను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. కొందరు ఆమె కూతుర్నీ హింసించడం ప్రారంభించారు. ఆమెను ద్వేషించేవారు ఎక్కువ కావడంతో.. అక్కడి నుంచి మరో ప్రాంతానికి వెళ్లిపోయారు. అక్కడే ఆమె ఖురాన్ సున్నత్ సొసైటీలో సభ్యురాలిగా చేరారు. అక్కడ తక్కువ సమయంలోనే ఎక్కువ మంది అభిమానం పొందారామె.

సమసమాజమే స్ఫూర్తి

స్త్రీలు ప్రార్థనలు నిర్వహించకూడదనే నియమం ఖురాన్‌లో లేదని తెలియజేయడానికే జమీదా ఇమామ్‌గా మారానంటారు. ఈ సంఘటన తర్వాత జమీదాను నాస్తికురాలనీ, కాఫీర్ అంటూ చాలా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఆమెకొచ్చిన ఒక ఫొటో మెసేజ్‌లో ఒక శవానికి ఆమె తల అంటించి పంపారు. దీన్నిబట్టి ఆమెకొచ్చిన బెదిరింపుల స్థాయిని అర్థం చేసుకోవచ్చు. అయితే గతంలో అమెరికాలో ప్రార్థనలు నిర్వహించిన అమీనా వదూద్‌కి వచ్చినంత సహకారం భారతదేశంలో మార్పుకోసం ప్రయత్నించిన జమీదా బీవీకి రాలేదు. దానికి ఎలాంటి కారణాలున్నాయో? తెలియదు కానీ, ఆమె అభిప్రాయంలో జమీదా 'ఖురాన్ సున్నత్ సొసైటీ'కి చెందిన వ్యక్తి గనుకనే ఆమెకు అలాంటి సహకారం అందలేదని అంటారావిడ. ఖురాన్ సున్నత్ సొసైటీ అనేది ముస్లిం కమ్యూనిటీని సంస్కరించాలనే ఆశయంతో ఏర్పడిన కేరళలోని ఒక చిన్న సంఘం. వీళ్లు పాటించే పద్ధతులు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది పాటించే సున్నీ ఇస్లామ్ ఆచారాలతో పోలిస్తే కొంత వేరుగా కనిపిస్తాయి. అయితే ఖురాన్‌ను తు.చ తప్పక పాటించే ఈ సంఘం 'ట్రిపుల్ తలాక్'కు వ్యతిరేకంగానూ పోరాడింది. అలాంటి ప్రచారాలు చేస్తున్నందుకు జమీదాకు ఉన్నతస్థాయి మతపెద్దల నుంచీ బెదిరింపులు అందాయి. అయితే 'వాళ్లు నన్ను భూమిపై లేకుండా చేయాలనుకుంటున్నారేమో.. నేను దానికి సిద్ధపడే ఉన్నాను' అంటారావిడ.

- జీవన డెస్క్




'ఎలాంటి ఉద్యమమైనా, ఏ విప్లవమైనా కొంత సమయం తీసుకుంటుంది. అయితే మార్పు మాత్రం తప్పనిసరిగా వస్తుంది. అది క్రమక్రమంగా తెలుస్తుంది' అనే జమీదా పోరాటానికి మరింత మంది అండగా నిలబడాలి. స్త్రీ-పురుషుల మధ్య వ్యత్యాసాన్ని సృష్టించి, పెంచి పోషిస్తున్న మతాచారాల్లో మార్పు తప్పనిసరిగా వస్తుంది.

నేరం.. ఎవరు చేసినా నేరమే

నాకు ముగ్గురు కొడుకులు రెండోవాడు ఆర్మీలో చేస్తాడు. మా తండ్రిగారి నుంచి నాకు పదిహేను సెంట్ల భూమి వచ్చింది. మొత్తం తనకే రాసివ్వమని లేకపోతే చంపుతానని, తనమీద కేసు పెట్టినా పోలీసులు తననేమీ చెయ్యరంటున్నాడు. నేనేం చెయ్యాలి?

అబ్దుల్ ఖాదర్ జిలానీ, బనగానపల్లె

న్యాయ నేస్త్రం



ఇప్పటితరం సంతానం ఇలా తయారయ్యారు. తల్లిదండ్రుల కంటే ఆస్థిపాస్థులమీద ప్రేమ ఎక్కువ. ఆస్థికోసం ఎంతకైనా తెగిస్తున్నారు. ప్రాణాలు కూడా తీస్తున్నారు.

మీ అబ్బాయిది నేరస్వభావం. మీ ఆస్థి మీ తదనంతరం ముగ్గురు కొడుకులకూ సమానంగా చెందుతుంది. బెదిరించినంత మాత్రాన మీ రెండో అబ్బాయికి మొత్తం ఆస్థిమీద హక్కురాదు. తను ఆర్మీలో పనిచేస్తున్నాడు గనక, పోలీసులు తననేమీ చెయ్యరనటం అబద్ధం. నేరం ఎవరు చేసినా తప్పించుకోలేరు. ఎలాంటి హోదాలో ఉన్నాసరే.

మొదట మీది సివిల్ (ఆస్థి) తగదా. పంపకాలు చెయ్యాలంటే ముగ్గురికీ సమంగా పంచాలి. ఈ సివిల్ తగాదాలో పోలీసులు, ఇతరులు జోక్యం చేసుకునే వీలులేదు. మీరు జీవించి ఉండగా ఆస్థిపంచమనే హక్కు మీ అబ్బాయికి లేదు. మీ జీవనాధారాన్ని ఉంచుకుంటూ మీ తర్వాత మీ కుమారులకు చెందేలా వీలునామా రాయండి.

ఒకవేళ మీ పై దౌర్జన్యం చేసినా, బెదిరించినా మీరు పోలీసు ఉన్నతాధికారులకు మీ మిగతా కుమారులతో కలిసి వెళ్లి జాయింటుగా ఫిర్యాదు ఇస్తూ రక్షణ కోరండి. మీ రెండవ అబ్బాయిమీద క్రిమినల్ కేసు నమోదవుతుంది. అప్పుడు దారికివస్తాడు. ★




కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం :8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com

జీవన సౌరభం

కోపం మనసులో కాదు మాటలో మాత్రమే ఉండాలి. ప్రేమ మాటలో మాత్రమే కాదు మనసులోనూ ఉండాలి

మొటిమలు తగ్గాలంటే?!

మనలో చాలా మంది మొటిమలను పోగొట్టడానికి మార్కెట్‌లో దొరికే రకరకాల క్రీములతో కుస్తీలు పడుతుంటారు. అయితే, వాటివలన లాభాలు కంటే నష్టాలే ఎక్కువ. అలాగే మొటిమల విషయంలో కొన్ని జాగ్రత్తలూ అవసరం. ముఖ్యంగా మొటిమలు గిల్లటం వల్ల మరింత తీవ్రమయ్యే ప్రమాదముంది. ముఖంపై నూనె లేదా జిడ్డుగా ఉండే ఎలాంటి పదార్థాలనూ రాయకూడదు. ఇలాంటివి చర్మంలోని తైల గ్రంథులు మూసుకునేలా చేసి మొటిమలను మరింత తీవ్రం చేస్తాయి. తలకు నూనె, క్రీముల వంటివి వాడితే.. అవి ముఖమంతా విస్తరించి, మొటిమలు ఉధృతం కావటానికి దోహదం చేస్తాయి. అలాకాకుండా ఇంట్లో సహజసిద్ధమైన చిట్కాలు మొటిమలను దూరం చేయవచ్చు.



✧ చెంచా గంధపు పొడిలో చిటికెడు పసుపు, కొద్దిగా పాలు కలిపి, ముఖానికి రాస్తే క్రమేణా మొటిమలు తగ్గుతాయి. అలాగే, దాల్చిన చెక్కను ముద్దలా చేసి మొటిమలపై రాసి కాసేపాగి కడగాలి.

✧ రాత్రి పడుకోబోయే ముందు గోరువెచ్చని నీటితో ముఖం శుభ్రంగా కడుక్కుని, మెంతి ఆకులతో చేసిన పేస్ట్‌ని ముఖానికి మాస్క్‌లా వేయాలి. ఆరిన తర్వాత కడిగితే మొటిమలు దూరం అవుతాయి.

✧ కొత్తిమీర రసంలో చిటికెడు ఉప్పు కలిపి ముఖానికి రాసి, అరగంట తర్వాత చన్నీటితో కడిగితే మొటిమలు పోతాయి. ఉసిరి విత్తనాలను నాలుగైదు గంటలపాటు నీటిలో నానపెట్టాలి. తర్వాత దాన్ని రుబ్బి, ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించినా మొటిమలు పోతాయి.

✧ కమలాపళ్ళ తొక్కలను ఎండ బెట్టి చూర్ణం చేసి మొహానికి రాసుకుంటే మొటిమలు, మచ్చలు కూడా పోతాయి. కొద్దిగా పుదీనా ఆకులు మెత్తగా నూరి రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసి, ఉదయాన్నే శుభ్రంగా కడగాలి. ఇలా వారం రోజులు చేస్తే మచ్చలు తగ్గుతాయి. ★

కిచెన్ గార్డెన్ ఇలా!

ఇటీవల కాలంలో ఇంట్లోనే ఆకుకూరలు, కూరగాయలు పెంచుతున్నారు. దీనికి ఇదే మంచి సమయం. ఇంట్లో ఉన్న స్థలాన్ని బట్టి మొక్కల నిర్వహణ ఎలా చేయాలో కొన్ని చిట్కాలు చూద్దాం!



➢ వంటగదిలో మొక్కలను పెంచే ప్రదేశంలో ఎప్పుడూ సూర్యకాంతి పుష్కలంగా పడేలా ఉండాలి. మొక్కలు బాగా ఎదగాలంటే కనీసం 5–6 గంటల సూర్యకాంతి మొక్కలకు కావాల్సి ఉంటుంది. కూరగాయల మొక్కలకు ఎర్రమట్టి తప్పనిసరి. అలాగే, ఎక్కువ, తక్కువ కాకుండా తగినన్ని నీళ్ళు రెగ్యులర్‌గా పోస్తూ ఉండాలి. ప్రారంభదశలో మట్టి తడిస్తే చాలు. తర్వాత వాతావరణాన్ని బట్టి నీటిని పోస్తుండాలి.

➢ ఎరువును ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. కడిగిన కూరగాయల నీళ్ళు, తొక్కలు, గుడ్డు పెంకులు... ఇలాంటి వాటిని పారేయకుండా మొక్కల్లో వేస్తే అది ఎరువుగా మారుతుంది. మొక్కల ఎదుగుదలకు ఎంతో సహాయపడుతుంది.

➢ వీటన్నింటి కన్నా మొక్కల ఎంపిక ఎంతో ముఖ్యం. తక్కువ సమయంలో ఎదిగే కూరగాయలను, ఆకుకూరలను ఎంపిక చేసుకోవడం అవసరం. అలాగే రెగ్యులర్‌గా ఉపయోగించే మెంతికూర, కరివేపాకు, కొత్తిమీరలాంటి వాటినూ ఇంట్లో పెంచుకోవచ్చు. వీటిని పెట్టే ముందు వాతావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

➢ ఈ మొక్కలను ఎక్కడ, ఎలా పెట్టాలనుకుంటున్నారో నిర్ణయించుకోవాలి. వంటగదికి ఆనుకొని ఉండే బాల్కనీలో, వంటగదిలో... దీని వల్ల వాటి నిర్వహణ చాలా సులభమవుతుంది. చివరగా, కిచెన్ గార్డెన్ మొదలు పెట్టాక, వాటి సంరక్షణ చిన్న పిల్లల సంరక్షణ లాంటిదన్న విషయాన్ని మరిచిపోవద్దు. నిత్యం పర్యవేక్షణ చాలా అవసరం. ★

మీ కోసం

పొదీనా పచ్చడి చేసేటప్పుడు కొంచెం పెరుగు కలిపితే రంగు, రుచి బాగుంటుంది






మదుపర్లకు కేంద్రం షాక్

క్రిప్టో కరెన్సీలు నిషేధం

మంత్రి జైట్లీ వెల్లడి

పడిపోయిన బిట్ కాయిన్ విలువ



న్యూఢిల్లీ : భారత్‌లో క్రిప్టో కరెన్సీలకు అనుమతి లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఈ వర్చువల్ కరెన్సీలకు గుర్తింపు లేదని గురువారం నాటి బడ్జెట్‌లో స్పష్టం చేశారు. ప్రపంచంలోని ప్రతీ 10 బిట్ కాయిన్ కొనుగోళ్లలో భారత్ నుంచి ఒక్క కాయిన్ కొనుగోలు జరుగుతుంది. వీటి వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి బడ్జెట్‌లో తెలిపారు. క్రిప్టో కరెన్సీలను నిరోధించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. దీంతో బిట్‌కాయిన్ల వినియోగంపై నిషేధం పడినట్లయింది. ఇప్పటికే ఐటీశాఖ దాదాపు 5లక్షల బిట్ కాయిన్ కొనుగోలుదార్లను గుర్తించి నోటీసులు జారీ చేసింది. డిజిటల్ పేమెంట్లకు మాత్రం బ్లాక్ చెయిన్ టెక్నాలజీని ఉపయోగించుకుంటామని మంత్రి అన్నారు. భారత్‌లో క్రిప్టో కరెన్సీ చెల్లుబాటు అవుతుందని చెప్పేందుకు ఎలాంటి చట్టాలు లేవని, ఇందుకోసం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏ కంపెనీలకు లైసెన్సులు కల్పించలేదని ఇది వరకే మంత్రి పేర్కొన్నారు. బిట్‌కాయిన్లతో చేసే వ్యాపారాలపై చట్ట పర్యవేక్షణ లేకుండా పోతోంది.

10% పతనం..

అరుణ్ జైట్లీ ప్రకటన బిట్ కాయిన్‌పై తీవ్ర ప్రభావం చూపింది. గురువారం ఈ కాయిన్ విలువ 9.9 శాతం పతనమై 9,157.40 వద్ద ట్రేడింగ్ అయ్యింది. భారత్‌లో క్రిప్టో కరెన్సీలను నిషేధిస్తున్నామని జైట్లీ ప్రకటించడంతో ఈ పరిస్థితి చోటు చేసుకున్నట్లు కథనాలు వచ్చాయి.

త్వరలో 'పసిడి' పాలసీ

న్యూఢిల్లీ : బంగారాన్ని ఒక ఆస్తిగా పరిగణించేందుకు ఒక గోల్డ్ పాలసీకి త్వరలోనే రూపకల్పన చేయనున్నామని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో పేర్కొన్నారు. గోల్డ్ మానిటైజేషన్ పథకం గురించి మాట్లాడుతూ అసెట్ క్లాస్‌గా విలువైన లోహం బంగారాన్ని అభివద్ధి చేసేందుకు ప్రభుత్వం ఒక సమగ్ర గోల్డ్ పాలసీని తీసుకురానుందన్నారు. దేశంలో స్నేహపూర్వక వినియోగదారి తత్వముతో పాటు పసిడి ఎక్స్చేంజీల వాణిజ్య సామర్థ్యాన్నిని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ప్రజలు ఎలాంటి అవాంతరాలు లేకుండా గోల్డ్ డిపాజిట్ ఖాతా తెరవడానికి వీలు కల్పించనున్నట్టు జైట్లీ తెలిపారు. 2016లో భారత్ 666 టన్నుల పసిడి డిమాండ్‌ను నమోదు చేసిందని వాల్డ్‌గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది.



ఎల్‌టిసిజిపై 10% పన్ను

మార్కెట్లపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్ ఈక్విటీల్లో పెట్టే పెట్టుబడులపై వచ్చే లాభాలపై పన్ను విధించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టిసిజి)ని పునరుద్ధరించారు. దీన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించగానే ఒక్కసారి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. లిస్టెడ్ కంపెనీల్లో వాటాల విక్రయానికి సంబంధించి లక్ష రూపాయల పైబడిన లాభాలపై క్యాపిటల్ గెయిన్స్ కింద 10 శాతం పన్ను విధించారు. కాగా 2018 జనవరి 31 వరకు వచ్చిన లాభాలపై పన్ను మినహాయింపునిచ్చారు. ఇది వరకు ప్రభుత్వం 2005లో లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్నును రద్దు చేసింది. తాజాగా మళ్లీ దీన్ని కొత్త రూపంలో తెచ్చారు. షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను రేటును యథాతథంగా 15 శాతంగా ఉంచింది.

ఎల్‌టిసిజిపై జైట్లీ ఉదాహరణతో సహా తెలిపారు. 2018 జనవరి 31కి అరు నెలల ముందు స్టాక్ మార్కెట్‌లో ఒక షేరును రూ.100కు కొనుగోలు చేసినట్లయితే, జనవరి 31 నాటికి ఆ షేర్ ధర రూ.120కి చేరిందనుకుందాం. దీంతో మదుపరికి రూ.20 లాభం వచ్చినట్లు. అయితే ఈ మొత్తంపై ఎటువంటి క్యాపిటల్ పన్ను లేదు. అదే షేర్ జనవరి 31 తర్వాత రూ.120 నుంచి రూ. 200 చేరిందనుకుందా. దీంతో మదుపరికి మొత్తంగా రూ.100 లాభం వస్తుంది. అయితే జనవరి 31 తరవాత వచ్చిన లాభం రూ.80 పైన మాత్రమే క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ వేస్తారు. అదీ కూడా షేరు కొన్న ఏడాది పూర్తయిన తర్వాత విక్రయిస్తేనే ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుందని జైట్లీ వివరణ ఇచ్చారు. డొల్ల కంపెనీల్లో, నకిలీ కంపెనీల్లో పెట్టుబడులను నిరోధించి పన్ను ఆదాయం పెంచేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీని ద్వారా తొలి సంవత్సరం రూ.20,000 కోట్లు, తర్వాత ఏడాది రూ.40,000 కోట్ల రెవెన్యూ సమకూరనుందని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాజా నిర్ణయంతో ఆదాయం మార్పిడికి సంబంధించి భారీ అక్రమాలు తగ్గుముఖం పడతాయని మార్కెట్ విశ్లేషకుడు సందీప్ సబర్వాల్ తెలిపారు.

సెన్సెక్స్ 463 పాయింట్ల పతనం

ముంబయి : కేంద్ర బడ్జెట్‌లో లాంగ్ టర్మ్ కాపిటల్ గెయిన్స్‌పై పన్ను విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్‌లు తీవ్ర ఒడిదుడులకు గురైయ్యాయి. ద్రవ్యలోటు అంచనాలు పెరగడంతో పాటు డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని తక్కువగా రూ.80వేలుగా నిర్దేశించుకోవడం మార్కెట్లలో ప్రతికూలతను నింపాయి. రూ.250 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన కంపెనీల కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించినప్పటికీ బడా కార్పొరేట్లు నిరాశకు గురైయ్యారు. ఈ పన్ను తగ్గింపుతో కీలక సూచీలైన నిఫ్టీ, సెన్సెక్స్‌ల్లోని ప్రధాన షేర్లకు కార్పొరేట్ పన్ను తగ్గే అవకాశం లేదు. ఫలితంగా సూచీలు నష్టాలబాట పట్టాయి. ఈ పరిణామాల మధ్య బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 58.36 పాయింట్లు లేదా 0.16 శాతం కోల్పోయి 35,906.66కు పడిపోయింది. ఎల్‌టిసిజి ప్రకటనతో ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 463 పాయింట్ల మేర పతనమైంది. మరో దశలో క్రమంగా పుంజుకుని 200 పాయింట్లు పెరిగినప్పటికీ తుదకు నష్టాలతోనే ముగిసింది. 36,048 వద్ద మొదలైన సూచీ కొద్ది సేపు లాభాల్లో కొనసాగినప్పటికీ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఏకంగా 35,501.74 కనిష్ట స్థాయిని తాకింది. మరో దశలో 36,256 పాయింట్ల గరిష్ట స్థాయి వద్ద నమోదైనప్పటికీ.. మళ్లీ నష్టాల వైపు సాగాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 10.80 పాయింట్లు తగ్గి 11,017 వద్ద ముగిసింది. బిఎస్ఇలో 1319 సూచీలు లాభాల్లో ముగియగా, 1453 స్టాక్స్ నష్టాల పాలయ్యాయి. మరో 230 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, లర్సన్ అండ్ టర్బో, ఐచర్ మోటార్స్ షేర్లు అధిక లాభాలు సాధించగా మరో వైపు సన్ ఫార్మా, ఒఎన్‌జిసి, డాక్టర్ రెడ్డీస్ షేర్లు అధిక నష్టాలు చవి చూశాయి.

పెట్టుబడుల ఉపసంహరణ మంత్రం

ప్రైవేటీకరణకు మార్గం

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వేగవంతం చేసింది. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నిన్న పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ, వ్యూహాత్మక వాటాల విక్రయం పేర్లతో ప్రైవేటీకరణను వేగవంతం చేసే ప్రణాళికను ప్రకటించారు. 2018-19 సంవత్సరానికి పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని 10 శాతం పెంచి, 80,000 కోట్ల రూపాయలు లక్ష్యంగా చెప్పారు. ఈ సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం 72,500 కోట్ల రూపాయలను అధిగమించామని, గత ఏడు సంవత్సరాలలో అక్ష్యాన్ని అధిగమించటం ఇదే ప్రథమమని, ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి లక్షకోట్ల రూపాయలకు చేరుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 46,500 కోట్ల రూపాయలు, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 15,000 కోట్ల రూపాయలు, బీమా కంపెనీలను లిస్టింగ్ చేయటం ద్వారా 11,000 కోట్ల రూపాయలను సాధించాలనేది ఈ సంవత్సరం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పాడు. లక్ష్యాన్ని సాధించటానికి ప్రభుత్వం అనేక మార్గాలను అనుసరించింది. ఒఎన్‌జిసికి హెచ్‌పిసిఎల్‌లో ఉన్న వాటాలను అమ్మటం ద్వారా 36,915 కోట్ల రూపాయలు సమీకరించటం లక్ష్యంగా పెట్టుకున్నారు. దానితో పాటు రెండు బీమా సంస్థలతో కలిపి పద్నాలుగు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను దేశీయ స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ చేయటం ద్వారా ఈ సంవత్సరం లక్ష్యాన్ని సాధించబూనుకున్నారు. కీలకమైన ఎయిర్ ఇండియా వ్యూహాత్మక విక్రయం కూడా దీనిలో ఉంది. రానున్న సంవత్సరానికి ప్రభుత్వరంగంలోని బీమాసంస్థలను విలీనం చేసి ఒకేసంస్థగా రూపొందించి, దానిని స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ చేయటం ద్వారా పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

పారిశ్రామిక వర్గాల అసంతృప్తి

ఆశించిన మేర రాయితీల్లేవ్

కేంద్ర బడ్జెట్‌పై సిఐఐ సభ్యుల విశ్లేషణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఆశించిన మేరకు పరిశ్రమలకు పన్ను రాయితీలు ప్రకటించలేదని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ (సిఐఐ) సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయవాడలోని ఓ ప్రయివేటు హోటల్‌లో గురువారం సిఐఐ, వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు కేంద్ర బడ్జెట్ విశ్లేషణకు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐఐ ఏపి చాప్టర్ చైర్మన్ జెఎస్ఆర్‌కె. ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదికి రూ 250 కోట్లు టర్నోవర్ ఉన్న కార్పొరేట్ కంపెనీలకు మాత్రమే 25 శాతం పన్ను తగ్గింపు ప్రకటనతో నిరాశ చెందామన్నారు. సిఐఐ ఏపి చాప్టర్ వైస్ చైర్మన్ ఆర్‌విఎస్. రాజు మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ఎమ్‌డి డి. రామకృష్ణ మాట్లాడుతూ ఐటి సెక్టార్‌ను విద్యారంగాన్ని ఎలా అనుసంధానం చేయడం, వాటికోసం బడ్జెట్ ఎలా కేటాయించారనే అంశాలపై స్పష్టత లేదన్నారు. లింగయ్య విద్యాసంస్థల ప్రతినిధి జి. రాజాలింగ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి విద్యకు పెద్దపీట వేసినా, విద్యార్థులకు ఉపాధి అవకాశాల పరంగా ఎలాంటి చేయూత అందిస్తామో ఈ బడ్జెట్‌లో లేదన్నారు. మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు (ఎమ్ఎస్ఎమ్ఇ) కి సంబంధించి సూర్య ఇంజనీరింగ్ వర్క్స్ సిఇఒ వైవి. కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో ఎమ్ఎస్ఎమ్ఇ పరిశ్రమలకు ప్రత్యేకంగా ఎలాంటి ప్రోత్సాహకాలు లేవన్నారు. విదేశీ, కార్పొరేట్ కంపెనీల కంటే మధ్య చిన్న తరహా పరిశ్రమలనే ఎక్కువగా ఆదుకోవాలన్నారు.

నిర్మాణ రంగానికి అన్యాయం : సిఐఐ రియల్ ఎస్టేట్ విభాగ ఏపి అధ్యక్షులు వి. సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ నిర్మాణ రంగాన్ని విస్మరించిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిర్మాణ రంగం కుదేలయి రియల్టర్లు నష్టాల్లో ఉన్నారని చెప్పారు. ఇదే పరిస్థితి మరో రెండేళ్లు కొనసాగితే ఈ రంగం మరింత దిగజారిపోతామన్నారు.

అమరావతికి..: వైఐ అమరావతి చాప్టర్ చైర్మన్ తరుణ్ కుమార్ మాట్లాడుతూ రాజధాని అమరావతి పర్యాటక అభివృద్ధిపై ప్రస్తావన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

వైద్యఆరోగ్య పథకాలు : సిఐఐ ఆరోగ్య రంగ విభాగ సిఎఫ్ఒ పి. రవికిరణ్ మాట్లాడుతూ అర్హులకు పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ పథకం ఎవరికి వర్తిస్తుందో వివరాలు తెలపలేదన్నారు.





సెన్సెక్స్ ⬇ 58
35,906



నిఫ్టీ ⬇ 11
11,016



రూపాయి ⬇ 42 పైII
అమెరికా డాలరుకు రూ.
64.01



కాగనున్న వంటనూనెలు

సెల్‌ఫోన్లు, టివిలు మరింత ప్రియం

2018-19 ఆర్థిక సంవత్సరానికి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నిన్న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులు వినియోగించే అనేక సరుకులపై దిగుమతి సుంకాలను భారీగా పెంచారు. సామాన్యులు ఎక్కువగా వినియోగించే వంటనూనెలపై 12.5 శాతంగా ఉన్న దిగుమతి సుంకాలను 30 శాతానికి, రెండున్నర రెట్లు పెంచారు. శుద్ధిచేసిన వంటనూనెలపై ఉన్న సుంకాన్ని 20 నుండి35 శాతానికి పెంచారు. మన ప్రజానీకానికి అవసరమైన వంటనూనెలలో ఎక్కువ భాగాన్ని విదేశాల నుండే దిగుమతి చేసుకుంటున్నాం. ప్రభుత్వం ఒక్కసారిగా భారాన్ని పెంచటంతో ప్రజలపై మోయలేని భారం పడుతుంది. సెల్‌ఫోన్ సామాన్యులకు కూడా తప్పనిసరి నిత్యావసరమైన సెల్‌ఫోన్‌లపై కూడా సుంకాలను పెంచారు. బొమ్మలపై కూడా దిగుమతి సుంకాన్ని పెంచటంతో బాలలకు ఆటలు కూడా ఖరీదైనవి మారతాయి. గిల్టునగలపై సుంకాలను పెంచటంతో సామాన్యులు వాటికి కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడుతుంది.ఎల్‌సిడి, ఎల్ఇడి, స్మార్ట్ వాచీలు తదితరాలపై సుంకాలు పెంచటంతో మధ్యతరగతి అదనపు భారాలను భరించాల్సి వస్తుంది. పెట్రోలు, డీజిల్‌లను జిఎస్‌టి పరిధిలోకి తీసుకువచ్చి, పెరిగిన ధరలనుండి ఉపశమనం కలిగిస్తారని భావించిన వారి ఆశలు వమ్మయినాయి. వాటిని ఆదాయ వనరులుగా చూస్తున్న ప్రభుత్వం పెట్టుబడిదారులపై విధిస్తున్న కార్పొరేట్ పన్నులో భారీగా రాయితీలిచ్చారు.

కస్టమ్స్ సుంకాలు పెరిగిన సరుకులు

- శుద్ధి చేయని వేరుశనగ, సన్‌ఫ్లవర్ నూనెలపై కస్టమ్స్ సుంకాన్ని 12.5 శాతం నుండి 30 శాతానికి పెంచారు. శుద్ధిచేసిన వంటనూనెలపె కస్టమ్స్ సుంకాన్ని 20 నుండి 35 శాతానికి పెంచారు.
- సన్‌గ్లాసెస్, సిగరెట్ లైటర్‌లు, బొమ్మలు, కొన్ని రకాలైన ఫర్నిచర్ దిగుమతులపై కస్టమ్స్ సుంకాలను పెంచారు.
- సెల్‌ఫోన్స్ లాంటి వాటిపై కస్టమ్స్ సుంకాలను పెంచారు. దిగుమతి చేసుకుంటున్న సరుకులపై 10 శాతం సామాజిక సంక్షేమ సర్‌ఛార్జీని విధించారు.
- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ పేరును సెంట్రల్ బోర్డ్ ఆఫ్ కస్టమ్స్‌గా మార్చారు.
- సోలార్ సెల్స్ ఉత్పత్తి చేయటం కోసం దిగుమతి చేసుకుంటున్న సోలార్ టెంపర్డ్ గ్లాస్‌కు కస్టమ్స్ డ్యూటి నుండి మినహాయింపు ఇచ్చారు.
- గిల్టునగలపై 15 నుండి 20 శాతానికి, అన్ని రకాలైన గడియారాలపై కస్టమ్స్ సుంకాన్ని రెట్టింపు చేస్తూ 20 శాతానికి పెంచారు.
- ఎల్‌సిడి, ఎల్ఇడి, ఒఎల్ఇడి పానెల్స్, టివిల విడిభాగాలపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచారు. స్మార్ట్ వాచీలు, సంబంధిత పరికరాలు, చెప్పులపై సుంకాన్ని రెట్టింపు చేస్తూ 20 శాతానికి పెంచారు.

తెలుగు రాష్ట్రాలను విస్మరించారు

బడ్జెట్‌పై ఎఫ్టాప్సీ విమర్శ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌పై స్థానిక పారిశ్రామిక వర్గాలు పెదవి విరిచాయి. తాము పెట్టుకున్న ఆశలు 2018-19 బడ్జెట్ నెరవేర్చలేని విధంగా ఉందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక, వాణిజ్య మండళల సమాఖ్య (ఎఫ్టాప్సీ) అధ్యక్షులు గౌరా శ్రీనివాస్ విమర్శించారు. తెలుగు రాష్ట్రాలను ఈ బడ్జెట్లో పూర్తిగా విస్మరించారని భావించక తప్పదనీ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎఫ్టాప్సీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ కొంతవరకు సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు మేలు కలిగించేది గా ఉందన్నారు. అయితే చాలా వరకు పారిశ్రామిక వర్గాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలను దష్టిలో ఉంచుకుని వ్యవసాయం, ఆహారోత్పత్తి సంస్థలు, ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివద్ధి రంగాలకు ప్రోత్సాహాన్ని అందించార న్నారు. రూ.250 కోట్ల లోపు టర్నోవర్ కంపెనీలకు కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతా నికి తగ్గించడంతో ఎస్ఎంఇలకు మద్దతునిచ్చినట్లయ్యిందన్నారు.

బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ : సిఐఐ

బడ్జెట్ సమతూకంగా ఉందని సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అన్నారు. పెట్టుబడి దారుల్లో విశ్వాసం నింపేలా భవిష్యత్తు సంవత్స రాల్లో సూక్ష్మ స్థిరత్వాన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు.

వృద్ధికి దోహదం : ఫిక్కీ

ప్రస్తుత బడ్జెట్ గ్రామీణ ప్రాంతం, వ్యవసాయ రంగానికి మద్దతునిచ్చేలా ఉందని ఫిక్కీ ప్రెసిడెంట్ రాషెష్ షా పేర్కొన్నారు. దీంతో భవిష్యత్తులో వృద్ధి మరిన్ని రెట్లు పెరగనుందని అభిప్రాయపడ్డారు.

గ్రామీణ ఆదాయానికి దన్ను : చందా కొచ్చర్

కేంద్ర బడ్జెట్ గ్రామీణ ప్రాంత ఆదాయ పెరుగుదలకు దోహదం చేయనుందని ఐసిఐసిఐ బ్యాంకు సిఇఒ చందా కొచ్చర్ అభిప్రాయపడ్డారు. ఇందులో సామాజిక రంగాలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు.

పేదల ఆరోగ్యంపై దృష్టి : కిరణ్ మజూందర్

కేంద్ర బడ్జెట్ ఈ దఫా పేదల ఆరోగ్యంపై దృష్టి పెట్టిందని బయోకాన్ సిఎండి కిరణ్ మజూందర్ పేర్కొన్నారు. వైద్య రక్షణ లేకపోతే పేదలు మరింత పేదలుగా మారే ప్రమాదం ఉందన్నారు.

గ్రామీణ మార్కెట్ వృద్ధి : ఆనంద్ మహీంద్రా

గ్రామీణ ప్రాంత మార్కెట్ అభివృద్ధికి దోహదం చేసేలా బడ్జెట్ ఉందని మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. ఒక విధంగా ఇది ముందస్తు ఎన్నికల బడ్జెట్ అదే విధంగా వృద్ధికి దోహదం చేసేలా ఉందన్నారు.

రాష్ట్రపతి, గవర్నర్‌కు వేతనాల పెంపు

5 ఏండ్లకోసారి ఎంపీ వేతనాల్లో మార్పు

న్యూఢిల్లీ : ఎంతో కొంత పన్ను మినహాయింపు దక్కుతుందనుకున్న వేతన జీవికి నిరాశే ఎదురైంది. పోనీ వేతన పెంపునకు సంబంధించి ఊరట కలిగించే వార్త వినిపిస్తుందనుకుంటే, అదీ లేదు. మరోవైపు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ...రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లకు, పార్లమెంట్ సభ్యులకు తీపి కబురు చెప్పారు.

రాష్ట్రపతి వేతనాన్ని రూ.5 లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనాన్ని రూ.4లక్షలకు, గవర్నర్ల వేతనాలను రూ.3.5 లక్షలకు పెంచుతున్నట్టు జైట్లీ ప్రకటించారు. అలాగే పార్లమెంట్ సభ్యుల జీతభత్యాలపైన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి ప్రతి ఐదేండ్లకోమారు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఎంపీల వేతనాలు పెరుగుతాయని చెప్పారు. జైట్లీ ఈ మాట చెప్పినప్పుడు లోక్‌సభ చప్పట్లతో మారుమోగింది.

"రాష్ట్రపతి వేతనాన్ని రూ.1.50 లక్షల నుంచి రూ.5లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనాన్ని రూ.1.30 లక్షల నుంచి రూ.4 లక్షలకు, గవర్నర్ల వేతనాన్ని రూ.1.10లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచుతున్నాం. ఈ పెంపు 2018 జనవరి నుంచే వర్తిస్తుంది. ఇక ఎంపీల జీతభత్యాల పెంపునకు విధానాన్ని రూపొందించాం. ద్రవ్యోల్బణాన్ని అనుసరించి ప్రతి 5 ఏండ్లకు ఒకసారి ఎంపీల జీతాలు ఆటోమెటిక్‌గా పెరుగుతాయి" అని జైట్లీ చెప్పారు.

- **కనీస వేతన సవరణను, ఫిట్‌మెంట్ ఫార్ములాలో మార్పు, ఉద్యోగస్తులకు కొత్త పెన్షన్ పథకం...వంటివి కేంద్రం ప్రకటిస్తుందని ఎన్నో ఆశలతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులంతా ఎదురుచూశారు.**
- **గత 60 ఏండ్లలో ఉద్యోగస్తుల్ని తీవ్రంగా నిరాశపర్చిన బడ్జెట్ ఇదే. అలాగే దేశంలోని కార్మిక శక్తికి కూడా ఈ బడ్జెట్ ఎలాంటి ప్రయోజనాల్నీ, సంక్షేమ పథకాల్నీ ప్రకటించలేదు.**
- **జైట్లీ ప్రసంగాన్ని బట్టి ఇక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇక '7వ సెంట్రల్ పే కమిషన్ (సీపీపీ)' గురించి మరిచిపోవాల్సిందే.**

600 బస్తాల ధాన్యం భస్మం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

శ్రీకాకుళం మండలం లింగావలసలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో 600 బస్తాల ధాన్యం, ఐదెకరాలకు చెందిన వరి గడ్డి అగ్నికి ఆహుతయ్యాయి. 13 ఇళ్లు, మూడు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... రుప్ప గన్నప్పుడు కళ్లంలో ట్రాక్టర్‌తో ధాన్యాన్ని నూరుస్తున్న సమయంలో బ్యాటరీ మెల్ట్ అయ్యి నిప్పులు చెలరేగి గడ్డిపై పడ్డాయి. ట్రాక్టర్ దగ్ధం కావడంతో పాటు పక్కనే ఉన్న గడ్డి కుప్పలు, ధాన్యం బస్తాలు, పశువుల శాలలు, పూరిళ్లకు మంటలు అంటుకున్నాయి. 600 బస్తాల ధాన్యంతో పాటు ఎనిమిది ఇళ్లు పూర్తిగా, ఐదు ఇళ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.



సదస్సు 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియో వాసుక్యులర్, థోరాసిక్ సర్జన్స్' 64వ వార్షికోత్సవ జాతీయస్థాయి వైద్య సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి కామినేని

వైద్య సేవలకు గమ్యస్థానం ఏపి

'ఐఎసిటి స్కాన్-2019' 64వ వార్షికోత్సవ సదస్సులో మంత్రి కామినేని

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

వైద్యసేవలకు గమ్యస్థానంగా ఎపి అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం విశాఖ నగరంలోని నోవాటల్ హోటల్‌లో 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కార్డియో వాసుక్యులర్, థోరాసిక్ సర్జన్స్' 64వ వార్షికోత్సవ జాతీయస్థాయి వైద్య సదస్సుకు మంత్రి డాక్టర్ కామినేని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎపిని జాతీయ స్థాయి వైద్య సేవలకు గమ్యస్థానంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవల కింద ఏటా రూ.1400 కోట్లు ఖర్చుచేస్తున్నామన్నారు. ఎపిలో 600 ఆసుపత్రులు ఈ సేవలను అందిస్తున్నాయన్నారు. డయాలసిస్ రోగులకు ప్రతిరోజూ రూ.2500 కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో తీసుకొచ్చిన పారిశుధ్య పాలసీ బాగుందన్నారు. త్వరలో టెలీరేడియోలజీ, ఆప్తమాలజీల వైద్యాన్ని అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. సదస్సుకు ఐఎసిటిస్కాన్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు డాక్టర్ రాజన్ సంతోషం అధ్యక్షత వహించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజన్ సేతురత్నం తొలిరోజు సదస్సుకు వందన సమర్పణ చేశారు.

మొండిచెయ్యిపై ఆగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
విజయవాడలో సిపిఎం నేతల అరెస్ట్
విశాఖ రైల్వే జోన్ ప్రకటించకపోవడంపై నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ యంత్రాంగం

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపడంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు పెల్లుబిక్కాయి. విజయవాడలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో విభజన హామీలు, రైల్వే జోన్, కడప ఉక్కు, వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజ్ గురించి ప్రస్తావనే లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు విమర్శించారు. ముందుగా పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి విజయవాడలోని బీసెంట్ రోడ్డుకు ప్రదర్శనగా చేరుకున్నారు. రాస్తారోకో నిర్వహిస్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. సిపిఎం నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టులు చేసి వ్యాన్‌లో పడేశారు. ముందుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, పశ్చిమ కృష్ణా జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి కాశీనాథ్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ రాష్ట్రప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. రైతుల రుణ ఉపశమనం ఊసే లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని కోరారు. విభజన చట్టంలో హామీల అమలు కోసం అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకొని రాష్ట్ర బంద్ నిర్వహిస్తామని వెల్లడించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాజధానికి కేంద్రం మొండిచెయ్యి చూపిందని విమర్శించారు. రాజధానికి నిధులు ప్రకటించకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. అమరావతి రైల్, విజయవాడ మెట్రోరైల్ తదితర విషయాల్లోనూ బడ్జెట్‌లో స్థానం దక్కలేదని తెలిపారు.



చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కేంద్ర రైల్వే బడ్జెట్‌లో విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించకపోవడంపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యాన కార్యకర్తలు గురువారం రైల్వేస్టేషన్ వద్ద చెవులో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శివర్గసభ్యులు పద్మనాభరాజు మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో విభజన హామీలు అమలు చేస్తామని, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇస్తామని ఉత్తరాంధ్ర ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు దండుకొని అధికారం చేపట్టిన తరువాత వాటి ఊసెత్తకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. చివరి బడ్జెట్‌లోనైనా కేంద్ర ప్రభుత్వం రైల్వేజోన్ ప్రకటిస్తాదని ఆశగా ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో విశాఖకు రైల్వే జోన్ ఇస్తామని గెలిచిన స్థానిక బిజెపి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రైల్వే జోన్ ప్రకటించకపోవడంపై సిపిఐ ఆధ్వర్యాన కూడా ర్యాలీ నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యాన విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం విశాఖ రైల్వే సాధన దీక్ష చేపట్టారు. బడ్జెట్ ను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు జాతీయ నాయకులు ఎన్.రామారావు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు రైల్వే జోన్‌ను ప్రకటించకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద ధర్నా జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడారు. కడపలో జరిగిన కార్యక్రమంలో.. బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ హామీని గాలికి వదిలేసిందని, జిల్లా అభివృద్ధికి మొండిచేయి చూపించిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి. నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు విమర్శించారు. విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద సిపిఐ ధర్నా చేపట్టింది.

వేతన బకాయిలను చెల్లించాలని కార్మికుల ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం (తూర్పుగోదావరి)

ఏళ్లతరబడి పేరుకుపోయిన వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలోని కిర్లంపూడి సుగర్ మిల్లు లిమిటెడ్ కార్మికులు గురువారం ప్రదర్శన, ధర్నా చేశారు. స్థానిక ఉప్పాడ బస్టాండ్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా కిర్లంపూడి సుగర్ మిల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ఎస్ఎన్ మూర్తి, కృపానందం మాట్లాడారు. కిర్లంపూడి సుగర్ మిల్లు 17 ఏళ్ల క్రితం మూతపడిందన్నారు. యాజమాన్యం ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని కార్మికులకు ఒప్పందం రాసి ఇచ్చి, అమలు చేయకుండా మూత పెట్టడంతో 421 మంది ఉపాధిని కోల్పోయారన్నారు. ప్రభుత్వం లేబర్ కోర్టులో సకాలంలో జడ్జిలను నియమించకపోవడంతో ఈ కేసు తీర్పు రావడానికి 11 ఏళ్లు పట్టిందన్నారు. 2017 సెప్టెంబర్ 13న విశాఖపట్టణం లేబర్ కోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పునివ్వడంతోపాటు అవార్డు ప్రకటించిందన్నారు. ఐదేళ్ల సర్వీసున్న కార్మికులకు రూ.50 వేలు, 10 ఏళ్ల కాలానికి రూ.లక్ష, 15 ఏళ్ల సర్వీసుకు రూ.1.50 లక్షలు, 20 ఏళ్ల సర్వీసుకు రూ.2 లక్షలు, 25 ఏళ్ల సర్వీసుకు రూ.2.50 లక్షల నష్టపరిహారం, తొమ్మిది శాతం వడ్డీ చెల్లించాలని లేబర్ కోర్టు ఆదేశించిందన్నారు. కోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పిఆర్‌సి, డిఎ, సిపిఎస్‌పై ఆందోళనకు సిద్ధం

ఎపి ఎన్‌జిఓ సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు

ప్రజాశక్తి-అమలాపురం (తూర్పుగోదావరి)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిఆర్‌సి, డిఎ, సిపిఎస్ తదితర అంశాలపై ఆందోళనకు సిద్ధం కావాలని ఎపి ఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌బాబు పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దుకు అవసరమైతే మార్చిలో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని అంబేద్కర్ భవనంలో డివిజన్ అధ్యక్షుడు కేశవదాసు అధ్యక్షతన గురువారం డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఈనెల 10న కాకినాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగులను కోరారు. 10వ పిఆర్‌సి 10 నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానం రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లోని రెండోవిడత డిఎను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్‌ను రద్దు చేస్తూ, శాశ్వత ప్రాతిపదికన ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పూర్తిస్థాయిలో అమలుచేయాలన్నారు. ఏడో పిఆర్‌సిపై స్కేల్ కమిషన్ వేయాలన్నారు. ఇప్పటివరకూ రూ.4,300 కోట్లు పిఆర్‌సి ఇవ్వాలన్నారు. జీతాలు పెంచడానికి సంవత్సరం నుంచి కాలయాపన చేస్తున్నారని అన్నారు. హెల్త్‌కార్డులకు మాస్టర్ హెల్త్ చెకప్ చేసుకోవడానికి ఆమోదం లభించిందన్నారు. మార్చిలో చలో అసెంబ్లీ పేరుతో అసెంబ్లీని ముట్టడించి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని, శాసనసభలో సిపిఎస్ రద్దు చేస్తూ తీర్మానం చేయించుకోవడానికి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

గిరిజన సంపదను దోచుకుంటే సహించం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

గిరిజనుల సంపదను గిరిజనేతరులకు దోచిపెట్టే ప్రభుత్వ చర్యలను సహించబోమని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు అన్నారు. విజయనగరం జిల్లా సాలూరు మండలం శిఖపరువు గ్రామంలో మైనింగ్ ప్రాంత బాధితులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. గిరిజనుల రక్షణకు ప్రభుత్వాలు రూపొందించిన పీసా, 1/70 చట్టాలను తుంగలో తొక్కడం దారుణమని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు మాట్లాడారు.

ఓడలరేవు గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం (తూర్పుగోదావరి)

గ్రామాభివృద్ధి విషయమై ఓఎన్‌జిసి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యవైఖరి అనుసరించడాన్ని నిరసిస్తూ అల్లవరం మండలం ఓడలరేవు గ్రామస్తులు అమలాపురం ఆర్‌డిఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఓడలరేవు గ్రామస్తులు 43 రోజులుగా గ్రామంలో నిరాహార దీక్షలు చేస్తున్నా, ఓఎన్‌జిసి అధికారులు స్పందించడంలేదు. అఖిలపక్ష నాయకులతో గురువారం సమావేశం ఉంటుందని ఆర్‌డిఓ బి.వెంకటరమణ బుధవారం ప్రకటించారు. దీంతో అఖిలపక్ష నాయకులు, బాధితులు అక్కడికి చేరుకున్నారు. ఆర్‌డిఓ లేకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి ఓఎన్‌జిసి ఇచ్చిన 18 హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

రామాయపట్నం పోర్టు సాధన కోసం ఈనెల 3న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా అభివృద్ధి వేదిక యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కె జాన్‌బెన్ని పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన విభాగాల నాయకులతో గురువారం కళ్యాణి కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశం జరిగింది. సమావేశంలో జాన్‌బెన్ని మాట్లాడారు.3న జరిగే ధర్నాలో అన్ని సంఘాలు భాగస్వాములు కావాలని కోరారు.

- ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలకు

రెండో విడత ప్రచార భేరీ

సిపిఎం యాత్రలకు ఎదురేగి స్వాగతం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేకూర్చాలని, ఈ నెల 10న జరిగే భీమవరంలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని కోరుతూ ఇప్పటికే ఒక విడత ప్రచారం నిర్వహించిన సిపిఎం.. రెండో విడత ప్రచార భేరీలను ప్రారంభించింది. మూడు ప్రచార భేరీలు మొదలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణ శివార్లలోని లంకపేటలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, నరసాపురంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్), తాడేపల్లిగూడెం కెఎన్ రోడ్డులో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం ప్రచార భేరి యాత్రలను జెండా ఊపి ప్రారంభించారు. భీమవరం లంకపేటలో ప్రచార భేరి యాత్రలో ఇంటికొక మనిషి.. ఊరుకొక బండి చొప్పున పదో తేదీన ప్రజాప్రదర్శనకు తరలిరావాలని వి.ఉమామహేశ్వరరావు ఇచ్చిన పిలుపునకు అక్కడ మహిళల నుంచి మంచి స్పందన లభించింది. ఈ యాత్ర ఫుడ్‌పార్కు బాధిత గ్రామాలైన తుందుర్రు, జొన్నలగర్వు, బేతపూడి మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు యాత్రకు ఎదురెళ్లి అపూర్వ స్వాగతం పలికారు. సిపిఎం సభలను జయప్రదం చేస్తాం.. తుందుర్రు ఫుడ్‌పార్కును తరలించే వరకూ పోరాడుతాం అంటూ ఆయా గ్రామాల ప్రజలు నినదించారు. అనంతరం ఈ యాత్ర భీమవరం రూరల్, కాళ్ల మండలాల మీదుగా సాగింది. నరసాపురంలో మొదలైన యాత్ర పట్టణంతోపాటు నరసాపురం రూరల్ మండలంలో సాగింది. తాడేపల్లి గూడెంలో సందర్భంగా జరిగిన సభకు పెద్దసంఖ్యలో కార్మికులు హాజరై ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి అంటూ నినదించారు. యాత్ర ప్రారంభం అనంతరం పట్టణంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి యాత్రకు వీడ్కోలు పలికారు. ఈ యాత్ర ఉంగుటూరు, నల్లజర్ల మండలాల మీదుగా సాగింది.





జెండా ఊపి ప్రచారభేరి యాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

యాత్ర సందర్భంగా భీమవరంలో ఎం.వైకుంఠరావు అధ్యక్షతన జరిగిన సభలో వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో ఆదర్శంగా పరిపాలన సాగించడం కమ్యూనిస్టులకే సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్పొరేట్ అభివృద్ధే తప్ప సామాన్యుడి కష్టాలు కళ్లకు కన్పించని, చెవులకు విన్పించని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కేరళ, త్రిపురలో వామపక్ష ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుందని, అక్షరాస్యతలో దేశంలోనే మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయని గుర్తుచేశారు. నాలుగేళ్లుగా రాష్ట్ర రాజధాని నిర్మాణం అంటూ గ్రాఫిక్స్ ఫొటోలు చూసుకుని మురిసిపోతున్న చంద్రబాబును రాజధాని ప్రాంత భూముల్లో పెరిగిన నాలుగు అడుగుల గడ్డి వెక్కిరిస్తూనే ఉందన్నారు. నరసాపురంలో రుద్రరాజు సత్యనారాయణరాజు మాట్లాడారు. 1964లో పార్టీ ఏర్పడిన అనంతరం మొట్టమొదటిసారి జిల్లాలోని భీమవరంలో నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం ఎన్‌కె.గ్రౌండ్ వద్ద సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో మంతెన సీతారాం మాట్లాడుతూ వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమీకరణకు మహాసభల్లో పిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా (అప్‌ల్యాండ్) కమిటీ కార్యదర్శి చింతకాయల బాబూరావు మాట్లాడారు. ఈ నెల 10న భీమవరంలో నిర్వహించే ప్రజాప్రదర్శన, బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు.

రూ.3 కోట్ల ఎర్రచందనం దుంగలు పట్టివేత

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

రూ.3 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని క్రైం ఓఎస్‌డి విఠలేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్‌పి రామకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆధ్వర్యంలో అనంతసాగరం మండలంలోని బెల్లంకొండ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించామన్నారు. దాడిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆరుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 138 ఎర్ర చందనం దుంగలు, స్కార్పియో, ఇన్నోవా కార్లు, బైకు, 20 సెల్‌ఫోన్లు, రూ.5600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగల బరువు 3012 కిలోలు ఉంటుందని, వీటి విలువ రూ.3కోట్లు ఉంటుందన్నారు. స్మగ్లర్లు వెలిగొండ పరిధిలోని అటవీప్రాంతంలో ఎర్రచందనం దుంగలను చెన్నయ్‌కు తరలిస్తున్నారని తెలిపారు.రెడ్‌హిల్స్ చుట్టుపక్కల ఉండే మాధవరం, పూనమలై, కొసాపూర్, తిరుచ్చి ప్రాంతాల్లో గౌడౌన్‌లు ఏర్పాటు చేసి ఎర్రచందనం దుంగలను కంటైనర్ల ద్వారా షిప్‌లు, కార్గోల ద్వారా మలేషియా, దుబాయ్, హంకాంగ్ దేశాలకు తరలించేవాడన్నారు. ఇతనిపై చెన్నయ్ పోలీసుస్టేషన్లలో కేసులు ఉన్నాయి.

జెఎన్‌టియుకె ప్రొఫెసర్ బాబులు అరెస్ట్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్ (తూర్పుగోదావరి)

కాకినాడ జెఎన్‌టియులో విద్యార్థినులను లైంగికంగా వేధించిన కేసులో ప్రొఫెసర్ కె.బాబులును అరెస్టు చేసినట్లు కాకినాడ డిఎస్‌పి రవివర్మ తెలిపారు. కాకినాడ సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 24, 25 తేదీల్లో జెఎన్‌టియుకెలో ఎంటెక్ మొదటి సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయని తెలిపారు. వైవా సమయంలో ప్రొఫెసర్ కె.బాబులు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధింపులకు గురి చేశారని విద్యార్థినులు ఫిర్యాదు చేశారని చెప్పారు. కేసు నమోదు చేసి, 21 మంది విద్యార్థినులను విచారించామని తెలిపారు. ప్రొఫెసర్‌పై 54/2018, యు/5 354, 335/509, నిర్భయ కేసులు నమోదు చేశామని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు తరలించనున్నట్టు తెలిపారు.

మద్యం మత్తులో లారీడ్రైవర్ బీభత్సం

ప్రజాశక్తి - నిడదవోలు

పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు రైల్వేగేటు వద్ద మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ బుధవారం అర్ధరాత్రి సమయంలో బీభత్సం సృష్టించాడు. రైల్వేగేటు వద్ద ఆగి ఉన్న రెండు కార్లను, ఓ టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఓ మహిళ గాయాల పాలైంది. పోలీసుల కథనం ప్రకారం విశాఖ పట్నానికి చెందిన నల్లపురాజు సత్యనారాయణరాజు పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం నుంచి ఆయిల్ లోడుతో బుధవారం తాడేపల్లి గూడేనికి వచ్చాడు. అక్కడ అన్‌లోడు చేసి విశాఖకు బయలుదేరాడు. మార్గ మధ్యంలో మద్యం సేవించాడు. నిడదవోలు రైల్వేగేటు వద్దకు వచ్చేసరికి లారీ అదుపుతప్పింది.

గిరిజనులను మోసగిస్తున్న ప్రభుత్వం

బోయ, వాల్మీకులకు ఎస్‌టి రిజర్వేషన్లపై డాక్టర్ బాబూరావు విమర్శ

ప్రజాశక్తి- సీతంపేట (శ్రీకాకుళం జిల్లా)

రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చేందుకు ప్రయత్నిస్తోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (గిరిజన సంఘం) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు విమర్శించారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని ఉపసంహరించుకునేంత వరకూ గిరిజనులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దంటూ శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలం దోనుబాయి కూడలిలో గిరిజన సంఘం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన గిరిజన గర్జన సభలో ఆయన మాట్లాడారు. గిరిజనుల రిజర్వేషన్లు రాజకీయ రిజర్వేషన్లు కావని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. రాష్ట్రంలో గిరిజనుల్లో 34 తెగలున్నాయని, బోయలను ఎస్‌టిల్లో చేరిస్తే ఆ తెగలకు చెందిన సుమారు 27 లక్షల మంది నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సభలో పాల్గొని మద్దతు తెలిపిన పాలకొండ వైసిపి ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజలను మోసం చేస్తోందని, గిరిజనుల రిజర్వేషన్లను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని విమర్శించారు. దీనికి ముందు గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు.

'బ్రహ్మకుమారీస్'తో విశ్వశాంతి

- పీస్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

మనిషి జీవన ప్రమాణాలు పెంపొందాలంటే మానసిక ప్రశాంతత, ఆనందం అవసరమని, అటువంటి వాటిని కల్పించే బ్రహ్మకుమారీస్ సంస్థ అమరావతి రాజధానిలో తన శాఖను ఏర్పాటు చేయటం ఎంతో సంతోషదాయకమని సిఎం నారా చంద్రబాబు తెలిపారు. గురువారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లులో పదెకరాలలో విశ్వ విఖ్యాతగా నిర్మించబోయే బ్రహ్మకుమారీస్ యూనివర్సల్ పీస్ రిట్రీట్ సెంటరుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం పవిత్రమైన సందేశాన్నిస్తూ 140 దేశాల్లో తమ సేవలను అందిస్తున్న బ్రహ్మకుమారీస్ పీస్ రిట్రీట్ సెంటర్‌ను అమరావతి ప్రాంతంలో నిర్మిస్తుండడంతో రాబోయే కాలంలో ఈ ప్రాంతం ప్రపంచ స్థాయి మానసిక వికాస సెంటర్‌కు కేంద్ర స్థానంగా మారబోతుందని సిఎం ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సంస్థ ఎక్కడ ఉంటే ఆ ప్రాంతం ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఉమ్మడి ఏపీలో ఈ సంస్థకు హైదరాబాద్‌లో 34 ఎకరాలను కేటాయించామని, ఆ ప్రాంతంలో శాంతిసరోవరం పేరుతో ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దామన్నారు. నవ్యాంధ్ర రాజధాని పరిధిలో నిర్మిస్తున్న ఈ సంస్థకు పదెకరాలను మంజూరు చేస్తూ అన్ని బ్రహ్మకుమారీస్ సంస్థలకంటే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సంస్థ నిర్వాహకులను కోరారు.

బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయాల చీఫ్ రాజయోగిని డాక్టరు జానకి దాదీజీ మాట్లాడుతూ తమ సంస్థను నవ్యాంధ్ర రాజధాని పరిధిలో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మనసావాచా కర్మణా చేసే పనులకు తప్పకుండా మంచి ఫలితం ఉంటుందన్నారు. సమావేశంలో పలు మంత్రులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రెగ్యులరైజ్ చేయలేదు.. జీతాలూ పెంచలేదు

సెకండ్ ఎఎన్‌ఎంల జగన్‌కు వినతి

ప్రజాశక్తి-పొదలకూరు

ప్రతిపక్ష నాయకుడు, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి పాదయాత్ర గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించి కొద్దిసేపటికే ముగించారు. ఈ సందర్భంగా జగన్‌కు అడుగడుగునా మహిళలు పెద్దసంఖ్యలో నీరాజనాలు పలికారు. తక్కువ జీతంతో పదేళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో వెట్టిచాకిరి చేస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. పది సంవత్సరాల నుంచి వైద్య ఆరోగ్య శాఖలో సెకండ్ ఎఎన్‌ఎంలుగా పనిచేస్తున్నామని అయినా ఇంతవరకు తమను రెగ్యులర్ చేయలేదని, జీతాలు పెంచలేదని ఆవేదన చెందారు. రెగ్యులర్ ఎఎన్‌ఎంలకు రూ.35 నుంచి రూ.45 వేల జీతం ఉంటే తమకు మాత్రం రూ. 11,500 మాత్రమే ప్రభుత్వం ఇస్తోందని దీంతో జీవనం కష్టంగా సాగుతుందని తెలిపారు. ఒకే పనికి ఒకే వేతనం కోర్టు తీర్పు ఇచ్చి ఉందన్నారు. దాన్ని ప్రభుత్వం అమలు చేయలేదని వివరించారు. అనంతరం సర్వేపల్లి ఎంఎల్‌ఎ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి కాకాణి రమణారెడ్డి జగన్‌ను కలసి కొంతసేపు ముచ్చటించారు. చాటగొట్ల గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. తోడేరు క్రాస్ రోడ్డు నుంచి మరుపూరు వరకు ఏడు కిలోమీటర్ల పాదయాత్ర జరిగింది. పాదయాత్ర 77 రోజులు పూర్తి చేసుకుంది. జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సిబిఐ కోర్టుకు హాజరుకావాల్సి ఉన్న నేపథ్యంలో అత్యవసరంగా ఆయన హైదరాబాదుకు వెళ్లారు. తిరిగి మళ్లీ శనివారం ఉదయం మరుపూరు వద్ద పాదయాత్ర కొనసాగిస్తారు. ఆయన వెంట నెల్లూరు, తిరుపతి ఎంపిలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎంఎల్‌ఎ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు ఉన్నారు.

ప్రశాంతంగా త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికలు

ప్రజాశక్తి-గాజువాక, విశాఖ

భెల్ (హెచ్‌పివిపి) త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. 669 ఓట్లకు గానూ 633 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలను నిర్వహించారు. అనంతరం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. రాత్రి 10 గంటలైనా ఫలితం తేలలేదు. 8 మంది డైరెక్టర్లకు నిర్వహించిన ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ నాలుగు, బిహెచ్‌పివి ప్రొగ్రెసివ్ ఫ్రంట్ మూడు డైరెక్టర్లను గెలుచుకున్నాయి. మరో డైరెక్టర్‌కు సంబంధించి రెండు యూనియన్లకు సమాన ఓట్లు రావడంతో మరలా ఓట్ల లెక్కింపు చేపట్టారు.

గతం కంటే సిఐటియుకు ఓట్ల శాతం పెరిగిందని భెల్ సిఐటియు ప్రచార కార్యదర్శి ఎస్.జగన్నాధరావు తెలిపారు. సిఐటియు ఎల్లప్పుడూ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. కార్మికుల సమస్యలపై భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు.

యువ రైతు దారుణ హత్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

గుంటూరు జిల్లా సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం పొలాల్లో యువరైతును గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ సంఘటన గురువారం వెలుగు చూసింది. బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పగడాల బుజ్జిబాబు(40) అనుమానస్పద స్థితిలో హత్యకు గురయ్యాడు. సత్తెనపల్లి మండలం ఫణిదం, భట్లూరు గ్రామాల మధ్య కన్నెగండ్ల డొంకలో బుజ్జిబాబును గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో మోది హత్య చేశారు. రైతుల ఫిర్యాదుతో సత్తెనపల్లి డిఎస్పీ కాలేషావలి, సిఐ వీరయ్యచౌదరి, ఎస్ఐ నజీర్‌బేగ్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.





ప్రగతిశీల బడ్జెట్‌తో 'నవభారతం' కల సాకారం

ప్రధాని నరేంద్రమోడీ

న్యూఢిల్లీ: 2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సమర్పించిన బడ్జెట్ ప్రగతిశీలమైనదని, 'నవభారత' స్వప్నాన్ని సాకారం చేసేందుకు దోహదపడుతుందని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్ రైతులకు, సామాన్యులకు, వ్యాపారులకు మాత్రమే కాక అభివృద్ధికి సైతం అనుకూలంగా వుందని ఆయన జైట్లీ బడ్జెట్ ప్రసంగం ముగిసిన తరువాత తనను కలిసిన మీడియా ప్రతినిధులతో చెప్పారు. ఈ బడ్జెట్ జీవన శైలిని సులభతరం చేయటంతో పాటు వ్యాపారావకాశాలను కూడా సులభతరం చేస్తుందన్నారు. గత ఏడాది ప్రపంచ బ్యాంకు 'సులభతరమైన వ్యాపారావకాశాల' అధ్యయనంలో భారత్ 100 వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రంగాల ప్రగతికి ప్రకటించిన చర్యలతో పాటు పేదల కోసం ప్రకటించిన కొత్త ఆరోగ్యబీమా పథకం, ఆదాయపు పన్నులో వేతనజీవులకు, సీనియర్ సిటిజెన్లకు కొంతమేర ఊరట కల్పించటం వంటి చర్యలకు ప్రజల జీవనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఉద్దేశించినవేనని మోడీ అభిప్రాయపడ్డారు. ఈ బడ్జెట్ అంచనాలతో దేశ ఆర్థికాభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందన్నారు. తమ ప్రభుత్వం ఆవిష్కరించిన 'నవభారత' స్వప్నాన్ని ఈ బడ్జెట్ సాకారం చేస్తుందని భావిస్తున్నట్లు ప్రధాని చెప్పారు. అన్ని రంగాలపై దృష్టి సారించిన ఈ బడ్జెట్‌తో దేశ ఆర్థిక ప్రగతి మరింత వేగం పుంజుకుంటుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతుధరను రెట్టింపు చేయటాన్ని మోడీ ప్రత్యేకంగా ప్రశంసించారు. రైతులకు కనీస మద్దతుధరకు సంబంధించి జైట్లీ తీసుకున్న నిర్ణయాన్ని తాను స్వాగతిస్తు న్నా నన్నారు. ఇది రైతులకు మరింత చేయూతనిస్తుందని భావిస్తున్నానన్నారు.

కార్పొరేట్లపై వరాల జల్లు.. ప్రజల పై అదనపు భారాలు....

కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం పొలిట్‌బ్యూరో

(ఇండియాన్ న్యూస్ నెట్‌వర్క్)

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్ మరలా విదేశీ, స్వదేశీ బడా కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చే విధంగా ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ బడ్జెట్ దేశప్రజలపై అదనపు భారం మోపేవిధంగా ఉందని తెలిపింది. అయితే ఈ భారాన్ని మసిపూసి మారేడు కాయ చేసినట్లుగా ప్రజలకేదో మంచి జరుగుతుందన్నట్లు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది.

2017లో సృష్టించబడ్డ అదనపు సంపదలో 73 శాతం దేశంలోని ఒక్క శాతం ధనవంతుల దగ్గరే పోగుపడ్డదన్న వాస్తవం ఉన్నప్పటికీ బడ్జెట్‌లో ఈ ధనవంతులపై ప్రత్యక్ష పన్నులు వేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావించటం లేదని, అందుకు విరుద్ధంగా సామాన్య ప్రజలకు భారంగా పరిణమించే పరోక్ష పన్నులపై ప్రభుత్వం మరింత ఆధారపడిందని పేర్కొంది. వాస్తవానికి కేంద్ర పన్నులలో ప్రత్యక్ష పన్నుల వాటా 51.6 శాతం నుంచి 50.6 శాతానికి తగ్గిపోయిందని తెలిపింది.

ఈ బడ్జెట్ పేదలకు అనుకూలమని, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు కేటాయించిందని, జాతీయ ఆరోగ్య పథకం కింద ఏడాదికి ఐదు లక్షల చొప్పున పది కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పిస్తున్నదంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే ఆరోగ్య పథకం కొత్తదేమీ కాదని, అదనంగా ఒక్కపైసా కూడా దీనికి కేటాయింపులు చేయలేదని సిపిఎం తెలిపింది. ఈ పథకం కూడా బీమా కంపెనీలకు ఆర్థిక లాభాన్ని చేకూర్చేదేనని చెప్పింది. అనుభవాలను పరిశీలిస్తే ఆరోగ్య బీమా కానీ, పంటల బీమా కానీ కార్పొరేట్లకే లాభాలను పంచాయి తప్ప సామాన్యులకు కాదని తెలిపింది.

ఈ బడ్జెట్ ఉపాధి అవకాశాలను, సంక్షేమ కార్యక్రమాలపైన ఖర్చును మరింత తగ్గిస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. జాతీయ స్థూల జాతీయోత్పత్తి(జిడిపి)లో ప్రభుత్వ వ్యయం 13.2 శాతం నుంచి 13 శాతానికి తగ్గిపోయిందని తెలిపింది. గత ఏడాది సామాజిక పథకాలపై పెట్టుబడి వ్యయం బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యాల కన్నా తక్కువగా ఉందని, దీనర్ధం ద్రవ్యలోటు తగ్గింపు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రజాసంక్షేమంపై పెట్టే ఖర్చులో కేంద్రం కోత విధించిందని తెలిపింది. లక్ష్యాల కన్నా పన్నుల వసూళ్లు తక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఖర్చులను తగ్గించుకుందని, దీంతో ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడిందని తెలిపింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపై ఖర్చు జిడిపిలో 1.15 శాతం నుంచి 1.08 శాతానికి తగ్గిపోయిందని, మొత్తం ఆరోగ్య రంగం వ్యయం జీడీపీలో 0.32 శాతం నుంచి 0.29 శాతానికి పడిపోయిందని, విద్యపై కేంద్ర ఖర్చు 0.49 శాతం నుంచి 0.45 శాతానికి తగ్గిపోయిందని, మహిళా సంక్షేమ బడ్జెట్ జిడిపిలో 0.68 శాతం నుంచి 0.65 శాతానికి పడిపోయిందని, ఎస్‌టి సంక్షేమానికి కేటాయింపులు 1.6 శాతం కాగా, ఎస్‌సిలకు కేటాయింపు 2.32 శాతం మాత్రమేనని, వీరి జనాభాతో పోల్చుకుంటే కేటాయింపులు అత్యల్పమని పేర్కొంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేటాయింపుల్లో ఏ మార్పు లేదని, పైగా గత ఏడాది బకాయిలు రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించాల్సి ఉందని తెలిపింది.


రైతుకు కనీస మద్దతు ధరను ఉత్పత్తి ఖర్చు కన్నా ఒకటిన్నర రెట్లు అదనంగా అందిస్తామని ప్రభుత్వం మళ్లీ హామీ ఇచ్చిందని, ఈ విషయంలో ఆర్థికమంత్రి దేశాన్ని తప్పుదోవ పట్టించారని, రబీ పంటల్లో ఎక్కువ భాగం పంటలకు ఇప్పటికే ఈ హామీ ఇచ్చారని తెలిపింది. అయితే దేశవ్యాప్తంగా ఈ హామీ ఎక్కడా అమలు కాలేదని తెలిపింది. ఇదే విధంగా పంట రుణాల పెంపు లాంటి ఇతర అంశాలకు కూడా బడ్జెట్‌లో నిర్దిష్టమైన కేటాయింపులు లేవని పేర్కొంది. రైతులకు మద్దతు నిచ్చేట్లుగా గానీ, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసేట్లుగా గానీ ఆహార సబ్సిడికి,, ధాన్యం సేకరణకు కేటాయింపులు లేవని పేర్కొంది. అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు ఉపశమనం కల్గించే రుణ మాఫీ గురించి బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనా లేదని అన్నారు. మధ్య తరగతి ప్రజలకు నేరుగా ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని, కాగా వారి ఆదాయాలకు గండిపడే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలిపింది. పెట్రోల్, డిజిల్ పైన రెండు రూపాయలు తగ్గించినప్పటికీ సెస్ పెంచడం వల్ల లీటర్‌కు ఆరు నుంచి ఎనిమిది రూపాయల అదనం భారం పడుతోందని తెలిపింది.

మొత్తంగా ప్రజలను మభ్య పెట్టేందుకు మోడి ప్రభుత్వం చేస్తున్న ప్రచార జిమ్మక్కు ఈ బడ్జెట్ అని పేర్కొంది. వ్యయాల్లో ఉన్న వైరుధ్యాలు, ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ, ద్రవ్యలోటును తగ్గించటం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని సంతృప్తి పరచటం కోసమేనని, ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల కారణంగా భారత ప్రజలపై అధిక భారాలు పడనున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి కారణంగా అసలే కష్టాల్లో ఉన్న ప్రజలను మరింత కష్టాల్లోకి నెట్టేట్లుగా ఉన్న ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ పార్టీ శాఖలు దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

ఆరోగ్యం అరకొరే!

కొత్త బీమా పథకం కొత్త ముసుగే



- ఆరోగ్య రంగానికి రూ.1.38 లక్షల కోట్లు
- హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు రూ.1200 కోట్లు
- క్షయ రోగుల సంక్షేమానికి రూ.600 కోట్లు
- జాతీయ ఆరోగ్య బీమా పథకం ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య బీమా

న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా ప్రకటించిన ఆరోగ్య పరిరక్షణ పథకం కొత్త సీసాలో పాత సారాలా వుంది. ఇప్పటికే అమలులో వున్న పథకాలు అనేక బాలారిష్టాలతో కుంటుపడుతుంటే, ఆ అడ్డంకులను తొలగించకుండా పది కోట్ల నిరుపేద, అణగారిన కటుంబాలకు ఏటా రూ.5 లక్షల చొప్పున బీమా కల్పించే కొత్త పథకాన్ని ముందుకు తీసుకొచ్చారు. ఆర్థిక మంత్రి బడ్జెట్‌ను గురువారం పార్లమెంటులో ప్రవేశపెడుతూ 'మా ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని నిర్ణయించిందని' జైట్లీ చెప్పారు. అంతటితో ఆగలేదు. ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య పథకంగా దీనిని అభివర్ణించారు. ఈ పథకం అమలుకు తగినన్ని నిధులను సమకూరుస్తామన్నారు. ఆయన చేసిన ప్రకటనలో ఈ పథకం వర్తించే కుటుంబాల సంఖ్య, ఆర్థిక మంత్రి వ్యక్తం చేసిన ఆకాంక్ష రీత్యా ఇది రెండు విధాలుగా ప్రాధాన్యత సంతరించుకుంది. మొదటిది, ఒక్కో కుటుంబానికి ఇప్పుడున్న లక్ష రూపాయల బీమాను ఒకేసారి 5 లక్షలకు పెంచడం. ఇది ఇప్పుడున్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్‌ఎస్‌బివై)పథకం కన్నా 17 రెట్లు పెద్దది. దేశ జనాభాలో దాదాపు 40 శాతం మందికి ఈ కొత్త పథకం వర్తిస్తుంది.

రెండవ అంశం 2016-17 బడ్జెట్‌లో చూపిన కేటాయింపులకు, వాస్తవంగా ఖర్చు చేసినదానికి వున్న తేడాను గమనించాలి. ఆర్ ఎస్‌బివైని ప్రవేశపెట్టినప్పుడు 5.9 కోట్ల కుటుంబాలకు దీనిని వర్తింపజేయడమే లక్ష్యంగా ప్రకటించారు. కానీ, ఇంతవరకు రూ.3.6 కోట్ల కుటుంబాలే దీని కింద నమోదయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వం పది కోట్ల కుటుంబాలకు దీనిని వర్తింపజేస్తామని చెప్పడం ఆసక్తికర అంశంగా మారింది. గతంలో ప్రకటించిన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పిఎస్) ఇంకా ఒక కొలిక్కి రావాల్సి వుందని రెండు మాసాల క్రితం ప్రభుత్వమే స్వయంగా అంగీకరించింది. ఆర్‌ఎస్‌బివై లోపభూయిష్టంగా వుందని, పారదర్శకత, సామర్ధ్యానికి సంబంధించి అనేక సమస్యలు దానిని చుట్టుముట్టాయని తెలిపింది. ఈ పథకానికి యుపిఎ -2 ప్రభుత్వం 2012-13లో 1,001 కోట్లు కేటాయిస్తే, ఆ తరువాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం 2014-15 బడ్జెట్‌లో దీనిని రూ.550 కోట్లకు కుదించింది. ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్‌హెచ్‌పిఎస్‌కి కేటాయించింది కేవలం రూ.724 కోట్లే! గత ఏడాది బడ్జెట్‌లో దీనిని వెయ్యి కోట్లకు పెంచింది.గత కొంత కాలంగా ఆర్‌ఎస్‌బివై, పథకానికి విడుదల జేసిన నిధులు, వాటిని వినియోగించిన తీరును బట్టి చూస్తే కేటాయింపులకు ఖర్చుకు మధ్య హస్తిమశకాంతరం వున్నది. ఈ పథకానికి 2016 నవంబరులో కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రధాని మోడీ పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట బురుజుల నుంచి ప్రకటించారు. చాలా రాష్ట్రాలు దీనిని అమలు చేయడం తమ వల్ల కాదని చేతులెత్తేశాయి. కేవలం 8 రాష్ట్రాలే ఈ నిధులను వినియోగించుకున్నాయి. అవి ఛత్తీస్‌గఢ్, కేరళ, ఒడిషా. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్ మూడింట ఒక వంతు శాతం నిధులను మాత్రమే వినియోగించుకుందని ఆన్‌లైన్ వెబ్ మీడియా వైర్ పరిశోధనలో తేలింది. ఆర్‌ఎస్‌బివై కింద ప్రైవేట్ ఆసుపత్రులకు చెల్లించిన బీమా సొమ్ము చాలక పేద రోగులు తమ జేబుల్లోంచి అదనంగా చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ పథకం నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారింది. మొదట ఇది కార్మిక, ఉపాధి శాఖల ఆధీనంలో వుండేది. తరువాత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు బదలాయించారు. ఈ పథకం పేరును ఆర్‌ఎస్‌ఎస్‌వైగా మార్చారు.

ఈ పథకం అమలులో ప్రైవేట్ రంగం చొరబడడంతో దీని నిర్వహణ పరమ అధ్వానంగా తయారైంది. 7,226 ఆస్పత్రులను ఆర్‌ఎస్‌బివై పథకం కిందకు తీసుకొచ్చిన 4,291 ఆసుపత్రుల్లో సగానికిపైగా ప్రైవేటు ఆసుపత్రులే. 2,965 మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులు. ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి కేశవ దేశిరాజు దీనిపై తీవ్రంగా స్పందిస్తూ, ప్రైవేటు ఆసుపత్రులకు ఈ నిధులను ఎలా మళ్లిస్తారు అని నిలదీశారు. ఇప్పుడు అరుణ్ జైట్లీ ప్రకటించిన కొత్త ఆరోగ్య పరిరక్షణ పథకానికి కేటాయించిన నిధులు ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ట పరచడానికి వినియోగిస్తే ప్రభుత్వ వైద్యం, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల్లో ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుంది. మరింత మందికి ఉపాధి, మెరుగైన వేతనాలు చెల్లించడానికి ఈ నిధులను ఉపయోగిస్తారా? లేక ప్రైవేట్ ఆసుపత్రులకు దోచిపెట్టేందుకు ఉపయోగిస్తారా? అన్నది చూడాలి అని ఆయన వ్యాఖ్యానించారు.

కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అరవింద్ మరియం స్పందిస్తూ, ఈ కొత్త ఆరోగ్య బీమా పథకం ప్రైవేట్ బీమా ప్రొవైడర్లు, ఆసుపత్రుల పాలిట కల్పవృక్షంగా మారే అవకాశం లేకపోలేదన్నారు. ఇటువంటి సార్వత్రిక ఆరోగ్య బీమా పథకాన్ని ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా అమలు చేస్తే పేదలకు మేలు జరిగిన దాఖలాలు ప్రపంచంలో ఎక్కడా లేవని, ఇటువంటి చర్యల వల్ల ఎక్కువగా లబ్ధి పొందేది బడా ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రైవేట్ బీమా కంపెనీలేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ రంగంలో వైద్యానికి వేరే ప్రత్యామ్నాయమే లేదని ఆయన ఉద్ఘాటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పటిష్టతకు మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన సూచించారు.



స్పందనలు

మెడికల్ హెల్త్ కేర్ ఒక పెద్ద బూటకం, ఇదొక ఎన్నికల ఎత్తుడగ. ఇది కేవలం బీమా పథకం మాత్రమే. ప్రయివేటు రంగానికి భారీగా ప్రయోజనం కలిగించే పథకం ఇది. సగటు పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఊరట లభించదు.

- కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఆరోగ్య రక్షణ పథకం ఓ పెద్ద అడుగు.

- అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్ సునితా రెడ్డి

ప్రపంచంలోనే అతి పెద్ద హెల్త్ స్కీమ్‌ను ప్రధాని దేశ ప్రజల కోసం ప్రారంభించారు. దేశంలోని పేదలు, రైతులు, వయో వృద్ధులు, మహిళలను అభివృద్ధి చేసి వాళ్ల ఆదాయాన్ని పెంచాలనే మంచి సంకల్పంతోనే ఈ బడ్జెట్‌లో ఈ స్కీమ్‌ను ప్రారంభించారు.

- కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ

సంక్షేమానికి అరకొరే..

న్యూఢిల్లీ : 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోకసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమం కోసం రూ.56,619 కోట్లు, ఎస్టీల సంక్షేమం కోసం రూ.39,135 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. 2017-18 బడ్జెట్ లో ఎస్‌సీ సంక్షేమానికి రూ.52,393 కోట్లు, ఎస్‌టీ సంక్షేమానికి రూ.31,920 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది కేటాయింపులు నామమాత్రంగానే పెరిగాయి. ఈ బడ్జెట్‌లో వ్యవసాయంతో పాటు గ్రామీణరంగం, సంక్షేమ రంగంపై దృష్టి సారించామని చెబుతూనే కీలక ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి మొక్కుబడి కేటాయింపులు జరిపారు. ఎస్టీల కోసం 2022 నాటికి ప్రత్యేకంగా 'ఏకలవ్య' స్కూళ్లను ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి తెలిపారు.

ఎస్‌సిల సంక్షేమానికి కేటాయింపులు శూన్యం

డిఎస్ఎంఎం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

షెడ్యూల్డు కులాల వారి సంక్షేమం కోసం కేంద్ర బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపుల పట్ల దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గత ఏడాది కేటాయించిన రు.52 వేల కోట్ల నుండి ఈ ఏడాది రు.56 వేల కోట్ల పెంచిన కేటాయింపులు దళితుల సంక్షేమానికి ఏ మాత్రం సరిపోవని డిఎస్ఎంఎం ఒక ప్రకటనలో పేర్కొంది. మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో దళితుల సంక్షేమం కోసం 4.5 శాతం నిధులను కేటాయించాలన్న నరేంద్రమాధవ్ కమిటీ సిఫార్సులను సైతం కేంద్రం పట్టించుకోలేదని విమర్శించింది. ఈ బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమం కోసం కేటాయింపులు కేవలం 3.8 శాతానికే పరిమితమయ్యాయని, ప్రస్తుత పరిస్థితుల్లో కోట్లాది రూపాయల నిదులు దారి మళ్లటం లేదా లక్ష్యసాధనలో ఖర్చుకాక మురిగిపోవటమో జరుగుతోందని తెలిపింది.

అంగన్‌వాడీలను మోసం చేసిన ఎన్డీయే సర్కారు

- ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ఆగ్రహం,
- ప్రభుత్వ దిష్టిబొమ్మల దగ్ధానికి పిలుపు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

2018-19 బడ్జెట్ ద్వారా దేశ వ్యాప్తంగా వున్న 27 లక్షల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మోసం చేసిందని అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమాఖ్య (ఎఐఎఫ్ఎబ్ల్యుహెచ్) విమర్శిం చింది. బడ్జెట్ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ దేశవ్యా ప్తంగా ఎన్డీయే ప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేయా లని ఎఐఎఫ్‌డబ్ల్యుఎహెచ్ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తాము అధికారం లోకి వస్తే అంగన్‌వాడీవర్కర్ల పని పరిసి తులను సమీక్షించి వారి వేతనాలను పెంచుతామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న బిజెపి నేతృత్వంలో ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం తన హామీలను తుంగలో తొక్కిందని ఆమె ఈ ప్రకటనలో విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం చివరిసారిగా ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్ ఇందుకు తాజా ఉదాహరణగా నిలిచింద న్నారు. ఈ బడ్జెట్‌లో కేంద్రం తన హామీలతో పాటు దేశంలో పోషకాహార లోపంతో



బాధపడుతున్న ఎనిమిది కోట్లకు పైగా చిన్నారులను, రెండు కోట్లకు పైగా గర్భిణులను నిర్లక్ష్యం చేసిందనేందుకు ఉదాహరణగా నిలుస్తోందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు 2011లో నిర్ధారించిన వేత నం తప్ప అప్పటి నుండి పెరిగిన పనిగంటలకు అనుగుణంగా వేత నాలు పెరగలేదన్నారు. కేంద్ర ప్రభు త్వ అధికారిక లెక్కల ప్రకారమే ఏటా 75 లక్షల మంది నవజాత శిశువులు పుట్టిన ఆర్నెల్లలోపే మరణిస్తున్నా రని, ఈ పరిస్థితుల్లో ఆరేళ్లలోపు చిన్నా రులకు పోషకాహారాన్ని అందించేందుకు ఉద్దేశించిన ఏకైక పథకం సమగ్ర శిశుఅభివృద్ధి సేవల (ఐసిడి ఎస్) పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవ సరం వుందని, సుప్రీంకోర్టు ఆదేశం, ఆహార భద్రతా చట్టం దీనిని బలపరుస్తున్నాయని వివరించింది. అయితే కేంద్రంలోని ప్రస్తుత మోడీ ప్రభుత్వం అత్యంత కీలకమైన ఈ పథకానికి వరుసగా నిధుల్లో భారీ కోతలు పెడుతుండటం శోచనీయమని ఆమె విమర్శించారు. ఈ కోతలకు వ్యతిరేకంగా అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు వివిధ స్థాయిల్లో పోరాటాలు కొనసాగిస్తున్న ఫలితంగా గత ఏడాది ఈ ఏడాది కంటితుడుపుగా నిధులను పెంచారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనాలు, పెన్షన్, ఇతర సామాజిక భద్రతా పథకాలను వర్తింపచేయాలంటూ 45వ భారత కార్మిక సదస్సు చేసిన సిఫార్సులను మోడీ ప్రభుత్వం మరోసారి తుంగలో తొక్కిందని ఆమె మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న విధానాలను నిరసిస్తూ శుక్రవారం నాడు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించటంతో పాటు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఇతర కార్మిక సంఘాలతో కలిసి రాజధానిని దిగ్బంధిస్తామని, పోరాటాలను ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఐసిడిఎస్ పథకాన్ని పరిరక్షించుకునేందుకు, అంగన్‌వాడీలందరూ దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

బాధ్యత లేని బడ్జెట్

ప్రొ.ఎన్ వేణుగోపాలరావు


బడ్జెట్ ప్రసంగం ముగిసింది. ప్రధానమంత్రైతే తాము ఇప్పుడు గ్రామీణులకు దగ్గరయ్యామని చంకలు గుద్దుకుంటున్నారు. విత్త మంత్రి ప్రకటనలకు సభ్యులు చప్పట్లు చరిచీ, చరిచీ నొప్పి పుట్టి విరమించుకున్నారు. చాలా మంది ఆర్థిక వేత్తలు, రాజకీయ అధ్యయనకారులు ఊహించినట్లుగా ఈ బడ్జెట్ వ్యవసాయ కేంద్రితంగానే ఉంది. అయితే ఇందులో కొత్తదనమేమీ లేదు. ముందుగా "జాతీయ రైతు కమిషన్" పుష్కరకాలం నాడు అనేక పరిష్కారాలలో ఒక చిన్న పరిష్కారంగా సూచించిన రైతు ఉత్పత్తి ధర మీద 50 శాతం అదనంగా వచ్చేట్లు ఉత్పత్తి మార్కెట్ ధర ఉండాలనేది అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఇదే "ఎన్‌డిఎ మార్కు" రాజకీయం! ఉత్పత్తి ధర నిర్ణయించే దెవరు? నిన్ననే విజయవాడలో రెండు తెలుగు రాష్ట్రాల వ్యవసాయాధికారులు వివిధ పంటలకు అయ్యే

ఉత్పత్తి ఖర్చుల పట్టికను సమర్పించారు. అంతరం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. అలాంటిది 29 రాష్ట్రాల మధ్య వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చులకు సమన్వయమెలా కుదురుతుంది? దీని కొరకు మరో కమిషన్, ట్రిబ్యునల్ ఏర్పరచాలి.



వ్యవసాయ అనుబంధ వృత్తుల వారికి కూడా క్రెడిట్ కార్డులు ఇవ్వడం, స్వయం సహాయక బృందాల ద్వారా సేంద్రియ వ్యవసాయం నడపడం, వాళ్లే ఫుడ్ పార్కులు నిర్వహించటాన్ని ఎంతో గొప్పగా చెప్పుకొచ్చి వాటికి నిధులు కేటాయించారు. బాగానే ఉంది. అభినందనీయం. సంస్థాగత వనరుల పెంపు ముఖ్యంగా పశుపోషణ, కూరగాయ ఉత్పత్తుదారులకు అలానే మత్స్య వృత్తిదారులకు అర్భాటంగా ప్రకటించారు. అదీ బాగానే ఉంది. కానీ వీటిని నిర్వహించేదెవరు? జవాబుదారీ తనం ఎవరిది?. వ్యవసాయం, రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలదనే స్పృహ ఎన్ని రాష్ట్రాలకున్నది?. భారత వ్యవసాయ వాణిజ్య నియంత్రణ, ప్రపంచ వాణిజ్య సంస్థ కబంధ హస్తాల్లో ఇరుక్కొందని గుర్తున్నాదా?. ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు పదేపదే ప్రభుత్వాల ముందు తెస్తున్నా కంపెనీల వరవడికి కళ్లేమేసేదేవరు?. సేద్యం భూమి మీద ఏ హక్కులేని రైతులకు అందునా మహిళలకు అప్పిచ్చేదేవరు?. సేంద్రియ వ్యవసాయ నిర్వహించేదేలా? రాష్ట్రప్రభుత్వాల బాధ్యత మరచి, ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల్ని కూడా పట్టించుకోని పరిస్థితి చూస్తున్నాం. మహారాష్ట్ర, ఛత్తీఘడ్ రాష్ట్ర మంత్రుల ధోరణి వికృతంగా ఉంది. తాము వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాలనే స్పృహలో ఉన్నట్టు లేదు. రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్ రైతులు ఎందుకు వీధులెక్కుతున్నారు?. బడ్జెట్ లేకనా?. కళ్లు పొరలు కమ్మిన రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్లనా?.

ఈ బడ్జెట్ వల్ల గ్రామీణ ప్రజలు తమ కష్టాలు మర్చిపోయి తమకేదో బ్యాంకు రుణాలు దొరుకుతాయి, తమ కుటుంబానికి విద్య, వైద్యాలకు తగిన బీమా ఇచ్చారని నమ్మి మళ్లీ ఎన్‌డిఎకి ఓటేస్తారనేది కల్ల. అందుకే ఇది వాళ్ల చివరి బడ్జెట్. అలాగే వచ్చే పాలకులకి ఇదొక హెచ్చరిక బడ్జెట్. రైతుల ఐక్యత పోరాటం (నవంబర్ 18 ప్రదర్శన) వల్లనే ఆ జాతీయ కమిషన్ వారి చిన్న సలహానైనా అంగీకరించడం ఐక్య పోరాటాలే మార్పు తెస్తాయి. రైతులే ఈ దేశ వైఖరి మార్పుకు దోహదపడతారు.



మహిళలకు 'గ్యాస్ '

- 8 కోట్ల ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు
- మహిళా ఉద్యోగులకు ఇపిఎఫ్ చందా 8శాతానికి తగ్గింపు



న్యూఢిల్లీ: మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యమిస్తామని చెప్పిన ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో ఈసారి కూడా చిన్న చూపు చూసింది. ఆర్థిక మంత్రి జైట్లీ గురువారం పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతూ కట్టెల పొయ్యి నుంచి మహిళలకు విముక్తి కల్పించాలన్న సంకల్పంతో ఈసారి బడ్జెట్‌లో స్వయం సహాయక బృందాలకు 8 కోట్ల వంటగ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. డెబ్బయ్యేళ్ల స్వతంత్ర భారతంలో ఒక్క మహిళకు కూడా బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం కల్పించలేదంటేనే ఈ పురుషాధిపత్య సమాజంలో మహిళల పట్ల వివక్ష ఎలా పెరిగిపోతున్నదీ విదితమవుతోంది. గతంలో ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా చేయడంతో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అది కాకతాళీయమే. మరో ఏడాదిలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో వుంచుకుని మోడీ ప్రభుత్వం ఉజ్వల యోజన కింద ఉచిత వంటగ్యాస్ కనెక్షన్ల పథకం ప్రకటించింది. అలాగే మహిళా ఉద్యోగులు ఉద్యోగంలో చేరే మొదటి మూడేళ్లలో ఇపిఎఫ్ చందాను 12 శాతానికి బదులు 8 శాతం చెల్లిస్తే చాలు అని చెప్పింది. సౌభాగ్య యోజన పథకం కింద నాలుగు కోట్ల మందికి ఇళ్లు, ఆరు కోట్ల మరుగుదొడ్లు కట్టిస్తామన్నది. ఐసిడిఎస్, సుకన్యా సమృద్ధి యోజన, బేటీ బచావో బేటీ పడావో వంటి పథకాలకు కేటాయింపుల్లో పెద్దగా పెంచిందేమీ లేదు. మహిళా సాధికారతకు రూ.1366 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది గత సంవత్సరం కంటే కేవలం 300 కోట్లు ఎక్కువ. 2017-18 బడ్జెట్‌లో రూ.1,089 కోట్లు కేటాయించారు. సవరించిన అంచనా ప్రకారం ఖర్చు చేసింది రూ.798 కోట్లే! ఐసిడిఎస్ విషయానికొస్తే గత ఆర్థిక సంవత్సరం 20,755 కోట్లు కేటాయించారు. దీనిలో ఖర్చు చేసింది రూ.15,893 కోట్లు. ఈ లెక్కన వంటగ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణాలకు చేసిన కేటాయింపులు ఎంత వరకు ఖర్చు చేస్తాయన్నది ప్రశ్నార్థకమవుతోంది.

మౌలికసదుపాయాలకు రూ.5.97 లక్షల కోట్లు



- రెండు లక్షల కోట్లుతో స్మార్ట్ సిటీలు
- రైల్వేలకు 1.48 లక్షల కోట్లు
- రోడ్ల నిర్మాణానికి 80 వేల కోట్లు
- గ్రామాల్లో ఐదు లక్షల వైఫై హాట్ స్పాట్లు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో 2018-19 ఏడాదికి గాను మౌలిక సదుపాయాలకు 5.97 లక్షల కోట్ల రూపాయలను కేటాయించారు. గత ఏడాదితో పోల్చితే లక్షా 34 వేల కోట్ల రూపాయలు అదనంగా కేటాయించినట్లు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి ఈ ఏడాది కేటాయింపులతోపాటు గత ఏడాది నుంచి కొనసాగుతున్న ప్రాజెక్టులను కలుపుకొని దాదాపు తొమ్మిదిన్నర లక్షల కోట్ల పనులు కొనసాగుతున్నాయని, వీటిన్నింటి ప్రగతిని ప్రధాని మోడీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రోడ్లు, రైల్వేలు, పౌర విమానయాన, జలరవాణాతోపాటు పట్టణాల్లో మౌలిక వసతుల వృద్ధిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఈ బడ్జెట్‌లో రైల్వేలకు లక్షా 48 వేల కోట్ల రూపాయలు కేటాయించారు.

భారత్‌మాల ప్రాజెక్ట్‌లో 4500 కిలోమీటర్లు

రోడ్ల నిర్మాణానికి 80 వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఇందులో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భారతమాల ప్రాజెక్టులో ఈ ఏడాది 4500 కిలోమీటర్ల జాతీయ రహదారిని నిర్మించేందుకు 29 వేల 600 కోట్ల రూపాయాలు కేటాయించారు. సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు సొరంగమార్గాలను తవ్వనున్నారు.

విమానాశ్రయాల సామర్థ్యం ఐదు రెట్లు పెంపు

పౌర విమానయాన శాఖకు పది వేల ఏడు వందల కోట్లు కేటాయించారు. విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించారు. ఎన్ఎబిహెచ్ నిర్మాణ్ కార్యక్రమం కింద ప్రస్తుత విమానాశ్రయాల సామర్థ్యాన్ని ఐదు రెట్లు అధికంగా పెంచనున్నారు. తద్వారా ఏడాదిలో వంద కోట్ల విమాన ట్రిప్పులను తిప్పాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు ప్రాంతీయ అనుసంధానత కోసం ప్రవేశపెట్టిన ఉడాన్ ప్రాజెక్ట్ ద్వారా 56 విమానా శ్రయాలను, 31 హెలీ ప్యాడ్స్‌ను అనుసంధానించనున్నారు.

పర్యాటక నగరాలపై ప్రత్యేక దృష్టి

పట్టణాల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా రెండు లక్షల కోట్ల రూపాయలతో 99 స్మార్ట్ సిటీలను నిర్మిస్తున్నారు. స్మార్ట్‌సిటీస్ మిషన్ కింద ఇప్పటి వరకు 2350 కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయి. మరో 21 వేల కోట్ల రూపాయల పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా దేశవ్యాప్తంగా ఉన్న పది పర్యాటక నగరాలను ఐకానిక్ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరచనున్నారు. దీంతోపాటు పురావస్తుశాఖకు చెందిన వంద పురాతన కట్టడాల వద్ద సౌకర్యాలను పెంచనున్నారు.

డిజిటల్ ఇండియాకు రెట్టింపు కేటాయింపులు

డిజిటల్ ఇండియా కార్యక్రమానికి మూడు వేల కోట్ల రూపాయలను కేటాయించారు. గత ఏడాది కన్నా రెట్టింపు కేటాయింపులు జరిగాయి. రొబొటిక్స్, కృత్రిమ మేధ, డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్, బిగ్ డేటా ఎనలాసిస్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్‌లో నైపుణ్యత, శిక్షణ కల్పించేందుకు పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

ఐదు కోట్ల మంది గ్రామీణులకు ఇంటర్నెట్ సౌకర్యం

టెలికం రంగ మౌలిక సదుపాయాల కోసం పది వేల కోట్ల రూపాయాలను కేటాయించారు. ఈ ఏడాది గ్రామాల్లో ఐదు లక్షల వైఫై హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసమే ఎనిమిదివేల కోట్ల రూపాయలను ఖర్చుచేయనున్నారు. దీని వల్ల ఐదు కోట్ల మంది గ్రామీణ ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే భారత్ నెట్ మొదటి దశ కింద 20 కోట్ల మంది గ్రామీణ ప్రజలకు ఇంటర్నెట్ సౌకర్యం అందించారు. కొత్త టెక్నాలజీలలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు టెలికమ్ డిపార్ట్‌మెంట్ చెన్నై ఐఐటిలో 5జీ టెస్ట్‌బెడ్‌ను నెలకొల్పనుంది.

'ముద్రా'కు మూడు లక్షల కోట్లు

- ముద్రా బ్యాంక్‌కు రూ. 600 కోట్లు
- బడ్జెట్‌లో జైట్లీ వెల్లడి

న్యూఢిల్లీ: సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీని విస్మరించిన మోడీ ప్రభుత్వం 2019 పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈసారి చిన్న తరహా పరిశ్రమలకు పున: సాయం అందించే సంస్థ (ముద్రా)కు ఒక్కసారిగా 20 శాతం కేటాయింపులు పెంచింది. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ముద్రా పథకాన్ని గత మూడేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో మూడు లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ. 2.44 లక్షల కోట్లు కేటాయించారు. ఆర్థిక మాంద్యం, పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టితో బాగా చితికిపోయిన రంగాల్లో ఉపాధి ఒకటి. ఈ పరిస్థితుల్లో ఉపాధికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెంచింది. గతంలో కేటాయించిన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయలేదు. ఈ సారి కేటాయింపులు పెంచినా, వీటిని ఎంతవరకు ఖర్చు చేస్తుందో చూడాలి. 2015 ఏప్రిల్‌లో అట్టహాసంగా ప్రారంభించిన ముద్రా పథకం స్టార్టప్ దశలోనే మిగిలిపోయింది. ముద్రా పథకం కింద ఉపాధి, నైపుణ్యం మెరుగుపరచుకోవడంలో శిక్షణ ఇవ్వాల్సివుంది. కానీ, సరైన సంస్థాగత యంత్రాంగం లేకపోవడంతో ఇది ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న బిగ్ బ్యాంగ్ సంస్కరణలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగానికి నైవేద్యంగా పెడుతున్నాయి. ఉపాధి కల్పనకు ఎంతో ఆసరాగా వున్న ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం కావడంతో నిరుద్యోగ సమస్య మరింత పెరిగింది. జిఎస్‌టి పేరుతో చిన్న వ్యాపారులు, పరిశ్రమల వెన్ను విరిచింది. ఒక వైపు ఉపాధి అవకాశాలను కుదించి వేసే ఇటువంటి విధానాలు అనుసరిస్తూ, మరో వైపు ఈ సమస్యలన్నిటికీ పరిష్కారంగా ముద్రా పథకాన్ని ముందుకు తెస్తోంది. ముద్రా బ్యాంకుకు ఈ బడ్జెట్‌లో 600 కోట్లు కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు.

'ఉపాధి' మరింత పక్కదారి

– గ్రామీణ పారిశుధ్యానికి భారీ కేటాయింపులు


ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పల్లెల్లో కూలీలకు పనులు కల్పించేందుకు యుపిఎ హయాంలో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి (ఎంజిఎన్ఆర్ఇజిఎ) 2018-19 బడ్జెట్‌లో మోడీ సర్కారు మరిన్ని తూట్లు పొడిచింది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలకు ఉపాధి హామీ నిధులను అనుసంధానం చేయడంతో గ్రామాల్లో కూలీలకు పని దినాలు పడిపోతున్నాయి. కాంక్రీటు పనులు పెరుగుతున్నాయి. భారీ యంత్రాలతో పనులు చేసి కూలీల నోట్లో మట్టి కొడుతున్నారు. కాగా గురువారం కేంద్రం ప్రతిపాదించిన బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులను గతేడాది కంటే పెంచినట్లు చూపించింది. రూ.55 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొంది. దేశ వ్యాప్తంగా 321 కోట్ల పని దినాలు కల్పిస్తామంది. మరోపక్క ఆ నిధులతో సిసి రోడ్లు, రహదారుల వంటి నిర్మాణాలు చేపడతామని వెల్లడించింది. ఇంకా గ్రామీణ పారిశుధ్య పథకం, గోబర్‌ధన్, గృహ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, జీవనోపాధి మిషన్ తదితరాలకు ఉపాధి హామీ నిధులను అనుసంధానం చేస్తామంది. దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, పలు ప్రాంతాల్లో కరువు తాండవిస్తోందని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం పేర్కొంది. ఆ పరిస్థితులకు తగ్గట్టుగా కూలీకు పనులు చూపేందుకు ఉపాధి హామీ నిధులు పెంచలేదు. పెంచామన్నవి ఏ మూలకూ చాలవు. పైగా వేరే వ్యాపకాలకు మళ్లిస్తామంది.



గ్రామీణాభివృద్ధి ముఖ్యాంశాలు

- గ్రామీణ జీవనోపాధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.14.34 లక్షల కోట్లు.
- ఉపాధి హామీకి రూ.55 వేల కోట్లు. 321 కోట్ల పనిదినాల కల్పన. 3.17 లక్షల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం. 51 లక్షల కొత్త ఇళ్లు. 1.88 లక్షల మరుగుదొడ్లు.
- జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు రూ.5,750 కోట్లు
- స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి)కు రూ.75 వేల కోట్ల బ్యాంక్ లింకేజి రుణాలు
- ప్రధాన మంత్రి క్రిషి సంచయి పథకానికి రూ.2,600 కోట్లు
- గ్రామీణ పారిశుధ్య పథకానికి రూ.16,713 కోట్లు
- గ్రామీణ గృహ నిర్మాణానికి ప్రత్యేక నిధి



ప్రసంగంలోనే బాగుంది: యనమల



ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నిశితంగా స్పందించారు. అంకెల్లో ఎలా ఉన్నా.. ప్రసంగం మాత్రం బాగుందని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు తయారు చేసిన బడ్జెట్‌గా కనిపిస్తోందని విలేకరుల సమావేశంలో రెండు దఫాలు వ్యాఖ్యానించారు. ముందస్తు ఎన్నికల బడ్జెట్‌గా కూడా కనిపిస్తోందన్నారు. రైల్వే పద్దులపై జైట్లీ మాట్లాడుతూ కర్నాటక, ముంబయిల్లో మెట్రోలపై మాట్లాడినప్పటికీ, రాష్ట్రానికి సంబంధించిన ఒక్క మాట కూడా లేకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, నీటిపారుదల రంగాలకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చినప్పటికీ, అది ఎన్నికల కోసమా, నిజంగా అభివృద్ధి కోసమా అన్నది చూడాలని తెలిపారు.

కార్పొరేట్‌లకే లబ్ధి : ప్రజా ఆరోగ్య వేదిక

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో ప్రజారోగ్యం కంటే కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ సి సురేష్ తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.5447 కోట్లు మాత్రమే అదనంగా కేటాయించారని, ప్రజారోగ్యంపై ప్రభుత్వ వ్యయాన్ని జిడిపిలో 2.5 శాతానికి పెంచుతామని చేసిన వాగ్దానాన్ని అమలు చేసే ఉద్దేశం లేదని ఈ బడ్జెట్ స్పష్టం చేస్తోందని అన్నారు. ఈ నామమాత్ర అదనపు కేటాయింపులను కూడా ప్రభుత్వ ఆసుపత్రులకు జవసత్వాలను కల్పించడానికి బదులుగా ఇన్సూరెన్స్ పేరుతో కార్పొరేట్ ఆసుపత్రులకు వ్యాపార అవకాశాల్ని కల్పించేందుకే చేశారన్నారు.

రోడ్డు భద్రత పట్టని బడ్జెట్ : ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో రోడ్డు భద్రతకు ఒక్క రుపాయి కేటాయించకపోవడం దారుణమని ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక భారాలు మోస్తున్న ఆర్టీసిల కోసం ప్రతి రాష్ట్రానికీ రూ.30 వేల కోట్లు కేటాయించి ఉంటే ఆర్టీసిలు ఊపిరి పీల్చుకునేవని తెలిపారు. వేతన జీవులకు ఆదాయ పన్ను పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచుతారని ఆశించినా అదీ జరగకపోగా ఎడ్యుకేషన్ సెస్‌ను మూడు నుంచి నాలుగు శాతానికి పెంచారని పేర్కొన్నారు.

మోసపూరిత బడ్జెట్ : సిఐటియు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కేంద్రప్రభుత్వం మోసపూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సిఐటియు రాష్ట్ర కమిటీ విమర్శించింది. కార్మికులు, ఉద్యోగులకు మొండిచేయి చూపిందని యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎంఎ గఫూర్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నప్పటికీ వారి సమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రతిపాదనలూ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితి పెంచలేదని తెలిపారు. రూ.250కోట్ల లోపు టర్నోవర్ ఉన్న కార్పొరేట్ కంపెనీలకు ఆదాయ పన్ను 30 నుంచి 25శాతానికి తగ్గించిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో వ్యాపార కంపెనీలకు నూటికి నూరు శాతం పన్ను మినహాయింపులు ఇచ్చిందని తెలిపారు. సిపిఎస్ పెన్షనర్ల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోలేదని, వారి కనీస పెన్షన్ పెంచేందుకు అవసరమైన కేటాయింపులు చేయలేదని పేర్కొన్నారు.

నదుల అనుసంధానం ఆర్భాటమే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

జలవనరుల శాఖకు బడ్జెట్ కేటాయింపులు బిజెపి సర్కారు నిత్యం చెపుతున్న లక్ష్యాలకనుగుణంగా లేవు. నదుల అనుసంధానంతో మెట్ట ప్రాంతాలను సశ్యశ్యామలం చేస్తామంటూ సర్కారు పలు ప్రతిపాదనలను తెరమీదకి తీసుకురాగా వాటికి మోడీ సర్కారు హాయంలోని చివరి బడ్జెట్‌లో పెద్దగా చోటు కల్పించలేదు. ఉత్తరాదిలోని గంగా నదిని దక్షిణాదిలోని కావేరికి అనుసంధానం చేస్తామని ఇటీవలే బిజెపి సర్కారు ప్రచారంలోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే రాష్ట్రాలు కలిసి కూర్చొని చర్చించాలని సలహా ఇచ్చింది. నదుల అనుసంధానికి రూ.వేలా ది కోట్లు కావాలి. అంతలోనే పలు జల రవాణా ప్రాజెక్టులను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. అలాగే పోలవరం సహా పలు జాతీయ ప్రాజెక్టులు, గంగా నది ప్రక్షాళన వంటి కార్యక్రమాలపై ప్రచారం చేస్తోంది. అయితే ఆ హామీలకనుగుణంగా జలవనరుల శాఖ కేటాయింపులు లేవు. గతం కంటే కేటాయింపులు పెంచినట్లు కనిపిస్తున్నా ప్రభుత్వం ప్రతిపాదించిన అవసరాలకు అవి ఏ మాత్రం సరిపోవు. జలవనరుల శాఖ 2016-17 బడ్జెట్‌లో రూ.4,714 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు తేలాయి. ఇక 2017-18లో ఆ శాఖకు రూ.6,887 కోట్లు ప్రతిపాదించగా సవరించిన అంచనాల మేరకు రూ.7,660 కోట్లకు పెరిగింది. కాగా 2018-19 బడ్జెట్‌లో రూ.8,860 కోట్లు ప్రతిపాదించారు.

విద్యకు అరకొర నిధులే

- నిరాశపర్చిన కేంద్రం
- పెదవి విరుస్తున్న విద్యావేత్తలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కేంద్రబడ్జెట్‌లో విరివిగా కేటాయింపులు ఉంటాయని భావించిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం షాకిచ్చింది. అరకొర కేటాయింపులతో తీవ్ర నిరాశకు గురి చేసింది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఉన్నత విద్యకు సైతం చివరికి మొండిచేయే చూపించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపి విద్యా రంగానికి ఏమాత్రం చేయూతనివ్వలేదు. గతేడాది మాదిరిగానే అరకొర కేటాయింపులే తప్ప, ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో కేటాయించకపోవడం గమనార్హం. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ ఎంపీలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులు ప్రధాని నరేంద్ర మోడితో జరిపిన చర్చలతో ఈసారి బడ్జెట్ అనుకూలంగా ఉండబోతోందని, ఇబ్బడిముబ్బడిగా కేటాయింపులు ఉంటాయని ప్రచారం జరిగింది. తాము అడిగిన వాటిలో కొన్నైనా నెరవేరుతాయని భావించారు. కానీ కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అదనంగా ఒక్క కొత్త ప్రాజెక్టూ దక్కలేదు. ప్రతి ఏటా ఇచ్చినట్లుగానే ఈసారి కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీకి రూ.32 కోట్లు, సెంట్రల్ యూనివర్శిటీకి రూ.10 కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.10 కోట్లు, ఎన్ఐటికి రూ.54 కోట్లు, ఐఐటీకి రూ .50 కోట్లు, ట్రిపుల్ ఐటీకి రూ.30 కోట్లు, ఐఐఎమ్‌కి రూ.42 కోట్లు, ఐఐఎస్‌సిఆర్‌కి రూ.49 కోట్లు కేటాయించారు. విద్యా సంస్థల ఏర్పాటుకు సంబంధించి అంచనా వ్యయానికీ, కేటాయింపులకూ పొంతన లేకుండా పోయింది. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే పెద్దగా కేటాయింపులు జరపకపోగా, భారీగా కోత విధించారు. గిరిజన, పెట్రో వర్సిటీలకు గతేడాది కేటాయింపుల కంటే అత్యంత తక్కువగా కేటాయించారు. గిరిజన యూనివర్సిటీకి గతేడాది బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది బడ్జెట్‌లో కోత విధించి, రూ. 10 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక పెట్రో యూనివర్సిటీకి గతేడాది బడ్జెట్‌లో రూ.135.10 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కేవలం రూ.32 కోట్లు మాత్రమే కేటాయించారు. తిరుపతి ఐఐటీకి 2016-17 బడ్జెట్‌లో రూ. 40 కోట్లు కేటాయిస్తే..2017-18 బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారు. ఇదే సమయంలో ట్రిపుల్ ఐటీకి కేటాయింపుల్లోనూ మార్పు లేదు. 2016-17లో రూ.20 కోట్లు కేటాయిస్తే 2017-18 బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించారు.

ఇక అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఐఎస్ఈఆర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1500 కోట్లు కాగా, 2016-17 బడ్జెట్‌లో రూ.40 కోట్లు, 2017-18లో రూ.50 కోట్లు కేటాయించారు. ఎన్ఐటి ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.400 కోట్లు కాగా, 2016-17 బడ్జెట్‌లో రూ.40 కోట్లు, 2017-18 బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారు. ఐఐఎంకు 2016-17లో రూ.30 కోట్లు, 2017-18లో రూ.40 కోట్లు కేటాయించగా, ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.900 కోట్లుగా ఉంది. కేంద్రీయ విశ్వ విద్యాలయంకు గతేడాది మాదిరిగానే ఈ ఏడాది బడ్జెట్‌లోనూ రూ.10 కోట్లు కేటాయించారు.

ఏపికి మళ్లీ అన్యాయం

మొదటి పేజీ తరువాయి

అవకాశముంది. ఓబులాపురం నుంచి వెంకటాచలం వరకు కొత్త రైల్వే లైన్‌ను ప్రకటించారు.

ఏపి వాటాకు రూ.849 కోట్ల లోటు

కేంద్ర పన్నుల్లో వాటాగా ఆంధ్రప్రదేశ్‌కు 2018-19వ సంవత్సరానికి రూ. 33,929.84 కోట్లు దక్కనున్నాయి. ఇక తెలంగాణకు రూ.19,207.43 కోట్లు కేంద్రం ఇవ్వనుంది. ప్రతి ఏడాది రాష్ట్రాల నుంచి వసూలైన కేంద్ర పన్నుల మొత్తంలో ఆయా రాష్ట్రాల వాటాను కేంద్ర ప్రభుత్వం తిరిగి ఇవ్వనున్న సంగతి తెలిసిందే. 14వ ఆర్థిక సంఘం సూచన మేరకు రాష్ట్రాల నుంచి వసూలైన కేంద్ర పన్నుల రాబడిలో 42 శాతం వాటాను ఆయా రాష్ట్రాలకు తిరిగి ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రాలకు దక్కనున్న కేంద్ర పన్నుల వాటా మొత్తం జాబితాను వెల్లడించారు. వరుసగా ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా తరువాత స్థానంలో ఏపి ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన కేంద్ర పన్నుల రాబడిలో కార్పొరేట్ పన్ను మొత్తం రూ.9526 కోట్లు కాగా, ఆదాయ పన్ను మొత్తం రూ.8430 కోట్లు, కేంద్ర జిఎస్‌టి మొత్తం రూ.10,919 కోట్లు, సుంకాల మొత్తం రూ.1671 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ పన్నులు రూ.1628 కోట్లు. ఇందులో 2016-17 సంవత్సరం అంచనాలతో పోలిస్తే. రూ. 849 కోట్లు లోటు కనిపిస్తున్నది.


ఈ బడ్జెట్ నిరాశ కలిగించింది : సుజనా చౌదరి, కేంద్ర మంత్రి

కేంద్ర బడ్జెట్లో ఏపికి ఎలాంటి ప్రత్యేకత చూపలేదని, ఈ బడ్జెట్ చాలా నిరాశగా ఉందని కేంద్ర మంత్రి సుజనా చౌదరి విమర్శించారు. రెవిన్యూ లోటు, అమరావతికి నిధులు వంటి అంశాల ప్రస్తావన లేకపోవడం విచారం కలిగించిందని ఆవేదన చెందన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌కి నిధుల సమీకరణ నాబార్డు ద్వారా ఏర్పాటు చేశారు..కానీ నిధుల ప్రవాహమేమీ చెప్పుకోదగిన రీతిలో లేదన్నారు. ఎక్కడెక్కడో మెట్రోలు ఇచ్చారు కానీ విజయవాడ, విశాఖపట్నం నగరాలకు మెట్రో ప్రస్తావన లేదని మండిపడ్డారు. ఓవరాల్‌గా ఈ బడ్జెట్ మీద నిరాశగా ఉన్నామని చెప్పారు. తమ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చెప్పినట్టు తాము నడుచుకుంటామని వివరించారు. మా అధ్యక్షుడు చంద్రబాబుతో సమావేశం తర్వాత కార్యాచరణ నిర్ణయిస్తామని వెల్లడించారు. రైల్వే జోన్ తీసుకొచ్చి తీరుతామని, దీన్ని వదులుకోమని వ్యాఖ్యానించారు. ఎంపి జెసి దివాకరరెడ్డి మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో ఏపికి మూడు నామాలు పెట్టినట్టుందని టిడిపి ఎంపి జెసి దివాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్థాయిని మరిచి.. కేంద్రం చుట్టూ తిరిగినా ప్రయోజన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. "నాకు 40 ఏళ్లుగా రాజకీయాలతో సంబంధం ఉంది. ఇంత ఘోరమైన బడ్జెట్ నేను చూడలేదు. ఏపికి బిజెపి ఆర్థికంగా నష్టం చేస్తోంది. తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చలేదు. అడిగిన దానికీ కేంద్రం ఇచ్చిన దానికీ ఎక్కడా పొంతన లేదని ఎంపి రామ్మోహన్‌నాయుడు అన్నారు. రాష్ట్రానికి ఎన్నో హామీలు ఇచ్చి వాటిని తుంగలో తొక్కారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావన లేదని అనకాపల్లి ఎంపి అవంతి శ్రీనివాస్ అన్నారు. మేం మిత్రపక్షంగా ఉన్నాం. పోటీ చేశాం. ఢిల్లీకి 42 సార్లు చంద్రబాబు వచ్చి కేంద్ర మంత్రులతో కలిసి విన్నవించినా పట్టించుకున్నట్టు కనబడలేదు.

నష్టం జరగలేదు : కె.హరిబాబు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు

కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చే విధంగా ఉందని బిజెపి ఎంపి హరిబాబు వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై స్పందించిన ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి నష్టం జరగలేదన్నారు. విభజన చట్టంలోని పేర్కొన్న ఐదు సంస్థలు రావాల్సి ఉందని, సెంట్రల్, గిరిజన వర్శిటీలకు నిధులు కేటాయించారని, విభజన చట్టంలో రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపైనే జైట్లీ ప్రస్తావించారని హరిబాబు పేర్కొన్నారు. అధికారుల నివేదికతో సంబంధం లేకుండా రైల్వేజోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తామన్నారు. ఏపి విభజన చట్టంలో ఇంకా ఐదు హామీలు మాత్రమే చేయాల్సి ఉందని, అందులో గిరిజన యూనివర్శిటీ, సెంట్రల్ యూనివర్శిటీ, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ అని తెలిపారు. మిగిలిన వాటిపై కేంద్రం చొరవ తీసుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర వేసిన అధికారుల కమిటీ జోన్ ఏర్పాటుకు సానుకూల నివేదిక ఇవ్వలేదని హరిబాబు అన్నారు.

పథకం	2017-18	2017-18	2018-19
జాతీయ సామాజిక భద్రతా పథకం	9500	8745	9975
మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ	48000	55000	55000
ఎస్సీ అభివృద్ధి	5114	5114	5183
ఎస్టీ అభివృద్ధి	3490	3512	3806
మైనార్టీల అభివృద్ధి	4072	4075	4580
ఇతర వెనుకబడిన తరగతుల అభివృద్ధి	1580	1630	2287
హరిత విప్లవం	13741	11185	13909
శ్వేత విప్లవం	1634	1633	2220
నీలి విప్లవం	401	302	643
ప్రధానమంత్రి కృషి యోజన	7377	7392	9429
ప్రధానమంత్రి గ్రామ్‌సడక్ యోజన	19000	16900	19000
ప్రధానమంత్రి అవాస్ యోజన	29043	29043	27505
నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ మిషన్	6050	7050	7000
స్వఛ్ భారత్	16248	19248	17843
నేషనల్ హెల్త్ మిషన్	27131	31292	30634
జాతీయ విద్య	29556	29556	32613
మధ్యాహ్నభోజనం	10000	10000	10500
ఐసిడిఎస్	20755	19963	23088
మహిళాసాధికారత	1089	988	1366
నేషనల్ లైవ్లీహుడ్ మిషన్	4849	4699	6060
ఉద్యోగకల్పన–నైపుణ్యాభివృద్ధి	4089	2905	5071
పర్యావరణ పరిరక్షణ, అటవీశాఖ	962	975	1019
అమృత్, స్మార్ట్ సిటీలు	9000	8999	12169
పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ	2022	2577	3177
శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్	1000	600	1200
రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన	1000	471	2000
కేంద్ర ప్రభుత్వ పథకాలు			
పంటల బీమా	9000	10698	13000
స్వల్పకాల వ్యవసాయ రుణాల వడ్డీ సబ్సిడీ	15000	14750	15000
వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, సంస్థలు	663	658	685
నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్	1032	797	1097
ధరల స్థిరీకరణ నిధి	3500	3500	1500
డిజిటల్ చెల్లింపుల ప్రచారం		25	596
ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన	3975	3175	3825
మెట్రో ప్రాజెక్టులు, ఎంఆర్‌టిఎస్	18000	18000	15000
ఎంప్లాయిస్ ఫించన్ పథకం(1995)	4771	5111	4900
పేదలకు ఎల్‌పిజి కనెక్షన్	2500	2252	3200
బయోటెక్నాలజీ పరిశోధన	1251	1252	1350
సాగరమాల	600	480	600
జాతీయ నదీ సంరక్షణ పథకం	250	723	770



సిన్సియర్ సైనికుడు

'సరైనోడు'లో అల్లు అర్జున్ ఓ పాటలో సైనికుడి గెటప్‌లో కన్పిస్తాడు. ఆ సీన్ రాబోయే సినిమా క్యారెక్టర్ అన్నట్లు చూపించిన అర్జున్ తాజాగా 'నాపేరు సూర్య'లో అటువంటి పాత్రనే పోషించాడు. అయితే ఈ పాత్ర కోసం తను ఎంత కష్టపడింది ఫొటోలను చిత్ర యూనిట్ విడుదల చేసింది. సైనికుడు చేయాల్సిన విధివిధానాలు, శిక్షణ ఎలా వుంటుందో కొన్ని సన్నివేశాలు చూపించారు. ఇవి గతంలో కొన్ని చిత్రాల్లో చూపించినవే అయినా.. ఇవి సిన్సియర్‌గా అల్లు అర్జున్ చేశాడని చిత్ర బృందం చెబుతోంది. కాగా, అసలు ఈ చిత్ర కథ కాపీ కథ అనే చర్చ మొదలైంది. రచయిత వక్కంతం వంశీ డైరక్టర్‌గా మారి చేస్తున్న 'నా పేరు సూర్య' 2002లో "ఫైండింగ్ ఫిష్" అనే నవల స్ఫూర్తిగా తీయబడిన "యాంట్ వోన్ ఫిషర్" అనే సినిమా కథ ఆధారంగానే కథ అల్లుకున్నట్లు వార్తలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. "నిగ్రహం అనే పదానికి అర్ధమే తెలియని ఒక యువకుడు అతని కోపం కారణంగా సైన్యంలో కొన్ని శిక్షలకు గురవుతాడు. అతని కోపంపై ఉన్న ఫిర్యాదులతో ఒక సైక్రియాటిస్ట్ వద్దకు పంపిస్తారు. అతడి వద్ద ఆ యువకుడుని వైద్యం చేయించుకోమంటారు. ఆ సైక్రియాటిస్ట్ ఆ యువకుడి తండ్రి కావడం, అతడు ఆ యువకుడుకి ఎటువంటి జబ్బు లేదని క్లీన్ సర్టిఫికేట్ ఇవ్వడానికి నిరాకరిస్తాడు".. ఇదే మూల కథకు స్వల్ప మార్పులు చేశారని కొంతమంది పోస్టులు చేస్తున్నారు. నా పేరు సూర్య ఫస్ట్ ఇంపాక్ట్‌లో అల్లు అర్జున్ పాత్రకు ఈ కథలోని పాత్రకు మ్యాచ్ కావడంతో ఈ వార్తలు నిజమేమోనని మాట్లాడుకుంటున్నారు. దీనిపై గురువారంనాడు నా పేరు చిత్ర బందం స్పందించింది. తమది ఏ చిత్రానికి కాపీ కాదని స్పష్టం చేసింది. కథపై ఎవరూ ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని సూచించింది.



జెమినీ కిరణ్, డి.సురేష్‌బాబు, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, దక్షిణాదికి చెందని మూడు రాష్ట్రాల ఛాంబర్ అధ్యక్ష కార్యదర్శులు.

ఇది మరో ఈస్ట్ ఇండియా కంపెనీ

డిజిటల్ ప్రొవైడర్లపై ఫిల్మ్ ఛాంబర్స్ విమర్శ

టెక్నాలజీ పేరుతో డిజిటల్ ప్రొవైడర్లు నిర్మాతలపై భారీగా ఛార్జీలు వసూలు చేయడాన్ని ఇది మరో ఈస్ట్ ఇండియా కంపెనీ చర్యగా ఛాంబర్ పోల్చింది. దేశం మొత్తంగా ఈ విధానం అమలు జరిగితే నిర్మాత సినిమాలు తీయలేరని తేల్చిచెప్పింది. అత్యవసరంగా హైదరాబాద్‌లోని ఛాంబర్ కార్యాలయంలో దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల ఛాంబర్ కార్యవర్గం సమావేశమైంది.

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షులు పి. కిరణ్, కార్యదర్శులు ఎమ్ . రామదాసు, కె. శివప్రసాదరావు, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు కె. మురళీ మోహన్, సెక్రటరీ సునీల్ నారంగ్, దక్షిణాది ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు ఎల్. సురేష్, జాయింట్ సెక్రటరీ శ్రీ రవి కొట్టరాకర, తమిళ సినిమా నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్ కష్ణ, సెక్రటరీ కతీర్ సేన్, కర్ణాటక ఫిలిం ఛాంబర్ సెక్రటరీ ఎన్.ఎమ్ సురేష్, కేరళ ఫిలిఛాంబర్ అధ్యక్షులు కె. విజయ్ కుమార్, కేరళ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంఘం అధ్యక్షులు సియ్యాద్ కొక్కెర, కేరళ ఫిలిం నిర్మాతల సంఘం అధ్యక్షులు జి. సురేష్ కుమార్, నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు తదితరులు కలిసి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ తీసుకుంటోన్న ఏకపక్ష నిర్ణయాల గురించి చర్చించేందుకు హైదరాబాద్‌లోని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమైంది.

ఈ సమావేశంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారు వసూలు చేయుచున్న ఛార్జీల గురించి మన సినిమా ప్రతిఫలం మనం అందుకోకుండా ఎక్కడినుంచో వచ్చిన డిజిటల్ ప్రొవైడర్స్ అన్యాయంగా దోచుకుంటున్నారని అందరూ అభిప్రాయపడ్డారు. ఈస్ట్ ఇండియా కంపెనీలా తయారై అధికంగా డబ్బు గుంజుతున్నారని అందరూ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారిని రాకుండా ఆపేస్తున్నారని సభ్యులదరూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారితో ఒక వారంలోగా సమావేశం ఏర్పాటు చేసి ధరల తగ్గింపు ఇతరత్ర విషయాలపై చర్చించేందుకు నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులందరూ ముక్తకంఠంతో ఒక వారం రోజులు లోపుగా ఈసమస్యకు పరిష్కారం లభించనియెడల ఈ ఏడాది మార్చి1 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని థియేటర్లను మూసివేయుటకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని... ఛాంబర్ సమావేశం అనంతరం ప్రకటన విడుదల చేశారు.



మోహన్ బాబు

సెన్సారైన 'గాయత్రి'

డా. మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'గాయత్రి' చిత్రం గురువారంనాడు సెన్సార్స్ కార్యక్రమాలు పూర్తిచేసుకొంది. ఈనెల 9న విడుదలకు సిద్ధంగా ఉంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తుంది. మోహన్ బాబు ఇంటెన్స్ లుక్, పవర్‌ఫుల్ డైలాగులతో కూడిన ట్రైలర్ చిత్రంపై ఆసక్తిని పెంచేశాయి. ఎస్.తమన్ స్వరపరిచిన పాటలకు విశేష స్పందన వస్తుంది. కాగా, విష్ణు మంచు ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపించనుండటం చిత్రానికి మరో హైలైట్. శ్రియ ఆయన సరసన నటిస్తోంది. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిఖిల విమల్, అనసూయ భరద్వాజ్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పై నిర్మించగా అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. కథ-మాటలు: డైమండ్ రత్న బాబు, ఛాయాగ్రహకుడు: సర్వేశ్ మురారి.

హార్డ్ వర్క్‌కు నిదర్శనం

రామ్ చరణ్ ప్రస్తుతం 'రంగస్థలం' చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు. మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కబోతోంది. రామ్ చరణ్‌కు జోడీగా సమంత నటిస్తోంది. శరవేగంగా ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. అయితే, చేతికి కట్టు కట్టుకుని ఉన్న ఆమె ఫొటోలు బయటకు వచ్చాయి. కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు రామ్ చరణ్ ఇంట్రడక్షన్ సాంగ్‌ను ఇటీవలే రాజమండ్రి షెడ్యూల్‌లో పూర్తి చేశారు. ఈ షెడ్యూల్ అంతా చాలా టైట్‌గా కొనసాగింది. నేపథ్యంలో, హెవీ వర్క్ వల్ల సమంతకు చేయి నొప్పి అనిపించిందట. అందుకే రిలీఫ్ కోసం ఆమె చేతికి కట్టు కట్టించుకుంది. దీనిపై సమంత కూడా స్పందించింది. 'చాలా హార్డ్ వర్క్ చేస్తున్నాం. దీనికి నా చెయ్యే నిదర్శనం' అని ఆమె తెలిపింది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మార్చి 30న విడుదల చేయాలని భావిస్తున్నారు.



సమంత

మనం ఊహించని విధంగా జరుగుతుంటే 'అ!' అంటూ ఆశ్చర్యంతో చూస్తాం.. కథప్రకారం చూసే ప్రేక్షకుడు తప్పకుండా అలా ఫీలవుతాడని... టైటిల్‌ను 'అ!' అని పెట్టామని.. చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలియజేశారు. హీరో నాని సమర్పకుడిగా వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి త్రిపిరినేని నిర్మిస్తున్నారు. ఇందులో ప్రముఖహీరోయిన్లు కాజల్ అగర్వాల్, రెజీనా కసండ్ర, ఈషా రెబ్బా, నిత్యామీనన్ నటించడం విశేషం. తామంతా కథలో వున్న ప్రత్యేకతను దృష్టా నటించామని వారు పేర్కొన్నారు. చిత్రీకరణ ముగిసి, నిర్మాణానంతర కార్యక్రమాలు ముగింపుదశలో వున్నాయి. ఈనెల 16న సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

ఈషా రెబ్బా మాట్లాడుతూ...కొత్త రకమైన సినిమా ఇది. అన్ని రకాల అంశాల కలయికలో ఉండే సినిమా. నానిగారు నన్ను అప్రోచ్ అవగానే..కథ విని చాలా ఎగ్జయిట్ అయ్యాను. నటిగా డిఫరెంట్ పాత్రలు చేయాలనుకుంటున్న సమయంలో ఇలాంటి సినిమా. ఈ సినిమాలో పార్ట్ కావడం చాలా ఎగ్జయిట్‌గా అనిపించింది. తెలుగులో ఇలాంటి సినిమా రావడం మంచి విషయం. నేను, నాని టామ్ అండ్ జెర్రీలా పోట్లాడుకునేవాళ్లం అని పేర్కొన్నారు.

రెజీనా కసండ్ర మాట్లాడుతూ... ప్రశాంత్ కథ చెప్పగానే నేను విజువలైజ్ చేశాను. క్యారెక్టర్ ఎలా ఉంటుందో తెలియడంతో.. నాకు ఈ క్యారెక్టరే కావాలని తనతో అన్నానని తెలిపారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ... చాలా కొత్త కథ. నా కెరీర్‌లో కొత్త చేసిన పాత్ర ఇది. ఎంటర్‌టైనింగ్‌తో పాటు సినిమాలో మంచి మెసేజ్ కూడా ఉంది. ప్రశాంత్ వర్మ కథ చెప్పగానే వెంటనే చేయడానికి అంగీకరించాను. ప్రతి క్యారెక్టర్‌ను డిటెయిల్డ్‌గా తను డిజైన్ చేశాడు' అన్నారు.

నాని మాట్లాడుతూ...ఇదొక తిక్క సినిమా. మన అందరిలో కాస్త తిక్క ఉంటుంది. ఆ తిక్కను శాటిస్‌ఫైచేసే సినిమా ఇది. ప్రశాంత్ కథ చెప్పగానే, నాకు కొత్తగా అనిపించింది. సరిగ్గా 'నిన్నుకోరి'లో 'అడిగా అడిగా..' సాంగ్ పాడే సమయంలో

'అ!' అనిపించేలా ఉంటుంది



కాజల్ అగర్వాల్, నిత్యామీనన్, రెజీనా, ఈషారెబ్బా తదితరులు

పాత్ర రావడంతో థ్రిల్ అయ్యాను. ఇప్పటి వరకు నేను చేసిన నా పాత్ర కొత్తగా ఉంటుంది. తెలుగులోనే నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది' అన్నారు.

నిత్యామీనన్ మాట్లాడుతూ... రొమాన్స్, సైన్స్ ఫిక్షన్, లవ్, హారర్, థ్రిల్లర్ సహా అన్నీ ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. ప్రశాంత్ వండర్‌ఫుల్ స్టోరీతో చేసిన ప్రశాంత్ కనపడ్డాడు. లిరిక్స్ మరచిపోయాను. కథ విన్నాను. నేనే ప్రొడ్యూస్ చేస్తున్నాను అని చెప్పాను. నిత్యామీనన్ గురించి చెప్పాలంటే.. నా ప్రొడక్షన్‌లో నిత్యా చేయడం ఆనందంగా ఉంది. తన పాత్ర థ్రిల్‌గా ఉంటుంది. అలాంటి పాత్రను ఎవరూ రివీల్ చేయరు. సినిమా మొన్ననే చూశాను, చాలా గర్వంగా ఫీలయ్యానని అన్నారు.

'రాజరథం'లో 'నీలిమేఘుమా

'రాజరథం' టీం మరో పాటని విడుదల చేసింది. ఏ ఆర్ రెహమాన్, హారిస్ జైరాజ్, మిక్కీ జే మెయెర్ సారధ్యంలో పాడిన అభయ్ జోద్పుర్కర్ ఈ పాటకి స్వరాన్ని అందించారు. హీరో నిఖిల్ విడుదల చేసిన ఈ పాట మాల్షేజ్ ఘాట్, మహాబలేశ్వర్ వంటి అద్భుత ప్రదేశాల్లో చిత్రీకరణ జరుపుకుంది. అద్భుతమైన పద ప్రయోగంతో సాగే ఈ పాటని రెండు రకాలుగా అన్వయించుకునేలా రాయడం విశేషం. భూమి, ఆకాశం, సూర్యుడిని ఉద్దేశించినట్లు కనిపించినా అంతర్లీనంగా సినిమాలో మూడు ముఖ్య పాత్రలు అభి, మేఘ, సూరజ్‌లకి అన్వయించుకునేలా ఉంటుంది. ఈ పాటని దర్శకుడు అనూప్ భండారి స్వరపరచగా రామజోగయ్యశాస్త్రి సాహిత్యాన్ని అందించారు. ఈ పాట కోసం ప్రఖ్యాత నిపుణులు చెన్నై ఆర్కెస్ట్రా, సాక్స్ రాజ, కొరియోగ్రాఫర్ బొస్కో సీజర్ వంటి వారు పనిచేయడం విశేషం. రాజ్ పొద్దార్ ప్రొడక్షన్ డిజైన్, విలియం డేవిడ్ కలర్ ఫుల్ ఫోటోగ్రఫీతో ఈ పాట చాలా అందంగా కనిపిస్తుంది. మంచి ఫీల్‌తో, అచ్చ తెలుగు పదాలతో అందంగా చిత్రీకరించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకునేలా రూపొందింది. నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య, రవిశంకర్ ప్రధాన పాత్రల్లో టైటిల్ పాత్రలో కనిపించే రానా దగ్గుబాటితో రొమాంటిక్ కామెడీగా రూపొందించబడిన ఈ 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా ఈనెల 16న విడుదలకి సిద్ధమవుతోంది. అనూప్ భండారి దర్శకత్వంలో జాలి హిట్స్ ప్రొడక్షన్స్ బేనర్‌లో అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి నిర్మాతలుగా చిత్రాన్ని రూపొందించారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న 'రాజరథం' చిత్రంలో నిరూప్ భండారి, అవంతిక శెట్టి, పి.రవిశంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అజనీష్ లోక్‌నాథ్, ఎడిటింగ్: శాంతకుమార్, సినిమాటోగ్రఫీ: విలియమ్ డేవిడ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుధాకర్ సాజ, నిర్మాణం: జాలీహిట్స్ టీమ్, అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి, సంగీతం, స్క్రీన్‌ప్లే, రచన, దర్శకత్వం: అనూప్ భండారి.



రాజారథంలో దృశ్యం

పోస్ట్ ప్రొడక్షన్‌లో 'ఒక్కటే లైఫ్'

సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా శ్రుతి యుగల్ హీరోయిన్‌గా నటిస్తోన్న చిత్రం 'ఒక్కటే లైఫ్'. లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తోన్న చిత్రమిది. 'హ్యాండిల్ విత్ కేర్' అనేది ఉప శీర్షిక. ఎం.వెంకట్ దర్శకుడు. సుమన్ ప్రధాన పాత్రలో కన్పించనున్నారు. చిత్రీకరణ పూర్తయి పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది.

దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ.. టైటిల్ చూడగానే సినిమా కాన్సెప్ట్ ఎంటనేది అందరికీ అర్ధమవుతుంది. టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోన్న నేటి తరం హ్యూమన్ రిలేషన్స్‌కు ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న చిత్రమిది. సినిమాలోని ప్రతి పాత్రా కథకు అనుగుణంగానే వుంటాయని తెలిపారు. నిర్మాత నారయణ్ రామ్ మాట్లాడుతూ.. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అతి త్వరలోనె సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తామన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అమ్రీష్, కూర్పు: నందమూరి హరి, కెమెరా: వై.గిరి, రచన: సతీష్ బండోజీ.



జితన్, శ్రుతియుగల్

ప్రతిభావంతుడికి సాయిధరమ్ తేజ్ సాయం

సూర్యాపేట జిల్లాకు చెందిన రంగుల నరేష్ యాదవ్ దివ్యాంగుడు. అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికైనా అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేక పారా అథ్లెట్ నరేష్ అనేక ఇక్కట్లు పడుతున్నాడు. గతనెల 31న ఓ ప్రముఖ పత్రికలో వచ్చిన కథనం చదవి వెంటనే హీరో సాయిధరమ్ తేజ్ స్పందించారు. గురువారం నరేశ్ యాదవ్‌కు లక్ష రూపాయిల చెక్కును స్వయంగా అందజేశారు. అనంతరం నరేష్ గురించిన వివరాలు, వాలీబాల్ ప్రాక్టీస్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించాలని కోరుతూ నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నప్పుడే నరేష్ ఎడమ కాలికి పోలియో సోకింది. వైకల్యాన్ని అధిగమించి ఎంతో పట్టుదలతో పారా అథ్లెట్‌గా అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఒకవైపు ఎంటెక్ చదువుతూనే పారా బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్ మూడింటిలోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. క్రీడా అధికారులతో పాటు దాతలు ఎవరైనా సాయం చేస్తే బ్యాంకాక్ వెళ్లి టోర్నీలో సత్తా చాటుతానని నరేష్ చెబుతున్నాడు. తనకు సాయం చేయాలనుకునే వారు 96665 93696, 97002 85868 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కథనానికి స్పందించి నరేష్ బ్యాంకాక్ ప్రయాణంతో పాటు వీసా, లైసెన్స్, ఎంట్రీ ఫీజు, ఏడు రోజులకుగాను భోజన వసతి, స్పోర్ట్స్ కిట్, కోచింగ్ ఫీజులకు సహాయం చేసిన సాయిధరమ్‌కు నరేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.





ప్రభాస్ శ్రీను

చిరంజీవికి డూప్‌గా చేశా

హీరో ప్రభాస్ చిన్ననాటి స్నేహితుడిగా ఉన్న శ్రీను.. ప్రభాస్ శ్రీనుగా సినిమారంగంలో పిలవబడుతున్నాడు. ప్రభాస్ నటించే సినిమాల్లో ఏదో ఒక పాత్రలో అలరించే శ్రీను ఓసారి చిరంజీవికి డూప్‌గా చేయాల్సి వచ్చిందట. ఇటీవలే ఆ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. 'మగధీర' సినిమాలో చిరంజీవిగారికి నేను డూప్‌గా చేశాను .. అదో అదృష్టమనే చెప్పాలి. ఓ రోజున తెల్లవారు జాము వరకూ ప్రభాస్ ఇంట్లో వాలీబాల్ ఆడేసి వచ్చాను. అప్పుడే రాజమౌళిగారి నుంచి ఫోన్ కాల్ వచ్చింది". 'చిరంజీవిగారికి డూప్‌గా కనిపించాలి చేస్తావా?' అని అడిగారు. 'చేస్తావా ఏంటి సార్ .. ఇప్పటికిప్పుడు వచ్చేస్తాను' అన్నాను. 'అయితే అల్యూమినియం ఫ్యాక్టరీకి వచ్చేసేయ్' అని అన్నారు. చిరంజీవి గారు వేసుకునే డ్రెస్ వంటిదే నాకు వేసి .. కొన్ని డూప్ షాట్స్ తీశారు. చిరంజీవి గారిది .. నాది ఒకటే డ్రెస్. సేమ్ డ్రెస్‌లో సెట్లో ఆయనకి ఎలా ఎదురుపడేది? అందువలన చిరంజీవిగారికి కనిపించకుండా తప్పించుకుని తిరిగేవాడిని" అని చెప్పుకొచ్చారు.

అగ్రిప్లస్



కొత్తగా ఆశిస్తున్న సర్పిలాకార తెల్లదోమ

మన రాష్ట్రంలో కొబ్బరిని ఆశిస్తూ ఎక్కువ నష్టం కలిగిజేస్తున్న పురుగుల్లో నల్లముట్టెపురుగు, కొమ్ము పురుగు, ఎర్రముక్కు పురుగు, ఇరియోఫిడ్ నల్లి ముఖ్యమైనవి. కానీ ఇటీవల కాలంలో మన దేశంలో, రాష్ట్రంలో అంచలంచెలుగా విజృంభిస్తూ, అటు శాస్త్రవేత్తలల్లో, రైతుల్లో ఆందోళన కలుగజేస్తున్న కొత్త పురుగు సర్పిలాకార తెల్లదోమ. ఈ తెల్లదోమ కొబ్బరి తోటలనూ, అరటి, ఆయిల్‌పామ్, పనస, బొప్పాయి, సీతాఫలం మాత్రమే కాకుండా అలంకార జాతికి చెందిన 200 రకాల మొక్కలను ఆశిస్తుంది. దీని గురించి హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రధాన శాస్త్రవేత్త అందిస్తున్న వివరాలు తెలుసుకుందాం.

ఈ సర్పిలాకార తెల్లదోమ అల్యురోడికస్ రుగ్యంపరక్యూలేటస్ అనే శాస్త్రీయ నామంతో పిలవబడే, అల్యురోడిస్ అనే కుటుంబానికి చెందింది. దీన్ని మొదటిసారి ఉత్తర అమెరికా ఖండంలోని దక్షిణ ఫ్లోరిడారాష్ట్రంలో 2009లో గుర్తించారు. మనదేశంలో మొట్టమొదటిసారిగాజులై 2016 తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొల్లాచ్చి, కేరళ రాష్ట్రానికి చెందిన పాలక్కడ్ ప్రాంతాల్లో కొబ్బరిని ఆశించినట్లు గుర్తించారు.

పలు రకాల పంటలపై..

మన రాష్ట్రంలో ఈ సర్పిలాకార తెల్లదోమ డిసెంబరు 2016లో, తూర్పు గోదావరి జిల్లాలోని కడియం దగ్గర నర్సరీలలో గుర్తించారు. ఇటీవల జరిగిన సర్వేలో కడియపులంక, దామలచెరువు, పొట్టిలంక గ్రామాల చుట్టుపక్కల పలు తోటలను, పశ్చిమ గోదావరి జిల్లాలో కలవలపల్లి, చిక్కాల, కోరుమామిడి, నీలాద్రిపురం గ్రామాలలో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను ఆశించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పురుగు ఎక్కువగా పొట్టి రకం చెట్లలో వ్యాప్తిచెందుతుంది. దక్షిణ భారతదేశంలో కొబ్బరి కాకుండా జామ, అరటి, రామాఫలం, పనస, హెలికోనా, మామిడి మొక్కలైన 12 రకాల పంటల మీద ఆశిస్తుంది. అయితే వీటిలో ఒక్క అరటి మొక్కల మీద మాత్రమే రూగోస్ తెల్లదోమ తన పూర్తి జీవితచక్రాన్ని పూర్తిచేయగలదు.

లక్షణాలు

- ఆకుల అడుగుభాగాలపై సర్పిలాకార తెల్లటి వలయాలను ఏర్పరుస్తుంది. ఈ వలయాలపై తెల్లని మైనపు పూత కప్పబడి ఉంటుంది.
- తేనెలాంటి జిగురు పదార్థం ఈ ఆకుల అడుగుభాగం నుంచి కింద ఆకులపై పడుతుంది.
- కింద ఆకులపైన జిగురు పదార్థంపై మసిపూసినట్లు నల్లటిపొర ఏర్పడుతుంది.

నష్టం

- ఈ తెల్లదోమ మొక్కల ఆకుల కింద ఆశించి, రసాన్ని పీల్చి, తేనెలాంటి జిగురు పదార్థం విసర్జిస్తుంది.
- ఈ తేనెలాంటి జిగురు పదార్థం వల్ల కాప్నోడియం బూజు తెగులు నల్లని మసిలా వృద్ధి చెందుతుంది.
- ఆకులపై ఏర్పడిన మసి వల్ల కిరణజన్యసంయోగ క్రియకు ఆటంకం ఏర్పడుతుంది.

ఈ పురుగు వల్ల ఎంత మేరకు దిగుబడి తగ్గుతుందో ఇంకా నిర్ధారించలేదు.

జీవిత చరిత్ర

తల్లి పురుగులు ఆకుల అడుగు భాగంలో సర్పిలాకారంలో లేత గోధుమరంగు లేక ముదురు పసుపురంగులో ఉండే గుడ్లను పెడుతుంది. ఈ తెల్లపురుగు ఐదు దశల్లో వృద్ధి చెందుతుంది. ఇది మామూలు దోమ కన్నా ఐదు రెట్లు ఎక్కువ పెద్దదిగా ఉంటుంది. రెక్కలపై అంతటా సక్రమంగా లేత గోధుమరంగులో బ్యాండ్లు విస్తరించి ఉంటాయి. దీని జీవితచక్రం దాదాపుగా 30 రోజులలో పూర్తవుతుంది.



ఎన్‌కార్సియా గ్వడేలోపే

సమగ్ర యాజమాన్యం

- పసుపురంగు కలిగిన జిగురు అట్టలను చెట్లకు కట్టడం ద్వారా ఈ తెల్లదోమ జిగురు అట్టలకు అతుక్కుంటాయి.
- దీని మిత్ర పురుగైన ఎన్‌కార్సియా గ్వడేలోపే అనే బదనిక దీన్ని అదుపులో ఉంచుతుంది. ఈ పురుగుని ప్రయోగశాలలో ఉత్పత్తిచేసే అవకాశము లేనందువల్ల, సహజసిద్ధంగా ఎక్కడ ఈ మిత్ర పురుగులు అభివృద్ధి చెందినా కొబ్బరి తోటలో నుంచి సేకరించి, బదనికలు లేని తెల్లదోమ ఆశించిన ప్రాంతాలలో విడుదల చేయాలి. దాదాపుగా 6 నుంచి 8 నెలలలో ఈ పురుగులు తెల్లదోమను అదుపులోకి తీసుకువస్తాయి.
- రుగోస్ తెల్లదోమ మన దేశంలో చొరబడిన అన్యదేశ కీటకం కాబట్టి, దాన్ని గుర్తించి, పూర్తి సమాచారాన్ని రైతులకు, ఉద్యానవన విభాగం అధికారులకు తెలియజేయాలి.
- పురుగు స్థాయి ఎక్కువగా ఉన్నట్లయితే, అజాడిరక్టిన్ 10000 పిపిఎమ్ 1 మి.లీ. లేదా 0.5 శాతం వేపనూనెను 10 గ్రా. సర్ఫ్ 1 లీటరు నీటికి కలిపి ఆకు అడుగుభాగాలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.
- ఎటువంటి క్రిమి సంహారక మందులు తోటలలో పిచికారీ చేయకూడదు. ఈ పిచికారీ వల్ల తోటలలోని మిత్రపురుగులు నశిస్తాయి.
- మసిమంగు నివారణకు ఒక శాతం గంజి ద్రావణాన్ని మసి బూజు ఆశించిన భాగాలపై పిచికారీ చేయాలి.



జీవ నియంత్రణ పద్ధతి

ప్రిడేటర్స్ (పరాన్నభుక్కులు): ఈ తెల్లదోమను ఆశించే అనేక దేశీయ ప్రిడేటర్స్‌ను ఇప్పటికే గుర్తించారు. అందులో ముఖ్యంగా సుడోమల్లడా, సైబోసేఫలస్, డైడిఫ్లోసిస్, జరవియా పల్లిడ్చులో, స్కిమనస్ కోక్సివోరా మొదలగు ప్రిడేటర్స్‌ను గుర్తించారు. ఇందులో సుడోమల్లడా జీవులు, సెఫోసేపలస్ జీవులు అనేవి గమనించతగ్గ ప్రిడేటర్స్. కాక్సినెల్లిడే జాతికి చెందిన మరికొన్ని గుర్తించారు. అందులో కైలోకోరస్ నైగ్రాట, క్రిప్టోలెమస్ మాన్‌ట్రోజరి, స్కిమనస్ శోకిపోరమిస్, సోసోజిస్కిమనస్ ద్వీపకల్ప అనే మొదలగు ప్రిడేటర్స్‌నూ గుర్తించారు. వీటన్నింటినీ పరిరక్షించుకోవాలి.

పరాన్నజీవులు:

జామ పంటలో వచ్చే సర్పిలాకార తెల్లదోమను ఆశించి, దానిని నివారించే ఎన్‌కార్సియా గ్వడేలోపే అనే బదనికలు సర్పిలాకార తెల్లదోమను 60-70 శాతం వరకూ స్థంభింపచేయగలవు. అదేవిధంగా ఎన్‌కార్సియా డిస్‌పర్స అనే పరాన్నజీవి కూడా ఐదు శాతం వరకూ స్థంభింపచేయగలవు. ఇప్పటికే దక్షిణ భారతదేశంలో సర్పిలాకార తెల్లదోమను సమర్థవంతంగా నియంత్రిస్తున్న పరాన్నజీవి ఎన్‌కార్సియా గ్వడేలోపే. అంతేకాకుండా లియోచెర్ని అనే పురుగు ఆకులపైన మసిపూసిన నల్లటిపొరలను తింటుందని శాస్త్రవేత్తలు కేరళలోని కయంకుళం ప్రాంతంలో గుర్తించారు. మరలా ఈ ఆకులు రంగు యథాస్థానంలోకి వచ్చాయని తెలిపారు. కనుక ఈ పరాన్నభుక్కులు కానీ, పరాన్నజీవులుగానీ ఎక్కువగా అభివృద్ధి చెందడానికి ఎటువంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదు. హానికరమైన మందులు పిచికారీ చేయడం వల్ల పరాన్నభుక్కులు, పరాన్నజీవులకు అపారనష్టం కలిగి, తెల్లదోమ నివారించడం కష్టసాధ్యమవుతుంది.

అవగాహన

- ఈ తెల్లదోమ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చాలా తొందరగా గాలి ద్వారా వ్యాప్తిచెందుతుంది. అంతేగాక తెల్లదోమ సోకిన మొక్కలు ఒకచోట నుంచి మరొకచోటికి తరలించడం ద్వారానూ వ్యాప్తి చెందుతుంది. కాబట్టి సరైన బదనికలను గుర్తించి, వాటిని ఎక్కువ సంఖ్యలో అభివృద్ధి చేసి, తద్వారా జీవనియంత్రణ పద్ధతిలో నివారణ చేయడం చాలా ముఖ్యం.
- ఎన్‌కార్సియా జాతి బదనికలు అధిక సంఖ్యలో ఉత్పత్తి చేసి, తోటల్లో వదలడం ద్వారా ఈ సర్పిలాకార తెల్లదోమను సమర్థవంతంగా అరికట్టవచ్చు.
- ఈ పురుగు ఉనికిని గమనిస్తూ సకాలంలో తగిన సస్యరక్షణ చర్యలు పాటించిన తర్వాత మాత్రమే నర్సరీల నుంచి మొక్కలు సరఫరా చేయాలి. లేకపోతే ఈ పురుగు త్వరగా ఇతర ప్రాంతాలకు వ్యాప్తిచెంది, అపారనష్టం కలుగజేస్తుంది.

ఇటీవల అంబాజీపేట శాస్త్రవేత్తలు తూర్పుగోదావరి జిల్లా కడియపులంక శ్రీ సత్యదుర్గాలక్ష్మీ నర్సరీ, పశ్చిమ గోదావరి జిల్లా కలవలపల్లి గ్రామాలలో ఎన్‌కార్సియా తల్లిపురుగులను రైతులకు పంపిణీ చేశారు. వీటిని కొబ్బరిమొక్కలకు పిన్ చేయాలి. తద్వార వాటి సంతతి వృద్ధి చెంది, తెల్లదోమను తినేస్తుంది. ఎన్‌కార్సియాలను అతికించిన మొక్కలపై ఎటువంటి పురుగు మందులూ చల్లరాదు. పురుగు మందులు వినియోగిస్తే రైతులకు మేలు చేసే ఎన్‌కార్సియాలు ముందే చనిపోతాయి. శాస్త్రవేత్తలు ఇచ్చిన స్టిక్కర్‌లో తల్లిపురుగు ఉంటుంది. దీని సంతతి పూర్తిస్థాయిలో వృద్ధి చెందేందుకు సుమారు 40 రోజులు పడుతుంది.

డా॥ఎన్.బి.వి. చలపతిరావు
ప్రధాన శాస్త్రవేత్త
హార్టీకల్చర్ రీసెర్చ్ స్టేషన్
అంబాజీపేట, తూ.గో. జిల్లా.

మనవి

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. దక్షిణాది ధాన్యాగారంగానూ ప్రసిద్ధి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవగర్ర, అటువంటి కీలకమైన ఈ రంగానికి సంబంధించిన సమాచారం, శాస్త్రవేత్తల, నిపుణుల విశ్లేషణలు, ఇంటర్వ్యూలు, గణాంకాలతో 'అగ్రిప్లస్' ప్రతి శుక్రవారం మీ ముందుకొస్తోంది. దీనిపై మీ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలియజేయగలరు. దీనిని మరింతగా పరిపుష్టం గావించేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులు తమ వంతు తోడ్పాటును అందించాలని మనవి.

మా చిరునామా :

'అగ్రిప్లస్', ప్రజాశక్తి దినపత్రిక, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
ఇ-మెయిల్ : editorprajasakthi@gmail.com

కషాయాలు తాగించాలి

ఈ వారం **విజ్ఞాన వాణి**

గొర్రెల/మేకల కాపలదారులు ఫిబ్రవరి మాసంలో ఆచరించవలసిన పద్ధతుల గురించి పశువైద్యులు అందిస్తున్న సూచనలు. వీటిని పాటించడం వల్ల జీవాలు ఎదుర్కొనే వివిధ సమస్యలను నివారించడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చును. ఈ సూచనలను ఆయా ప్రాంతాలకు, పరిస్థితులకు అనుకూలంగా పాటించడం మంచిది.



ఫిబ్రవరి నెలలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కషాయాలు తాగిస్తే మంచిది. అలాగే పిల్లల్లో డయేరియా ఉంటే, తగు వైద్యం చేయించాలి. పిల్లలకు పాలు, మేత బాగా లభ్యమయ్యేటట్లు చూడాలి. అలా అయితే బాగా పెరిగి త్వరగా పెద్దవుతాయి. లాభదాయకమైన జీవాల పెంపకానికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- పంట కోసిన పొలాల్లో, బీడు భూముల్లో, అడవుల వెంట పచ్చిమేత బాగా లభిస్తుంది. కాబట్టి అలాంటి చోట్ల గొర్రెల్ని మేకల్ని మేపాలి.
- జీవాల్ని చలికి, తేమకు గురి కానివ్వకూడదు.
- రాబోయే నెలల్లో చూడి కట్టటానికి అదనంగా దాణా పెట్టాలి.
- పాలు తాగే పిల్లలు మూడు నెలలయితే, తల్లి నుంచి వేరు చేయాలి.
- గోమార్లు, పిడుదులు మొదలగునవి లేకుండా చర్యలు తీసుకోవాలి.
- గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి. ఇవి ఆరు నెలలకొకసారి అవసరం.
- పచ్చిమేత ఎక్కువగా ఉంటే ఎండుమేతగా నిలువ చేయవచ్చు.



డాక్టర్.జి.రాంబాబు
పశువైద్యాధికారి, కడప.

పిల్లల్లారా.. రారండి!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



రంగులు వేయండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలోని చుక్కలను కలిపి రంగులు వేయండి!

పొడుపు కథ

రెక్కలు లేకున్నను
విశ్వమంతా పోవును,
సమాచారమందించును,
ఆత్మీయతల్ని పెంచును?

జోక్ :

తండ్రి : ఏంట్రా చింటూ! ఆ రాళ్లన్నీ తీసి వెనక ఎందుకు వేస్తున్నావు..?
చింటు : మొన్న నాయనమ్మ నాలుగు రాళ్లు వెనకెయ్యరా అని నీతో చెప్పింది కదా అందుకే వేస్తున్నా..!

మనుషులూ పక్షిలా ఎగరవచ్చు!

పిల్లలూ..! పక్షిని చూస్తే మనకు ఏమనిపిస్తుంది. మనకూ రెక్కలుంటే ఎంచక్కా గాలిలోకి ఎగిరితే బాగుండు అనిపిస్తుంది కదూ! 15వ శతాబ్దిలో లియోనార్డో డావిన్సి పక్షులవలె గాలిలోకి ఎగరడానికి వీలుగా రెక్కలను అమర్చిన యంత్రాన్ని తయారుచేశాడు. అదే ఆర్నిథోప్టర్ యంత్రం. పిల్లలూ మనకు తెలిసినంత వరకు లియోనార్డో డావిన్సి గణిత శాస్త్రజ్ఞుడు. అంతేకాదు ఇతడు పేరెన్నికగన్న చిత్రకారుడు, శిల్పి, ఇంజనీరు, సంగీత విద్వాంసుడు కూడా. ఆయన గాలి తరంగాలను, పక్షులు ఎగరటాన్ని బాగా అధ్యయనం చేశాడు. పక్షులు తమ రెక్కలను కిందికి, పైకి ఆడించటం వలన ఎగరగలుగుతున్నాయని, మనిషి కూడా రెక్కల సహాయంతో ఎగరగలడన్న నిర్ణయానికి వచ్చాడు. ఈ ఆలోచనకు రూపం ఇవ్వటానికి ప్రయత్నించాడు. కదిలే రెక్కలున్న యంత్రాన్ని తయారుచేశాడు. ఎగిరే వ్యక్తి కాళ్ళు, చేతులను కదపటం ద్వారా రెక్కలను ఆడించవచ్చు. 'ఆర్నిథోప్టర్' సహాయంతో అనేకమంది గాలిలో ఎగరడానికి ప్రయత్నించారు. 1650లో రాబర్ట్‌హుక్ దీనితో ఇంగ్లాండులో ప్రయోగం చేసాడు. అతను విజయవంతంగా ఎగరగలిగినట్లు ప్రకటించాడు. కానీ గాలిలో నిలబడటం చాలా కష్ట తరమైనదన్నాడు. గాలిలో ఎగరటానికి ఈకలు అవసరంలేదని పేర్కొన్న మొదటి వ్యక్తి. 1890 ప్రాంతంలో ఆక్టేవ్‌చాన్యూట్ ఈ యంత్రం సహాయంతో అందరూ తేలికగా ఎగరలేకపోవటానికి గలకారణాలను వివరించాడు. మనిషి ఎగరటానికి కావలసినంత శక్తిని కాళ్ళు, చేతులలో పెంచలేకపోతున్నందుకు ఎగరలేకపోతున్నాడని తేల్చి చెప్పాడు. కాలక్రమేణా ఆర్నిథోప్టర్ రూపకల్పనలో అనేక మార్పులూ జరిగాయి. చివరికి నేడు వాడుకలో ఎగురగలిగే ఆర్నిథోప్టర్‌లు రూపంపొందాయి. దీని సహాయంతో నేరుగా పైకి, ముందుకు, వెనుకకు, కిందకి ఎగరవచ్చు లేదా గాలిలో నిశ్చలంగా తేలియాడవచ్చు. ★






కుందేలు తెలివి

అనగనగా ఒక అడవిలో కుందేలు ఉండేది. అది ఒకరోజు ఆహారం కోసం బయలుదేరింది. దానికి దారి మధ్యలో నక్క ఎదురైంది. అప్పుడు నక్క ఆహారం కోసం కుందేలును "నీ స్నేహితులైన అడవికోళ్ళు ఎక్కడున్నాయో చెప్పు. లేకపోతే నిన్ను తినేస్తా" అంటూ బెదిరించింది. కుందేలు ఆలోచనలో పడింది. దానికి ఒక ఉపాయం తట్టింది. అది నక్కతో ఇలా చెప్పింది. "సరే...నా వెంట రా. చూపిస్తాను." అని దాన్ని తీసుకెళ్ళి ఒక గుహను చూపించి లోపలికి వెళ్ళమంది. వెంటనే నక్క ఆ గుహలోకి వెళ్ళింది.



కుందేలు అక్కడి నుంచి వెళ్ళిపోయింది. గుహలో ఉన్న సింహం నక్కను చూసి దాని వెంటపడి తినేసింది. ఈ విషయం నక్కపిల్లకు తెలిసి కుందేలును చంపడానికి బయలుదేరింది. కుందేలు దగ్గరకు వెళ్ళి, "నిన్ను తినేస్తాను." అంది. కుందేలు మనసులో "ఓహో...ఇది నక్కపిల్ల అనుకుంటా!" అని ఊహించింది. కుందేలుకు ఒక ఉపాయం తట్టింది. నక్కపిల్లతో, "నాతో వస్తే నీకు కొన్ని బాతులను చూపిస్తాను. వాటిని తిన్నాక నన్ను తిందువులే" అనింది. నక్కపిల్లకు బాతు అనగానే నోరూరింది. వెంటనే బాతులను చూపించు అని తొందరపెట్టింది. కుందేలు దానిని ఒక చెట్టు దగ్గరకు తీసుకెళ్ళి, "బాతులు ఆ చెట్టు వెనక వైపు ఉన్నాయి వెళ్ళి తినిరా." అంది. వెంటనే నక్కపిల్ల అక్కడికి వెళ్ళింది. కుందేలు వెంటనే తన ఇంటికి వెళ్ళిపోయింది. నక్కపిల్ల అక్కడికి వెళ్ళగానే రేసుకుక్కలు కనిపించాయి. వాటిని చూసి నక్కపిల్ల వెంటనే పరిగెత్తింది. రేసుకుక్కలు దాని వెంటపడ్డాయి. నక్కపిల్ల పరుగెత్తి పరుగెత్తి తప్పించుకుంది. దానికి చావుతప్పి కన్నులొట్టపోయినట్లయ్యింది. ఇంకెప్పుడూ అది కుందేలు జోలికి వెళ్ళలేదు.



శాఖమూరి వివేక్
4 వ తరగతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్,
యర్రగొండపాలెం.

క్రీడారంగంపై శీతకన్ను

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)
2018-19 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థికమంత్రి అరున్‌జైట్లీ సమర్పించిన బడ్జెట్‌లో క్రీడారంగానికి నామమాత్రపు పెంపుదల చేశారు. గురువారం పార్లమెంట్‌లో సమర్పించిన బడ్జెట్‌లో క్రీడల అభివృద్ధికి కేవలం 350 కోట్ల రూపాయలను మాత్రమే పెంపుదల చేశారు. ఈ పెంపుదల క్రీడలకు, క్రీడాకారుల ప్రోత్సాహానికి ఏమాత్రం ఉపయోగపడని సరిపోయేవిధంగా లేదు. 2017 (గత ఏడాది) ఫిబ్రవరిలో ప్రకటించిన బడ్జెట్‌లో 1,592 కోట్ల రూపాయలను ప్రకటించగా... 2018 సంవత్సరానికి కేటాయింపులను రూ. 1,943 కోట్లకు పెంచారు. ఈ ఏడాదిలో భారతజట్టు ఆసియా గేమ్స్ మరియు కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొననుంది. ఖేలో ఇండియాకు 140 నుండి 350 కోట్ల రూపాయలకు పెంచగా... క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి కేవలం 50 లక్షల రూపాయలను మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు.

- బిజెపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'ఖేలో ఇండియా'కు మాత్రం గత ఏడాది 140 కోట్ల రూపాయలు ప్రకటించగా... ఈ ఏడాది దానిని అమాంతం రూ.350 కోట్లకు పెంచుకుంది.
- దేశవ్యాప్తంగా ప్రతిభావంతులను వెలికి తీయడానికి కేవలం 50 లక్షల రూపాయల నామమాత్రపు కేటాయింపు మాత్రమే చేసింది.
- 2018లో కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్ కోసం భారత్ అథ్లెట్లు సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో క్రీడలకు ఈ పెంపుదల ఎందుకూ సరిపోదు.
- గతంలో క్రీడలకు నామమాత్రపు పెంపుదల కారణంగా ఒలింపిక్స్‌లో భారీస్థాయిలో పాల్గొన్న భారత జట్టు క్రీడాకారులందరూ రిక్త హస్తాలతోనే తిరిగి వచ్చారు. కేవలం ఒక కాంస్య, రజిత పతకాలను మాత్రమే సాధించ గలిగారు.
- జాతీయ శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత భారత స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఉంది. గత ఏడాది ప్రకటించిన 481 కోట్ల రూపాయలలో ఇప్పటికే 416 కోట్ల రూపాయలను మాత్రమే మంజూరు చేసింది.
- వికలాంగుల క్రీడా ప్రోత్సాహానికి కేటాయింపును కేవలం లక్ష రూపాయలకు మాత్రమే పరిమితం చేసింది. గత ఏడాది 4 కోట్ల రూపాయలుగా ఉన్న దానిని భారీస్థాయిలో తగ్గించింది.
- స్పోర్ట్స్ ఫెడరేషన్ల సహాయ నిధిని మాత్రం 185 కోట్ల రూపాయల నుండి 302 కోట్ల రూపాయలకు పెంచారు.
- ఈశాన్య ప్రాంత క్రీడలకు మాత్రం గత ఏడాది 131.33 కోట్ల రూపాయలు కేటాయించగా... ఈ ఏడాది నుండి 148.4 కోట్లకు పెంచారు.
- జమ్మూ-కాశ్మీర్ క్రీడల కేటాయింపులో మాత్రం ఎటువంటి మార్పు చేయలేదు. ఇది గత ఏడాది కేటాయించిన 75 కోట్ల రూపాయలనే ఈ ఏడాదీ కొనసాగింది.
- జాతీయ సేవా పథకానికి మరీ ఘోరంగా 6.5 కోట్ల పెంపుదలను ప్రకటించింది. 2016-17ల నాటికి 137.50 కోట్ల రూపాయలుగా ఉంటే దానిని 144 కోట్ల రూపాయలకు మాత్రం పెంపుదల చేసింది.
- నేషనల్ స్పోర్ట్స్ అభివృద్ధికి ఫండ్‌ను మాత్రం 5 కోట్ల రూపాయల నుండి 2 కోట్ల రూపాయలకు తగ్గించింది.
- వికలాంగుల క్రీడల ప్రోత్సాహానికి మాత్రం విడిగా కేటాయింపులు జరగలేదు. ఖేలో ఇండియా కార్యక్రమం నుండి మాత్రమే వికలాంగుల క్రీడల ప్రోత్సాహానికి సహాయం అందజేయబడుతుందన్నారు.
- క్రీడల మంత్రిత్వశాఖ గత ఏడాది క్రీడల అభివృద్ధికి పెంపుదల చేసిన బడ్జెట్ కంటే 40 శాతం పెంపుదల మాత్రమే చేసింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి క్రీడలపై అమితాసక్తి ఉన్న కారణంగానే ఈ పెంపుదల చేస్తున్నట్లు అరుణ్ జైట్లీ తెలిపారు. "దేశంలో క్రీడల సంస్కృతిని పెంపొందించడం కోసం జాతీయ స్థాయిలో ఖేలో ఇండియా కార్యక్రమం క్రింద క్రీడాపోటీలు నిర్వహించబడుతున్నాయని అలాగే సమీప భవిష్యత్తులో గ్రామీణ క్రీడలను నిర్వహించనున్నామని జైట్లీ తెలిపారు.



కోహ్లీ, రహానే ముందుండి..

తొలి వన్డేలో భారత్ ఘన విజయం

టెస్ట్ సిరీస్‌ను ఓడిన టీమిండియా తొలి వన్డేలో దుమ్ము రేపింది. కుల్దీప్, చాహల్ బౌలింగ్ మాయాజాలం... కోహ్లి, రహానే బ్యాటింగ్ మెరుపులతో మ్యాచ్‌ను గెలుచుకుంది. మూడో వికెట్‌కు వీరిద్దరూ 189 పరుగుల రికార్డ్ భాగస్వామ్యం నిర్మించారు.

దర్బన్ : భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేయగా... ఆ లక్ష్యాన్ని టీమిండియా 45.3 ఓవర్లలో నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. కోహ్లి 105 బంతుల్లో 33వ సెంచరీని సాధించిన రెండో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లి (112) పరుగులు సాధించాడు. రహానే 79 పరుగులు సాధించి 3వ వికెట్‌గా అవుటయ్యాడు. కోహ్లి-రహానే మూడో వికెట్‌కు 189 పరుగుల రికార్డ్ భాగస్వామ్యం నిర్మించారు.

టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. సఫారీ జట్టు ఒకానొక దశలో 134/5తో కష్టాల్లో పడ్డ జట్టును సారథి డుప్లెసిస్ 120 (112 బంతుల్లో 11 ఫోర్లు, రెండు సిక్సర్లతో) పరుగులతో ఆదుకున్నాడు. అద్భుత శతకం సాధించి కోహ్లిసేన ముందు 270 పరుగుల లక్ష్యం నిలిపాడు. మ్యాచ్‌లో మణికట్టు స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్ (3/34), యజువేంద్ర చాహల్ (2/45) చెలరేగారు. దర్బన్ వేదికపై


రహానే 79 పరుగులు

అత్యధికం 290 పరుగులు మాత్రమే. సఫారీ జట్టు 30 పరుగుల వద్ద హషీమ్ ఆమ్లా (16) తొలి వికెట్‌ను కోల్పోయింది. మరో ఓపెనర్ డికాక్‌తో కలిసి డుప్లెసిస్ 53 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. చాహల్ వేసిన 14వ ఓవర్ ఆఖరి బంతికి డికాక్(34) ఎల్‌బీడబ్ల్యూ రూపంలో పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత డివిలియర్స్ స్థానంలో జట్టులోకి వచ్చిన మార్క్రమ్ 9 పరుగులు మాత్రమే చేసి చాహల్ బౌలింగ్‌లో పాండ్యాకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన డుమిని(12), మిల్లర్(7) పరుగులు మాత్రమే చేసి ఔట్ అయ్యారు. మిడిలార్డర్‌లో వచ్చిన క్రిస్ మోరిస్(37) మైదానంలో


డుప్లెసిస్ 120 పరుగులు

కాసేపు మెరుపులు మెరిపించి కుల్దీప్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో భారీ షాట్లతో పరుగుల వరద పారించిన డుప్లెసిస్(120) ఆఖరి ఓవర్‌లో క్యాచ్ ఔట్ అయ్యాడు. దీంతో దక్షిణాఫ్రికా 50 ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. భారత బౌలింగ్‌లో కుల్దీప్ 3, చాహల్ 2, భువనేశ్వర్, బుమ్రా ఒక వికెట్లు తీశారు.



అథ్లెటిక్స్ ఛాంప్ బెంగుళూరు, చెన్నై

ముగిసిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు జాతీయ అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా జరుగుతున్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల ఆలిండియా అథ్లెటిక్స్ పోటీల ఛాంపియన్‌షిప్‌ను పురుషుల విభాగంలో చెన్నై ఆర్‌ఎస్‌బి జట్టు, మహిళల విభాగంలో బెంగుళూరు ఆర్‌ఎస్‌బి జట్లు కైవసం చేసుకున్నాయి. ద్వితీయస్థానంలో మహిళల విభాగంలో జైపూర్ ఆర్‌ఎస్‌బి, బెంగుళూరు ఆర్‌ఎస్‌బి జట్లు నిలిచాయి. బెస్ట్ అథ్లెట్స్‌గా పురుషుల విభాగంలో బెంగుళూరు ఆర్‌ఎస్‌బికి చెందిన అనురూప్‌జాన్, మహిళల విభాగంలో నిత్య నిలిచారు. విజేతలకు బహుమతులను రాష్ట్ర సివిల్ సర్వీస్ శాఖామాత్యులు ప్రత్తిపాటి పుల్లారావు అందజేశారు.

క్వార్టర్‌ఫైనల్‌కు సింధూ, సైనా

శ్రీకాంత్ ఔట్



న్యూఢిల్లీ : డిఫెండింగ్ ఛాంపియన్, నెంబర్‌వన్ సీడ్ పి.వి. సింధూ, సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ ఇండియా ఓపెన్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండోరౌండ్లో పి.వి. సింధూ 21-10, 21-14 పాయింట్ల తేడాతోనూ...సైనా నెహ్వాల్ 21-12, 21-11తో... కశ్యప్ 19-21, 21-19, 21-12 పాయింట్ల తేడాతో ప్రత్యర్థులపై గెలుపొంది క్వార్టర్ ఫైనల్లోకి దూసు కెళ్ళారు. భారత్‌కే చెందిన 2వ సీడ్ శ్రీకాంత్ 19-21, 17-21 పాయింట్ల తేడాతో మలేషియాకు చెందిన జుల్కర్నన్ చేతిలో ఓడి టోర్నీనుండి నిష్క్రమించాడు.

మేరీ కోమ్‌కు పతకం

న్యూఢిల్లీ : ఇండియా ఓపెన్ 48 కిలోల మహిళల బాక్సింగ్ విభాగంలో మేరీకోమ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. గురువారం త్యైగ్రాజ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో ఫిలిప్పీన్స్‌కు చెందిన జోషీపై 4-1 పాయింట్ల తేడా గెలుపొందింది. ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్, ఒలింపిక్ కాంస్య పతక విజేత అయిన కోమ్ సెమీఫైనల్లోనూ మంగోలియాకు చెందిన అల్టాన్సెత్సెగ్ గెలుపొందడం ద్వారా ఫైనల్‌బెర్త్‌కు చేరింది.

పాక్‌కు మూడో స్థానం

క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్‌లో జరుగుతున్న అండర్-19 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ జట్టు మూడోస్థానంలో నిలిచింది. గురువారం ఆఫ్ఘనిస్థాన్‌తో జరగాల్సిన మ్యాచ్ రాత్రి నుంచి ఆగకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు అయింది. దీంతో గ్రూప్-డిలో ముఖాముఖి తలపడినప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్తాన్ గెలిచిన కారణంగా పాకిస్తాన్ గెలుపొందినట్లు అంపైర్లు ప్రకటించారు.

కలెక్టరు ప్రభుత్వ పరువు తీస్తున్నారు

పోలవరం ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం

ఎంఎల్‌ఎపై కౌలురైతుల మండిపాటు


రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ మొడియం శ్రీనివాసరావు

ప్రజాశక్తి-జీలుగుమిల్లి
పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ ప్రభుత్వ పరువు తీస్తున్నారని టిడిపికి చెందిన పోలవరం ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల కోసం దర్భగూడెంలో సేకరించిన భూముల్లో చేతికొచ్చిన పంటను పాడు చేయొద్దని జిల్లాకు చెందిన మంత్రి పితాని సత్యనారాయణ, ఏలూరు ఎంపీ మాగంటి బాబు, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్, జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, స్థానిక శాసనసభ్యుడినైన తానూ కోరినప్పటికీ ఏకపక్ష నిర్ణయంతో పంటను ధ్వంసం చేసి ప్రభుత్వ పరువు తీశారని మండిపడ్డారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం, చీమలవారిగూడెం, రౌతుగూడెం, పాకలగూడెం గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ భూమిలో సాగుచేసిన పొగాకు, మొక్కజొన్న పంటను రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. దీంతో, పంట నష్టపోయిన అలవాల రాము కుటుంబాన్ని ఎంఎల్‌ఎ గురువారం పరామర్శించారు. పార్టీ తరపున ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసితులకు గృహనిర్మాణాలు, మోడల్ కాలనీ నిర్మాణాల్లో కలెక్టరు నిబంధనలు పాటించడం లేదన్నారు. గతేడాది జులైలో వేలేరుపాడు మండలానికి చెందిన నిర్వాసితులకు ప్రస్తుతం దర్భగూడెంలో పంట సాగుచేసిన భూములను సాగు భూములుగా పంపిణీ చేశారని తెలిపారు. అనంతరం అధికారుల రికార్డుల్లో ఆ భూమిని మోడల్‌కాలనీ నిర్మాణాలకు మార్పుచేశారని చెప్పారు. ఆ విషయం నిర్వాసితులకు తెలియజేయకుండా, భూమికి భూమి చూపకుండా ఇష్టానుసారం వ్యవహరించారని విమర్శించారు. ఆ భూముల్లో సాగు చేయొద్దని నిర్వాసితులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం వల్లే సాగు చేశారని తెలిపారు. చేతికొచ్చిన పంటను కలెక్టరు దున్నించివేయడం వల్ల పార్టీ, ప్రభుత్వ పరువు రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట జీలుగుమిల్లి జెడ్‌పిటిసి సభ్యులు బాసిన రాజబాబు, వైస్ ఎంపిపి గూడపాటి అరుణకుమార్, టిడిపి మండల అధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం ఉన్నారు.

టిడిపి ఫ్లెక్సీలు చించివేత

దర్భగూడెంలో కౌలురైతులు, గ్రామస్తులు టిడిపిపై నిప్పులు చెరిగారు. గ్రామంలోని టిడిపి ఫ్లెక్సీలను చించేశారు. టిడిపి స్తూపం చుట్టూ కట్టెలు వేసి నిప్పంటించారు. పరామర్శించేందుకు గురువారం దర్భగూడెం వచ్చిన ఎంఎల్‌ఎపైనా కౌలు రైతులు మండిపడ్డారు. పంటను కాపాడలేకపోయిన నాయకులు ఎందుకంటూ ప్రశ్నించారు.

సంస్కృతి, సంప్రదాయాలు మర్చిపోతే గుర్తింపు ఉండదు

సిలికానాంధ్ర వర్సిటీ వార్షికోత్సవంలో లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతే గుర్తింపు, భవిష్యత్తు ఉండవని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కాలిఫోర్నియాలో నిర్వహించిన సిలికాన్ ఆంధ్రా యూనివర్సిటీ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. జన్మభూమి, సంక్రాంతి వంటి సమయాల్లో రాష్ట్రానికి వచ్చి పిల్లలకు మన సంప్రదాయాలు తెలిసేలా చేయాలని కోరారు. తెలుగు భాష మీద పరిశోధన జరగాలని, పరిశోధన వేదిక ఏర్పాటుకు సిలికాన్ ఆంధ్రా సహకారం కావాలన్నారు.

పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ

పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్‌కోలో పలు కంపెనీల ప్రతినిధులతో లోకేశ్ గురువారం భేటీ అయ్యారు. కెపిఎమ్జీ సిలికాన్ వ్యాలీ ఎగ్జిక్యూటివ్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఎపిలో పెట్టుబడులు పెట్టాలని పలు కంపెనీలను ఆహ్వానించారు. స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్ డీన్ జోనాతాన్ లెవిన్‌తో సమావేశమై ఎపిలో అభివృద్ధి గురించి వివరించారు. ఫాల్కన్ ఎక్స్‌కు స్టాన్‌ఫోర్డ్ భాగస్వామ్యం కావాలన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహించే సీడ్ యాసిలిరేటర్‌కు సహకారం అందిస్తామని, విద్యార్థులకు శిక్షణ ఇస్తామని, ఎపి ప్రభుత్వంతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటామని డీన్ తెలిపారు.

ఫైబర్‌గ్రిడ్‌ను ఉపయోగించుకుని వర్క్ ఫ్రం హోం పైలెట్ ప్రాజెక్టును నిర్వహిస్తామని ఫస్ట్ అమెరికన్ ప్రతినిధులు తెలిపారు. ఎపితో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని జనరల్ క్యాటలిస్ట్ ఎండి తెలిపారు.

మార్చి 31 లోగా రాష్ట్రమంతటా ఇ-ఆఫీస్ : సిఎస్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో మార్చి 31లోగా ఇ-ఆఫీస్ (పేపర్‌లెస్ కార్యాలయాలు) విధానం తీసుకురావటానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ తెలిపారు. ఇ-ఆఫీస్, ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ హాజరు అమలుకు సంబంధించి సచివాలయంలో గురువారం ఆయన ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఇ-ఆఫీస్ విధానం వల్ల ఫైళ్ల సత్వర పరిష్కారంతో పాటు ఉద్యోగులకు పనిభారం కూడా తగ్గుతుందన్నారు. పాలనను మెరుగుపర్చి ప్రజలకు మరింత సమర్ధంగా సేవలందించవచ్చన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఐటి సలహాదారు జె సత్యనారాయణ, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి ఎన్ శ్రీకాంత్, ఆర్థికశాఖ కార్యదర్శి మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

సాధారణ వాతావరణం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి
రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల పాటు సాధారణ వాతావరణ పరిస్థితులే కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. వారం రోజులుగా రాష్ట్రంలో ఎండలు ప్రభావం చూపిస్తున్న సంగతి తెలిసిందే. పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 35 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. రాత్రి వేళ ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గినా ప్రయాణాలు చేసిన వారికి చలి ప్రభావం చూపిస్తోంది. క్రమంగా మరింత వేడి పెరుగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68